

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



డిసెంబరు 15, 16 తేదీల్లో..
గ్రూప్‌-2 పరీక్షలు
కొత్త షెడ్యూల్‌ ప్రకటించిన టీజీపీఎస్సీ 14
రోజూ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ
సెప్టెంబరు 18 నుంచి డీఎడ్‌ పరీక్షలు

శుక్రవారం | 23-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 146
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: చవితి ఉ. 10.39 తదుపరి పంచమి; నక్షత్రం: రేవతి రా. 7.54 తదుపరి అశ్విని; వర్జ్యం: ఉ.8.59-10.26; దుర్ముహూర్తం: ఉ.8.39-9.22, మ.12.42-1.32; అమృతఘడియలు: సా.5.43-7.10; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.31 | వరంగల్‌
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సంతకాల కోసం కేసీఆర్‌, హరీశ్‌
ఒత్తిడి చేశారు

ఫోన్‌ చేసి.. సమస్య ఏమిటని తొందరపెట్టారు

బ్యారేజీల నిర్మాణం డిజైన్ల ప్రకారం జరుగుతోందా అనేది పరిశీలించలేకపోయా
నాటి ప్రభుత్వం అవకాశమే ఇవ్వలేదు.. 3డీ అధ్యయనం లేకుండా డిజైన్ల ఖరారు
సంతకం చేయడానికి నాలుగైదు రోజులు నిరాకరించా
బాధ్యత తనదేనంటూ కాళేశ్వరం ఈఎన్‌సీ లేఖ ఇచ్చాకే సంతకాలు పెట్టా
ఆ తర్వాత ఆ లేఖను తొలగించారు.. ఆర్టీఐ ద్వారా ఈ వివరాలు తెలిశాయి
మేడిగడ్డ డిజైన్లలో ఎల్‌అండ్‌టీ పాత్ర.. దీనికి ఆధారంగా 600 పేజీల ఈమెయిళ్లు
కాళేశ్వరం కమిషన్‌ సమక్షంలో వెల్లడించిన మాజీ ఈఎన్‌సీ ఎ.నరేందర్‌రెడ్డి


మాజీ ఈఎన్‌సీ ఎ.నరేందర్‌రెడ్డి

హైదరాబాద్‌, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల డిజైన్‌లు/డ్రాయింగ్‌లు సంపూర్ణంగా అధ్యయనం చేసే అవకాశాన్ని అప్పటి సీఎం కేసీఆర్‌, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు తమకు ఇవ్వలేదని మాజీ ఈఎన్‌సీ, సెంట్రల్‌ డిజైన్‌ ఆర్గనైజేషన్‌(సీడీవో) ఎ.నరేందర్‌రెడ్డి వెల్లడించారు. హడావుడిగా డిజైన్లు/డ్రాయింగ్‌లపై సంతకాలు చేయాలని కేసీఆర్‌, హరీశ్‌రావు, రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఈఎన్‌సీ బి.హరిరాం తనపై ఒత్తిడి చేశారన్నారు. 3 డీ అధ్యయనం తర్వాత డిజైన్లు/డ్రాయింగ్‌లు రూపొందించాల్సి ఉండగా... 2 డీ అధ్యయనం తర్వాతే వీటిని తయారు చేయాల్సిన పరిస్థితి ఒత్తిళ్ల కారణంగా నెలకొందని వెల్లడించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై విచారణలో భాగంగా గురువారం నరేందర్‌రెడ్డిని ప్రశ్నించారు. డిజైన్లు/డ్రాయింగ్‌లతో ముడిపడిన పలు అంశాలపై కమిషన్‌ ప్రశ్నలు సంధించింది. తమను తొందరపెట్టి, ఒత్తిళ్లకు గురి చేయడం ద్వారా ఆమోదించాల్సిన అనివార్యతను కల్పించారని నరేందర్‌రెడ్డి కమిషన్‌కు చెప్పారు. "కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) మార్గదర్శకాల ప్రకారం

మిగతా 14వ పేజీలో...

'గద్దర్‌' అవార్డుల విధివిధానాలకు
కమిటీ

నియమ నిబంధనల రూపకల్పన.. లోగో సిఫారసు బాధ్యత కూడా..
చైర్మన్‌గా ప్రముఖ దర్శకుడు బి.నర్సింగ్‌రావు 13
వైస్‌ చైర్మన్‌గా సినీ నిర్మాత దిల్‌రాజు.. మరో 14 మంది సలహా సభ్యులు


సీఎం రేవంత్‌ను కలిసిన మందకృష్ణ, చిత్రంలో మంత్రి దామోదర, మోత్కుపల్లి

ఎస్సీ వర్గీకరణ అమలుకు
ఉప కమిటీ!

విధివిధానాల ఖరారు కోసం మంత్రి దామోదర నేతృత్వంలో..
రాష్ట్ర ప్రభుత్వ యోచన
సీఎంను కలిసిన మంద కృష్ణ
రాహుల్‌, ఖర్గేలతో కూడా ఒప్పించాలని వినతి

హైదరాబాద్‌, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఒక ఉప కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి దామోదర రాజనర్సింహా నేతృత్వంలో ఈ కమిటీని ఏర్పాటు చేయాలని అనుకుంటోంది. ఎస్సీ వర్గీకరణను ఎలా అమలు చేయాలి? దాని విధివిధానాలు ఎలా ఉండాలనే అంశాల్ని ఈ కమిటీ పరిశీలిస్తుంది. వివిధ రాష్ట్రాల్లో వర్గీకరణను అమలు చేసేందుకు ఎలాంటి కసరత్తు చేస్తున్నారో కమిటీ వివరాలు సేకరిస్తుంది. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక ఇటీవల అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసింది. కొద్దికాలానికే సుప్రీంకోర్టు వర్గీకరణకు రాజ్యాంగ బద్ధత ఉందని ప్రకటించింది. తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణను అమలు పరిచే తొలి రాష్ట్రం తెలంగాణే

మిగతా 13వ పేజీలో...



వాళ్లను నమ్ముకొని
రోడ్డెక్కితే ఆయాసమే

మాయ, మోసం బీఆర్‌ఎస్‌ విధానం
మాఫీ జరుగుతుంది.. రోడ్డెక్కొద్దు
ఆర్నెల్ల కింద బొందపెట్టిన మీరే ఎలా రానిస్తున్నరు?
పదేళ్లలో వాళ్లు ఇచ్చిందెంత?
పది నెల్లలో మేం ఇచ్చిందెంత?
సెబీ స్కాంపై కేసీఆర్‌ వైఖరేంటి?
అదానీకి మోదీ దోచిపెడుతున్నా కేటీఆర్‌ మాట్లాడరే?
గుజరాత్‌ దుష్ట చతుష్టయం దేశాన్ని చెరబట్టింది: సీఎం రేవంత్‌



కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్‌ నిర్వహించిన నిరసనలో సీఎం రేవంత్‌, భట్టి, సల్మాన్‌ ఖుర్షీద్‌, దీపాదాస్‌ మున్షీ

హైదరాబాద్‌ సిటీ/రాంనగర్‌, అఫ్జల్‌గంజ్‌, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌ సన్నాసులను నమ్ముకుని రోడ్డెక్కితే ఆయాసం వస్తుందని.. ప్రభుత్వం ఉన్నదే రైతుల కోసమని, ప్రజా పాలనతో అందుబాటులో ఉంటూ, ఇబ్బందులు వింటూ పరిష్కారానికి కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఏ రైతుకు రుణ మాఫీ జరగకున్నా.. రుణం రాకపోయినా.. ఏ సమస్య ఉన్నా కలెక్టర్‌ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌ వేసి కూర్చొబెట్టిన

మిగతా 13వ పేజీలో...

మంత్రివర్గ విస్తరణకు వేళాయె
పీసీసీ అధ్యక్షుడి నియామకం కూడా! 13
నేడు రాహుల్‌, ఖర్గేతో రేవంత్‌ టీమ్‌ భేటీ



ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత 11
ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు

రేవంత్‌ది దైవద్రోహం

రుణమాఫీపై దేవుళ్ల మీద ఒట్టేసి మాట తప్పారు
గుళ్లలో ముక్కు నేలకు రాసి పాపపరిహారం చేసుకోవాలి.. ప్రజలకు క్షమాపణ చెప్పాలి
100% మాఫీ నిరూపిస్తే రాజీనామా చేస్తా
జనగామ రైతు ధర్నాలో హరీశ్‌రావు ధ్వజం
అందరికీ మాఫీ చేసేవరకూ ప్రభుత్వాన్ని వదలం
రేవంత్‌.. దమ్ముంటే రా తేల్చుకుందాం: కేటీఆర్‌
సూర్యాపేట తిరుమలగిరిలో కాంగ్రెస్‌-బీఆర్‌ఎస్‌ ఘర్షణ


జనగామలో బీఆర్‌ఎస్‌ రైతుధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు 11



క్రైమ్‌ సీన్‌నే మార్చేశారు!

ఆత్మహత్య అంటూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించారు 2
సుప్రీంకోర్టుకు సమర్పించిన స్టేటస్‌ రిపోర్టులో సీబీఐ
ఎఫ్‌ఐఆర్‌ లేకుండా పోస్టుమార్టమా? కేసు నమోదులో జాప్యమా?.. ఇంత నిర్లక్ష్యాన్ని 30 ఏళ్లలో చూడలే: సుప్రీం
15 రోజుల్లో శిక్ష పడేలా చట్టాలు.. మోదీకి మమత లేఖ

ముంబైలో బాలికపై
అత్యాచారం
సోషల్‌మీడియాలో పరిచయమైన యువకుడి దురాగతం
ప్రజాగ్రహంతో కానీ కేసు నమోదు చేయరా?
బద్లాపూర్‌ ఘటనపై బాంబే హైకోర్టు ఆగ్రహం



మంత్రి పదవి నుంచి తొలగిస్తే సంతోషిస్తా!

» సినిమా లేకపోతే బతకలేను.. 22 సినిమాలకు అంగీకరించా

» మలయాళ నటుడు, కేంద్రమంత్రి సురేష్ గోపి



కొచ్చి, ఆగస్టు 22: సినిమాల్లో నటిస్తున్నందుకుగాను తనను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగిస్తే సంతోషిస్తానని, రక్షింపబడినట్లుగా భావిస్తానని మలయాళ సినీ నటుడు, కేంద్ర పెట్రోలియం, పర్యాటకశాఖల సహాయమంత్రి సురేష్ గోపి తెలిపారు. సినిమా తన శ్వాస అని, అది లేకపోతే బతకలేనని పేర్కొన్నారు. ప్రస్తుతం 22 సినిమాలకు తాను ఆమోదం తెలిపానని, వాటిల్లో నటించేందుకు అనుమతి కోసం తమ పార్టీ సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిస్తే.. ఆయన తన విజ్ఞాపనపత్రాన్ని పక్కనపెట్టారని, అయినప్పటికీ అనుమతి ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. కేరళ చలనచిత్ర వాణిజ్య మండలి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ సురేష్ గోపి ఈ వివరాలు వెల్లడించారు.

బిట్స్ పిలానీలో సీనియర్ ఫ్యాకల్టీగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జి.సతీష్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీ వో) మాజీ చైర్మన్ డా.జి.సతీష్‌రెడ్డి ప్రముఖ శాస్త్ర సాంకేతిక విద్యా సంస్థ బిట్స్ పిలానీ (బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్)లో సీనియర్ ఫ్యాకల్టీగా చేరారు. జాతీయ భద్రతా రంగానికి సంబంధించి పరిశోధనలు, అన్వేషణలకు ఆయన సేవలందిస్తారని బిట్స్ పిలానీ ఓ ప్రకటనలో తెలిపింది. డీఆర్‌డీవోలో చేపట్టిన అత్యంత ప్రభావశీల ప్రాజెక్టుల్లో సతీష్ రెడ్డి కీలక భూమిక పోషించిన విషయం తెలిసిందే.

7 వేల కోట్లతో సైన్యానికి ఆయుధాలు

» తర్వాతి తరం ఆర్టిలరీ గన్స్ కోసం టెండరు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: భారత సైన్యం ఆయుధ సంపత్తిని పెంచేలా శక్తిమంతమైన, తేలికపాటి ఆర్టిలరీ గన్స్ కొనుగోలు దిశగా కీలక ముందడుగు పడింది. దేశీయంగా అభివృద్ధి చేసి, తయారు చేసే తర్వాతి తరం ఆర్టిలరీ గన్స్ కొనుగోలు కోసం భారత సైన్యం టెండరు జారీ చేసింది. తొలిదశలో సైన్యానికి 400 యూనిట్లు అవసరమని, పాత ఆయుధాలను మార్చడం ద్వారా ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కాంట్రాక్టు విలువ ఆధారంగా 50 శాతానికిపైగా స్వదేశీ పరికరాలతో ఈ ఆర్టిలరీ గన్‌లను భారత్‌లోనే రూపొందించాలని ఒప్పందంలో పేర్కొన్నారు. రూ.7000 కోట్ల విలువైన ఈ భారీ ప్రాజెక్టుపై లార్సన్ అండ్ టూబ్రో, భారత్ ఫోర్జ్, టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ వంటి ప్రైవేటు రక్షణ రంగ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి.

వైదిక ప్రార్థనలతో డెమొక్రటిక్ సదస్సు ప్రారంభం

చికాగో, ఆగస్టు 22: అమెరికాలోని చికాగోలో జరుగుతున్న డెమొక్రటిక్ జాతీయ సదస్సు (డీఎన్‌సీ) మూడవ రోజు వైదిక ప్రార్థనలతో ప్రారంభమయింది. మేరీలాండ్‌లోని శివ విష్ణు దేవాలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తున్న రాకేశ్ భట్ వేద మంత్రాల నడుమ ప్రార్థనలు నిర్వహించారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు మంచి జరిగేలా దీవించాలని ప్రార్థించారు. 'మన మధ్య భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. అయితే దేశం విషయంలో మనమంతా కట్టుగా ఉండాలి. అందరికీ సమన్యాయం వైపు అది మనల్ని నడిపిస్తుంది' అని రాకేశ్ భట్ ప్రవచించారు. బెంగళూరుకు చెందిన భట్ తమిళం, తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లీషు, తులు, సంస్కృత భాషల్లో ధారాళంగా మాట్లాడగలరు. 2013 జూలై నుంచి మేరీలాండ్‌లోని ఆలయంలో పూజారిగా ఉన్నారు.

టెక్సాస్‌లో 90 అడుగుల హనుమాన్ విగ్రహం

» చిన జియర్ నేతృత్వంలో ఘనంగా ప్రాణ ప్రతిష్ఠ

హ్యూస్టన్, ఆగస్టు 22: అమెరికా సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్రలో మరో నూతన అధ్యాయం ఆవిష్కృతమయింది. టెక్సాస్‌లో 90 అడుగుల ఎత్తైన హనుమాన్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎన్నో మైళ్ల దూరం నుంచే కనిపించే ఈ విగ్రహం ఆవిష్కరణ ఓ మైలురాయిలా నిలిచిపోతుంది. 'స్టాచ్యూ ఆఫ్ యూనియన్'గా పేరు పెట్టిన ఈ హనుమాన్ విగ్రహానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. భారతదేశం వెలుపల నిర్మితమయిన హనుమాన్ విగ్రహాల్లోకెల్లా ఇదే అత్యంత ఎత్తైన విగ్రహం. టెక్సాస్‌లో దీనిని మించినది లేదు. యూఎస్‌లో ఇది అతి ఎత్తైన మూడవ విగ్రహం. 151 అడుగుల ఎత్తుతో న్యూయార్క్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ మొదటి స్థానంలో ఉండగా, ఫ్లోరిడాలోని 110 అడుగుల పెగాసస్, డ్రాగన్ విగ్రహం రెండవ స్థానంలో నిలిచిందని నిర్వాహకులు చెప్పారు. షుగర్ లాండ్‌లోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఆవిష్కరించిన 'ది స్టాచ్యూ ఆఫ్ యూనియన్' హనుమాన్ విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఆగస్టు 15 నుంచి 18 వరకూ ఘనంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు చిన జియర్ స్వామి నేతృత్వంలో పూజారులు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో సాగాయి' అని నిర్వాహకులు ఓ ప్రకటనలో వెల్లడించారు.

రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాల ప్రదానం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: మొట్టమొదటి రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. గురువారం రాష్ట్రపతిభవన్‌లోని గణతంత్ర మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(బెంగళూరు) మాజీ డైరెక్టర్, బయోకెమిస్ట్ గోవింద్‌రాజన్ పద్మనాభన్‌ను దేశ అత్యున్నత సైన్స్ అవార్డుతో సత్కరించారు. అలాగే, 13 మందికి విజ్ఞాన్‌శ్రీ పురస్కారాలు, 18 మందికి విజ్ఞాన్ యువ శాంతి స్వరూప్ భట్నాగర్ బహుమతులు ప్రదానం చేశారు. దీంతోపాటు చంద్రయాన్-3 మిషన్‌లో పనిచేసిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు విజ్ఞాన్ టీమ్ అవార్డు అందజేశారు. ఈ అవార్డును చంద్రయాన్-3 మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరముత్తువేల్ స్వీకరించారు. అవార్డు గ్రహీతలందరికీ ఒక మెడల్‌తోపాటు సంబంధిత రంగాల్లో వారు కనబరిచిన ప్రతిభను తెలియజేస్తూ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

బంగ్లాలో హిందూ టీచర్ల బలవంతపు రాజీనామా

న్యూఢిల్లీ, ఆగస్టు 22: తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడి రెండు వారాలు దాటినా బంగ్లాదేశ్‌లో ఇంకా పరిస్థితులు సాధారణస్థితికి రాలేదు. జర్నలిస్టులపై నిర్బంధం కొనసాగుతోంది. హిందూ ఉపాధ్యాయులతో బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. వివిధ పాఠశాలలు, కాలేజీలలో పనిచేస్తున్న సుమారు 70 మంది హిందూ ఉపాధ్యాయులు బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. వీరిలో అజీమ్‌పూర్ గవర్నమెంట్ గర్ల్స్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గీతాంజలి బారు వ కూడా ఉన్నారు. ఈమెను విద్యార్థులు చెట్టుకు కట్టేయగా, ఆర్మీ జోక్యం చేసుకొని విడిపించింది. అలాగే, హోలీ రెడ్ క్రిసెంట్ నర్సింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సోనాలి రాణీ దాస్ కూడా బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చింది.

షేక్ హసీనా డిప్లొమాటిక్ పాసుపోర్టు రద్దు!

ఢాకా, ఆగస్టు 22: పదవీచ్యుతికి గురయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిప్లొమాటిక్ పాసుపోర్టును రద్దు చేసేందుకు మహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఆమెతో కలిసి పనిచేసిన మంత్రులు, పార్లమెంటు సభ్యులు, కాంట్రాక్టులు రద్దయిన అధికారుల డిప్లొమాటిక్ పాసుపోర్టులను కూడా రద్దు చేయనుంది.

వక్ఫ్ బిల్లుపై జేపీసీ సమావేశాలు షురూ..

న్యూఢిల్లీ, ఆగస్టు 22: వక్ఫ్ (సవరణ) బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తన మొదటి సమావేశాన్ని గురువారంనాడిక్కడ నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రతిపాదిత చట్టంలోని పలు నిబంధనలపై సభ్యులైన ప్రతిపక్ష ఎంపీలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సమావేశ సమయంలో వాగ్వాదాలు చోటు చేసుకున్నప్పటికీ చాలా గంటల పాటు వివిధ పార్టీల సభ్యులు కూర్చుని బిల్లులోని నిబంధనలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అలాగే సూచనలు ఇచ్చారు. కమిటీ తదుపరి సమావేశం ఆగస్టు 30న జరగనున్నట్టు ఓ సభ్యుడు తెలిపారు. కాగా, వక్ఫ్ సవరణ బిల్లును తాము వ్యతిరేకిస్తామని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు (టీడీపీ), బిహార్ సీఎం నితీశ్ కుమార్ (జేడీ-యూ) ముస్లిం సంస్థలకు హామీ ఇచ్చారని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా రహ్మానీ గురువారం తెలిపారు. ఏఐఎంపీఎల్‌బీ, జమియాత్ ఉలేమా-ఇ-హింద్, ఇతర ముస్లిం సంస్థలు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించిన సందర్భంగా రహ్మానీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా ప్రతిపాదిత చట్టాన్ని ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సమావేశంలో ముస్లిం సంస్థలు డిమాండ్ చేశాయి.

ప్రజాగ్రహంతో కానీ కేసు నమోదు చేయరా?

బద్లాపూర్ ఘటనపై బాంబే హైకోర్టు ఆగ్రహం

ముంబై, ఆగస్టు 22: మూడు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు బాలికలపై పాఠశాలలో స్వీపర్ లైంగిక దాడికి పాల్పడిన ఘటన మహారాష్ట్రలో కలకలం సృష్టిస్తోంది. ఈ కేసును గురువారం సుమోటోగా విచారణ చేపట్టిన బాంబే హైకోర్టు.. పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల నిరసన పెల్లుబికితే కానీ కేసు నమోదు చేయరా అని నిలదీసింది. బాధిత బాలికల తల్లిదండ్రులు గంటలకొద్దీ పోలీసుస్టేషన్‌లో పడిగాపులు పడాలా అని ప్రశ్నించింది. ఈ నేరాన్ని రిపోర్టు చేయనందుకు పాఠశాల బాధ్యులపైనా 'పోక్సో' చట్టం కింద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిల్లలకు పాఠశాలలే సురక్షితమైన ప్రదేశాలు కాకపోతే ఇక విద్యాహక్కు గురించి మాట్లాడటంలో ఎలాంటి అర్థం లేదని వ్యాఖ్యానించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్‌లో ఇద్దరు బాలికలపై పాఠశాల టాయిలెట్‌లో అక్షయ్ షిండే అనే స్వీపర్ ఈ నెల 13న లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు శనివారం నిందితుడిని అరెస్టు చేశారు. అతడికి ఉరిశిక్ష విధించాలన్న డిమాండ్‌తో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యం, పోలీసులపైనా కఠిన చర్యలు తీసుకోవాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు వేలాది మంది మంగళవారం బద్లాపూర్ పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆ పాఠశాల ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు బద్లాపూర్‌లో ఎనిమిది గంటల పాటు రైలు పట్టాలపై బైఠాయించారు. ఈ నేపథ్యంలో బాంబే హైకోర్టు పోలీసులపై ఘాటు వ్యాఖ్యలు చేసింది.

ముంబైలో బాలికపై అత్యాచారం

» సోషల్‌మీడియాలో పరిచయమైన యువకుడి దురాగతం

ముంబై, ఆగస్టు 22: మహారాష్ట్రలో బద్లాపూర్ ఘటనపై నిరసనలు కొనసాగుతుండగానే.. ముంబైలో మరో బాలికపై అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. సోషల్‌మీడియాలో పరిచయమైన 13 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లిన ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక, ఆమె కుటుంబసభ్యుల ఫిర్యాదుతో నిందితుడిని అరెస్టు చేసి, అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వకోలా పోలీసులు వెల్లడించారు. 21 ఏళ్ల నిందితుడు ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడని.. బాధితురాలు అతడికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఒకసారి కలవాలని నిర్ణయించుకుని.. ఈనెల 15న వారిద్దరూ బయటికెళ్లారని చెప్పారు. ముందుగా అంధేరిలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు.. తర్వాత తన సొంతూరికని చెప్పి గుజరాత్‌కు తీసుకెళ్లి అక్కడ పలుమార్లు అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు వివరించారు. ఆ తర్వాత ఇంటికి చేరిన బాధితురాలు.. కుటుంబ సభ్యులకు తనపై జరిగిన ఘోరాన్ని తెలిపిందన్నారు. బాధితురాలితో కలసి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా.. నిందితుడిని గుర్తించి గోరేగావ్‌లో అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

క్రైమ్ సీన్‌నే మార్చేశారు!

ఆత్మహత్య అంటూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించారు.. అంత్యక్రియలు జరిగాక ఎఫ్ఐఆర్ నమోదు దిగ్భ్రాంతికరం

» సుప్రీంకోర్టుకు సమర్పించిన స్టేటస్ రిపోర్టులో సీబీఐ

» కోల్‌కతా పోలీసుల తీరు అత్యంత లోపభూయిష్టం: సుప్రీం కన్నెర్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 22: యావద్దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతిలోకి నెట్టిన కోల్‌కతా వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనకు సంబంధించి ఆర్జీకర్ ఆస్పత్రిలో క్రైమ్ సీన్‌ను మార్చేశారని సీబీఐ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఉదయం అత్యాచారం, హత్య జరిగితే పోస్టుమార్టం నిర్వహించి.. అంత్యక్రియలు ముగిశాక దాదాపు అర్ధరాత్రి 11:45 గంటలకు కోల్‌కతా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని.. "ఇది అత్యంత దిగ్భ్రాంతికరమైన వాస్తవం" అని సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది. పైగా.. వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందంటూ పోలీసులే తల్లిదండ్రులకు సమాచారమిచ్చి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని.. ఆ తర్వాతే హత్య అని చెప్పారని సీబీఐ తీవ్రంగా ఆక్షేపించింది. కేసులో వాస్తవాలను తొక్కిపెడుతున్నారనే అనుమానంతో హతురాలి సహచర వైద్యులు వీడియోగ్రఫీకి పట్టుబట్టడంతోనే పోస్టుమార్టం ప్రక్రియను వీడియో తీశారని నివేదికలో పేర్కొంది. కేసులో ఒక్క నిందితుడి ప్రమేయం ఉందనే బెంగాల్ పోలీసులు తేల్చారని పేర్కొంది. ఈ మేరకు సీబీఐ గురువారం తన స్టేటస్ రిపోర్టును సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం ముందు ఉంచింది. ఆర్జీకర్ ఆస్పత్రిలో క్రైమ్‌సీన్‌ను మార్చేశారంటూ సీబీఐ తమ రిపోర్టులో స్పష్టం చేయడంతో బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ తీరును దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్ర స్థాయిలో ఎండగట్టింది. బెంగాల్ పోలీసులు వ్యవహరించిన తీరు నిర్లక్ష్యపూరితంగా ఉందని.. హత్యాచార ఘటన తర్వాత నిర్వహించాల్సిన ప్రక్రియను ఏమాత్రం అనుసరించలేదని మండిపడింది. "ఈ హత్యాచార కేసు ప్రక్రియలో మీ ప్రభుత్వం వ్యవహరించిన విధానాన్ని నా 30 ఏళ్ల వృత్తిపరమైన జీవితంలో ఎన్నడూ చూడలేదు" అని బెంగాల్ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన న్యాయ బృందాన్ని ఉద్దేశించి ధర్మాసనంలోని సభ్యుడైన న్యాయమూర్తి జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు.

ఎఫ్ఐఆర్ లేకుండా పోస్టుమార్టమా?

హత్యాచారం కేసును సుమోటోగా స్వీకరించిన ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. హత్యాచార కేసులో పోలీసులు అనుసరించిన ప్రక్రియపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. ఓ అసహజ మరణంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే పోస్టుమార్టం నిర్వహించడంపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా.. కేసు నమోదులో బెంగాల్ పోలీసులు తీవ్ర జాప్యం చేయడమనేది 'అత్యంత కలవరపాటుకు గురిచేసే అంశం' అని న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ మిశ్రా వ్యాఖ్యానించారు. "జరిగింది అసహజ మరణం.. అదీ ఉదయం పూట. మరి.. పోస్టుమార్టం చేసిన తర్వాత ఎప్పుడో రాత్రి క్రైమ్‌సీన్‌ను అధీనంలోకి తెచ్చుకున్నారు. క్రైమ్‌సీన్‌ను సీజ్ చేయడంలో పోలీసులు ఎందుకింత ఆలస్యం చేశారు" అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. హత్యాచార ఘటన, వైద్యుల భద్రతపై ఆందోళన చేస్తున్న వైద్యసిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని కోరుతూ వారిపై ఎలాంటి చర్యలూ ఉండబోవని తాము భరోసా ఇస్తున్నామని పేర్కొన్నారు.



కాగా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు తమ ఆందోళనను విరమించారు. అయితే బెంగాల్‌లోని వైద్యులు మాత్రం ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, అత్యాచార దోషులకు కఠిన శిక్షలు పడేలా కేంద్ర చట్టాలను మరింత బలోపేతం చేయాలని బెంగాల్ సీఎం మమత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ప్రధాని మోదీకి

ముందురోజే కన్నేశాడా?

హతురాలైన జూనియర్ వైద్యురాలిపై ఘటనకు ముందురోజే నిందితుడు సంజయ్ రాయ్ కన్నేశాడా? సీబీఐలోని ఓ అధికారి మాటలు ఇదే సూచిస్తున్నాయి. ఘటనకు ముందు రోజు అంటే.. ఆగస్టు 8న ఉదయం 11 గంటలకు ఆర్జీకర్‌లోని ఛాతీ విభాగం వద్ద జూనియర్ వైద్యురాలు తన నలుగురు సహచరులతో మాట్లాడుతుండగా.. అక్కడ సంజయ్ రాయ్ తచ్చాడినట్లు సీసీ ఫుటేజీ ద్వారా సీబీఐ తేల్చింది. సీబీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆ రోజు ఆస్పత్రిలో ఛాతీ విభాగం వద్ద జూనియర్ వైద్యురాలు, ఆమె స్నేహితులవైపు రాయ్ కొద్దిసేపు తదేకంగా చూసి.. అక్కడి నుంచి వెళ్లాడు. ఆరోజు రాత్రి కొందరు జూనియర్ వైద్యులతో కలిసి సంజయ్ రాయ్ డిన్నర్‌కు వెళ్లి.. అర్ధరాత్రి ఒంటి గంటకు థర్డ్ ఫ్లోర్‌లోని కాన్ఫరెన్స్ హాల్లోకి ప్రవేశించాడు. అక్కడికి 2:30 గంటలకు జూనియర్ వైద్యురాలొచ్చి, అతడితో ఏదో మాట్లాడి వెళ్లింది. రాయ్ మళ్లీ.. ఆస్పత్రిలోకి 9వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు ప్రవేశించాడు. నేరుగా జూనియర్ వైద్యురాలు నిద్రిస్తున్న కాన్ఫరెన్స్ హాల్లోకి వెళ్లాడు.



వేణూ శారదం

భర్త సీఎస్‌గా రిటైరయిన వెంటనే భార్యకు ఆ స్థానం

» కేరళలో అరుదైన సందర్భం

తిరువనంతపురం, ఆగస్టు 22: కేరళ అధికార వర్గాల్లో ఇప్పుడు ఒకటే చర్చ. చరిత్రలో ఆసక్తికరమైన సందర్భం ఆసన్నమవుతోందని చెప్పుకొంటున్నారు. అత్యంత కీలకమైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) పదవిని భార్యాభర్తలు నిర్వహించనుండడమే ఇందుకు కారణం. ప్రస్తుత సీఎస్ డాక్టర్ వి. వేణు ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటి రోజునే ఆయన భార్య, స్థానిక స్వపరిపాలన శాఖ అదనపు చీఫ్ సెక్రటరీ శారదా మురళీధరన్ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. మధ్యలో ఎలాంటి విరామం లేకుండానే ఇద్దరి పాలన కొనసాగనుంది. ఇద్దరూ 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారులే. పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలులో దిట్టగా శారదకు పేరుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకగా చేపట్టిన 'కుటుంబశ్రీ విషన్'ను ఆమె సమర్థంగా అమలు చేశారు. 2013లో కేంద్రంలో డిప్యుటేషన్‌లో ఉన్నప్పుడు కూడా నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా, పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. డాక్టర్ వేణు జన్మస్థలం కేరళలోని కొజికోడ్. అక్కడి కేంద్రీయ విద్యాలయ్‌లో పాఠశాల విద్య, మలబార్ క్రిస్టియన్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు.



కశ్మీరీలతో నాది రక్తసంబంధం

» రాష్ట్ర హోదా పునరుద్ధరణే 'ఇండియా' ప్రాధాన్యం: రాహుల్ గాంధీ

» ఖర్గేతో కలిసి ఎన్సీ చీఫ్ ఫరూక్‌తో భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: జమ్మూకశ్మీర్ ప్రజలతో తనది రక్తసంబంధమని, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించడమే ఇండియా కూటమి ప్రాధాన్యమని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. మరోపక్క, అసెంబ్లీ ఎన్నికల వేళ జమ్మూకశ్మీర్‌లో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) పార్టీల మధ్య పొత్తు కుదిరింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి శ్రీనగర్‌లో గురువారం పర్యటించిన రాహుల్ గాంధీ.. ఎన్సీ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. అంతకముందు కాంగ్రెస్ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కన్నా ముందే రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరుగుతుందని ఆశించామన్నారు. కానీ, ఎన్నికల ప్రకటన వెలువడిందని, రాష్ట్ర హోదా కూడా అలానే తిరిగి వస్తుందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఓ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. కాగా, ఈ భేటీ అనంతరం ఖర్గేతో కలిసి ఫరూక్ అబ్దుల్లా నివాసానికి వెళ్లిన రాహుల్ గాంధీ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, ఎన్సీ పార్టీల మధ్య పొత్తు కుదిరిందని ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఈ సమావేశం అనంతరం ప్రకటించారు. అలాగే, సీపీఐ(ఎం) నేత ఎంఎస్ తరిగామి కూడా తమతోనే ఉన్నారని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం ఇండియా కూటమితో కలిసి నడుస్తామని చెప్పారు. కాగా, 90 స్థానాలున్న జమ్మూకశ్మీర్ శాసన సభకు మూడు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1 తేదీల్లో పోలింగ్ జరగనుండగా అక్టోబరు 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఫాస్టాగ్‌లోకి ఆటోమెటిగ్గా సొమ్ము

ముంబై, ఆగస్టు 22: ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు (ఎన్‌సీఎంసీ)లోకి ఆటోమెటిగ్గా సొమ్ము భర్తీ చేయడానికి ఆర్బీఐ అనుమతిచ్చింది. ఇందుకు గాను ఈ-మాండేట్ ఫ్రేమ్‌వర్క్‌ను సవరించింది. ప్రస్తుతం ఈ-మాండేట్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం కస్టమర్ ఖాతా నుంచి సొమ్ము బదిలీ చేసేందుకు వినియోగదారుకు కనీసం 24 గంటల ముందు ప్రీ డెబిట్ సమాచారం అందించాల్సి ఉంది. సవరించిన నిబంధనల ప్రకారం ఫాస్టాగ్, ఎన్‌సీఎంసీ ఖాతాల్లో కస్టమర్ నిర్దేశించుకున్న పరిమితి కంటే నిల్వ తగ్గితే ఖాతాలోకి సొమ్ము ఆటోమెటిగ్గా భర్తీ అవుతుంది.

సమస్యలకు యుద్ధం పరిష్కారం కాదు

ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాలు ప్రపంచానికి చేటు.. చర్చలతో శాంతి పునరుద్ధరణకు మా మద్దతు

» సవాళ్లకు ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలే సమాధానం

» పోలండ్‌తో సామాజిక భద్రతా ఒప్పందం: ప్రధాని మోదీ

» నేడు ఉక్రెయిన్ పర్యటనకు.. తొలి భారత ప్రధానిగా రికార్డు

వార్సా, కీవ్, ఆగస్టు 22: సమస్యలకు యుద్ధ భూమిలో పరిష్కారం లభించదని ప్రధాని మోదీ అన్నారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాలు యావత్ ప్రపంచానికి చేటు అని పేర్కొన్నారు. చర్చలతో శాంతి పునరుద్ధరణకు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. పోలండ్ పర్యటనలో భాగంగా గురువారం మోదీ ఆ దేశ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం సహా పలు అంశాలపై ఆయనతో విస్తృతంగా చర్చించారు. పోలండ్‌తో సామాజిక భద్రతా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. తద్వారా శుద్ధ ఇంధనం, కొత్త టెక్నాలజీ రంగాల్లో బంధం బలోపేతం అవుతుందని తెలిపారు. టస్క్‌తో చర్చల అనంతరం ఇద్దరూ కలిసి మీడియాతో మాట్లాడారు. సంక్షోభాల కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం మానవత్వానికే సవాల్‌గా మోదీ అభివర్ణించారు. సాధ్యమైనంత త్వరగా శాంతి స్థిరత్వం స్థాపనకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఈ దిశగా మిత్ర దేశాలతో కలిసి వీలైనంత సాయం చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. కాగా, బుధవారం రాత్రి పోలండ్ రాజధాని వార్సా చేరుకున్న మోదీ.. 45 ఏళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధానిగా రికార్డు సృష్టించారు. చివరగా 1978లో మొరార్జీ దేశాయ్ పోలండ్ వెళ్లారు. ఇదే విషయాన్ని ప్రస్తావించిన మోదీ ఇరు దేశాల సంబంధాల్లో ప్రత్యేక సందర్భమని పేర్కొన్నారు. భౌగోళిక, రాజకీయ సవాళ్లకు ఐక్యరాజ్య సమితి విస్తరణే పరిష్కారం అని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో సహా భారత్-పోలండ్ ప్రతి అంతర్జాతీయ వేదికపై పరస్పరం సహకరించుకుంటున్న సంగతిని గుర్తుచేశారు. ప్రపంచ సంస్థలు ప్రతిదాంట్లోనూ సంస్కరణ అవసరమని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన రోజుల్లో పోలండ్ మీదుగా భారత విద్యార్థుల తరలింపునకు అనుమతి ఇచ్చినందుకు టస్క్‌కు మోదీ ధన్యవాదాలు తెలిపారు. కాగా, మోదీ ప్రత్యేక రైలులో పది గంటలు ప్రయాణించి శుక్రవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వెళ్లనున్నారు. 1991లో సోవియట్ యూనియన్ నుంచి విడిపోయి ఉక్రెయిన్ ఏర్పడ్డాక ఆ దేశంలో పర్యటిస్తున్న తొలి భారత ప్రధాని మోదీనే. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సమావేశమవుతారు.



పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో మోదీ కరచాలనం

బాంబు దాడులు.. భూ భాగాల ఆక్రమణలు

మాస్కో: రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య పరస్పర బాంబు దాడులు, భూ భాగాల ఆక్రమణలు కొనసాగుతునే ఉన్నాయి. సరిహద్దుల్లో ఉన్న ఓ రష్యా గ్రామాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. మరోవైపు తూర్పు ఉక్రెయిన్‌లోని ఓ గ్రామాన్ని తమ దళాలు ఆక్రమించాయని రష్యా తెలిపింది. రష్యా భూభాగంలోకి మరింతగా చొచ్చుకెళ్లేందుకు ఉక్రెయిన్ ప్రయత్నాలు చేస్తుండగా, వాటిని అడ్డుకుంటున్నామని రష్యా పేర్కొంది.

జాబిల్లిపై మట్టిని తెచ్చేద్దాం..!

» చంద్రయాన్-4 మిషన్ లక్ష్యం అదే

» జపాన్‌తో కలిసి చంద్రయాన్-5 ప్రాజెక్టు

» ఇస్రో తదుపరి మూన్ మిషన్లపై ఆసక్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 22: చంద్రయాన్-3 ఘన విజయం తర్వాత భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తన తదుపరి మూన్ మిషన్లు చంద్రయాన్-4, 5పై దృష్టిపెట్టింది. ఈ రెండు మిషన్లకు సంబంధించిన డిజైన్లు పూర్తయ్యాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తాజాగా ప్రకటించారు. ఈ మిషన్లు అంతరిక్ష అన్వేషణలో వేగంగా విస్తరిస్తున్న భారతదేశ పాత్రను తెలియజేయనున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రయాన్-4, 5 లక్ష్యాలు ఏమిటి..? అంతరిక్ష పరిశోధనల్లో అవి ఎలాంటి పాత్రను పోషించనున్నాయి..? అనే అంశాలు ఆసక్తిగా మారాయి.

చంద్రయాన్-4: ఇస్రో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో చంద్రయాన్ కీలకమైనది. గత ఏడాది చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతం కావడంతో భారత్ చరిత్ర సృష్టించింది. దానికి కొనసాగింపుగా చేపడుతున్న ప్రాజెక్టు చంద్రయాన్-4. ఈ ప్రయోగాన్ని 2028లో నిర్వహించాలనేది ఇస్రో లక్ష్యం. జాబిల్లి ఉపరితలంపై నుంచి శిలలు, మట్టి నమూనాలను సేకరించి సమగ్ర విశ్లేషణ కోసం వాటిని భూమికి తీసుకురావడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. చంద్రయాన్-4లో ల్యాండర్, అసెండర్, ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్, రీ ఎంట్రీ మాడ్యూల్ వంటి కీలక భాగాలు ఉంటాయి.

ల్యాండర్: చంద్రుడి ఉపరితలాన్ని తాకేలా రూపొందించిన ల్యాండర్‌లో రోబోటిక్ చేయి ఉంటుంది. ఇది చంద్రుడి ఉపరితలంపై నుంచి నమూనాలను సేకరిస్తుంది.

అసెండర్: జాబిల్లి ఉపరితలంపై సేకరించిన నమూనాలను చంద్రుడి కక్ష్యలోకి తీసుకెళ్లే బాధ్యతను అసెండర్ తీసుకుంటుంది.

ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్: అసెండర్ తీసుకొచ్చిన నమూనాలను ఈ ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్ రీ ఎంట్రీ మాడ్యూల్‌కు తరలిస్తుంది.

రీ ఎంట్రీ మాడ్యూల్: చంద్రుడిపై సేకరించిన శాంపిళ్లను భూమిపైకి చేరుస్తుంది.

చంద్రయాన్-5: జపాన్ స్పేస్ ఏజెన్సీ (జాక్సా)తో కలిసి ఇస్రో చేపట్టే మూన్ మిషన్ చంద్రయాన్-5. దీనిద్వారా జాబిల్లిపై శాశ్వత నీడ ఉండే మంచు ప్రాంతాలను అన్వేషించనున్నారు. ఈ మిషన్‌లో ఇస్రో రూపొందించిన ల్యాండర్‌తో పాటు జపాన్ అభివృద్ధి చేసిన 350 కిలోల రోవర్ కీలక పాత్ర పోషిస్తాయి. చంద్రుడి పై సవాళ్లతో కూడిన ప్రాంతాలను అన్వేషించడానికి వీలుగా వీటిని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నారు.

ప్రతిపక్ష నాయకులపై పాత కేసుల విచారణ

» కర్ణాటక మంత్రివర్గం నిర్ణయం

బెంగళూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ, జేడీఎస్ నాయకులపై నమోదైన నాలుగు పాత కేసులను తెరపైకి తేవాలని కర్ణాటక మంత్రి వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న కేంద్ర మంత్రి కుమారస్వామి, మాజీ మంత్రులు శశికళ జొల్లె, మురుగేశ్ నిరాణి, గాలి జనార్దనరెడ్డి కేసుల ప్రాసిక్యూషన్‌కు అనుమతులు కోరాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రివర్గ భేటీలో నాలుగు పాత కేసుల్లో ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు ప్రతిపాదిస్తూ తీర్మానం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 163 ప్రకారం మంత్రివర్గం అధికారాన్ని వినియోగించుకుని ఈ తీర్మానం చేశారు. క్యాబినెట్ భేటీ తర్వాత శాసనసభ, న్యాయవ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాతో మాట్లాడారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న నలుగురు నాయకుల కేసుల ప్రాసిక్యూషన్‌కు అనుమతులివ్వాలని కోరుతూ తీర్మానించామన్నారు. కుమారస్వామి వివాదంలో మరిన్ని వివరాలు కావాలని లోకాయుక్త సిట్‌ను గవర్నర్ కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రాసిక్యూషన్‌కు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌కు మంత్రివర్గం సిఫారసు చేసిందని తెలిపారు. ఇందులో ద్వేషపూరిత రాజకీయంలేదని స్పష్టం చేశారు.

ఏడాదికిందటే హెచ్చరించినా!

- ఎసెన్షియా ఫార్మా కంపెనీలో అనేక భద్రతా లోపాలు
- సెక్యూరిటీ ఆడిట్‌లో వెల్లడైన డొల్లతనం
- లోపాలను నిగ్గు తేల్చిన బృందం.. పట్టించుకోని యాజమాన్యం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎసెన్షియా ఫార్మా కంపెనీలో అడుగడుగునా భద్రతా లోపాలే! ఇది ఇప్పుడు గుర్తించిన విషయం కాదు! ఏడాది కిందటే జరిగిన భద్రతా ఆడిట్‌లో ఈ విషయం స్పష్టమైంది. ప్రొడక్షన్ బ్లాక్‌లోని రియాక్టర్ నుంచి పీడీ ల్యాబ్ ద్వారా ట్యాంకులోని రసాయనాన్ని సరఫరా చేసే సమయంలో.. పైప్‌లైన్ నుంచి ఆ మిశ్రమం లీక్ అయ్యి ఆవిరిగా మారింది. అది వాతావరణంలోని వాయువులతో కలిసి.. రసాయన చర్య జరగడంతో భారీ పేలుడు సంభవించిందని ఫ్యాక్టరీస్ విభాగం డైరెక్టర్ చంద్రశేఖర్ వర్మ ప్రభుత్వానికి ఇచ్చిన ప్రాథమిక నివేదికలో తెలిపారు. ఈ భద్రతాపరమైన లోపాలన్నీ దాదాపు ఏడాది క్రితం నిర్వహించిన ఓఎస్ ఆడిట్‌లో వెలుగు చూశాయి. మరీ ముఖ్యంగా పైప్‌లైన్ల వ్యవస్థ సరిగా లేదని, సరిచేసుకోవాలని ఆడిట్ బృందం ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచించింది. అయినప్పటికీ పట్టించుకోకపోవడంవల్లే బుధవారం ఘోర ప్రమాదం సంభవించింది.

ఆడిట్‌లో గుర్తించిన లోపాలు ఇవే...

- అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫ్యాక్టరీలో విషపూరిత వాయువులు, మండే వాయువులు, రసాయనిక ద్రావకాలు, ఇతర ఔషధ పదార్థాలను పరిమాణానికి మించి నిల్వ చేస్తున్నారు.
- పైప్‌లైన్ లీకేజీ సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి విధానాన్ని ఏర్పాటు చేయలేదు. పైప్‌లైన్ టెస్టింగ్ మెథడాలజీని కూడా అమలు చేయడం లేదు. ఈ ఫార్మా కంపెనీలో ప్రాసెస్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించిన పైప్‌లైన్లు, ట్రాన్స్‌ఫర్ పైప్‌లైన్లు కూడా సరిగ్గా లేవు. పైప్‌లైన్లు తుప్పు పట్టకుండా తగిన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు.
- పైపులైన్ల నిర్వహణకు వీలుగా నడక మార్గం కూడా లేకుండా వాటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేసేశారు. భద్రతాపరమైన ఈ లోపాలన్నింటినీ సరిచేయడంతోపాటు పైప్‌లైన్లు అందరికీ కనిపించే ప్రదేశాలలో ఫ్లో డైరెక్షన్ మార్కింగ్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.
- ఎసెన్షియా కంపెనీలోని ఫైర్ ఫైటింగ్ విభాగంలో పంప్‌హౌస్ ప్రవేశ ద్వారం వద్ద ఎంసీపీ పని చేయడం లేదు. కంపెనీలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎమర్జెన్సీ సమయంలో సమర్థవంతంగా ప్రతిస్పందించేందుకు తగిన నైపుణ్యాలు కలిగిన స్కిల్ టీమ్స్ లేవు.

ఈ కంపెనీ ల్యాబ్‌లో పనిచేస్తున్న క్వాలిటీ సెల్ బృందంతోపాటు ప్రాసెస్ విభాగంలోని బృందంతో మాట్లాడినప్పుడు... వారిలో కనీస నైపుణ్యాలు కూడా లేవని తేలింది. అగ్నిమాపక కార్యకలాపాలపై అవగాహన, తగిన శిక్షణ, మాక్‌డ్రిల్స్ నిర్వహించడం ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచాల్సిన అవసరముంది.

మా బిడ్డను అన్యాయంగా చంపారు

ఆమె జనజీవన స్రవంతిలోకి రావడం మావోయిస్టులకు ఇష్టం లేదు.. తప్పిదాలు బయటపడతాయనే కక్ష గట్టారు

- మావోయిస్టు రాధ కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వేడుకోలు
- ఇంటికొస్తుందనుకున్నా. 3రోజుల క్రితం పోలీసులూ ఇదే చెప్పారు: తల్లి
- నేను పోలీస్ ఏజెంట్‌ను కాదు.. రాధ తమ్ముడు సూర్యప్రకాశ్



కాప్రా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు తమ బిడ్డను అన్యాయంగా చంపారని మావోయిస్టు రాధ బంటి (పల్లెపాటి) తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఆరేళ్ల క్రితం రాధను మావోయిస్టుగా మార్చింది వారేనని.. ఇప్పుడేమో నిర్దాక్షిణ్యంగా చంపి రోడ్డుపై పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాధ జనజీవన స్రవంతిలోకి రావాలని అనుకుందని, ఇందుకు మావోయిస్టులు అడ్డుచెప్పారని, పైగా పోలీస్ ఇన్‌ఫార్మర్ అంటూ ఓ కట్టుకథను సృష్టించారని విమర్శించారు. తమ తప్పిదాలు ఎక్కడ బయటపడతాయోనన్న కక్షతోనే రాధను చంపారని ఆరోపించారు. ఇన్‌ఫార్మర్ పేరిట మావోయిస్టు రాధ అలియాస్ నీల్సోను బుధవారం తెల్లవారుజామున మావోయిస్టులు హత్య చేసిన విషయం తెలిసిందే. సమాచారం అందగానే కుటుంబసభ్యులు భద్రాచలం వెళ్లి ఆమె మృతదేహాన్ని గురువారం ఉదయం కాప్రా ఇందిరానగర్‌కు తీసుకొచ్చారు. మావోయిస్టు ఉద్యమ నాయకుల్లో వర్గ విభేదాలు ఉన్నాయని, దళితురాలైనందువల్లనే రాధను హత్య చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా రాధ అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం జరిగాయి. కాప్రా ఇందిరానగర్‌లోని ఆమె నివాసం నుంచి మృతదేహాన్ని సాయిబాబానగర్ శ్మశానవాటికకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల సందర్భంగా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.



సీఎం మా కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆరేళ్ల తర్వాత కూతురు ఇంటికి తిరిగివస్తుందనుకున్నా. మూడురోజుల క్రితం పోలీసులు కూడా ఇదే విషయం చెప్పారు. అంతలోనే కూతురు శవమై రావడం తట్టుకోలేకపోతున్నా. ఏం జరిగిందో తెలియదు కానీ మావోయిస్టులు మా కుటుంబానికి తీరని అన్యాయం చేశారు. నా కూతురు పోలీస్ ఇన్‌ఫార్మర్ కాదు. నా బిడ్డను చంపిన మావోయిస్టులు నా కొడుకుపై కూడా పోలీస్ ఏజెంట్ అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

- పోచమ్మ, రాధ తల్లి

ఇలా ఎప్పుడూ జరగలేదు



మావోయిస్టుల్లో అగ్రవర్ణాల వారిదే చెల్లుతుంది. దళితురాలు కావడంతోనే మా చెల్లెను మావోయిస్టులు చంపారు. ఒక మహిళా మావోయిస్టును మావోయిస్టులే చంపడం ఎప్పుడూ జరగలేదు. మృతదేహాన్ని ఎక్కడ ఉంచారో తెలుసుకోవడానికి వర్షంలో చీకట్లో తిరిగాం. మా అనుమతిలేకుండా పోస్ట్ మార్టం ఎలా చేస్తారు? మా చెల్లి పోలీస్ ఇన్‌ఫార్మర్ అని మా తమ్ముడు పోలీస్ ఏజెంట్ అని మావోయిస్టులు చెబుతున్నది నిజం కాదు

- శివలింగం, రాధ అన్న

మా అక్క డబ్బులు పంపుతుందనడం అబద్ధం



మా అక్క నాకు డబ్బులు పంపుతున్నదని మావోయిస్టులు అనడం అబద్ధం. నేను పోలీస్ ఏజెంట్‌ను కాదు. మాది పేద కుటుంబం. నేను క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నా. అక్క మావోయిస్టుల్లో చేరాక అమ్మానాన్నల క్షేమ సమాచారం గురించి అప్పుడప్పుడు మెసేజ్ పెట్టేది. మావోయిస్టుగానే ఉండిపోతాననేది. కానీ ఇటీవల జనజీవన స్రవంతిలోకి రావాలనుకుంది. అది మావోయిస్టులకు నచ్చలేదు. వారు చేసిన తప్పులు బయట పడతాయనే మావోయిస్టులు ఈ పనిచేశారు. మా అక్కను పోలీస్ ఇన్‌ఫార్మర్ అంటూ చంపారు.

- సూర్యప్రకాశ్, రాధ తమ్ముడు

సీప్లేన్ సేవలతో పర్యాటకానికి ఊతం

- సీప్లేన్ కార్యకలాపాలపై ఏపీ, మహారాష్ట్ర ఆసక్తి
- అక్టోబరులో విజయవాడ వేదికగా సీప్లేన్ డెమో
- పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నూతన సీప్లేన్ విధానంతో ప్రజా రవాణా మరింత సులభతరం కానుందని, సీప్లేన్ సేవలతో దేశంలో పర్యాటకం పెరుగుతుందని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. సీప్లేన్ కార్యకలాపాలకు సంబంధించి సమగ్ర సరళీకృత మార్గదర్శకాలను పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర సహా మరికొన్ని రాష్ట్రాలు ఈ సీప్లేన్ కార్యకలాపాల నిర్వహణకు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ సందర్భంగా తెలిపారు. అక్టోబరులో విజయవాడలో సీప్లేన్ డెమో నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రాంతీయ వైమానిక కనెక్టివిటీ పథకం ఉడాన్‌ను మరో పదేళ్లు పొడిగించాలని, సీప్లేన్ కార్యకలాపాలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అందించాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. దేశంలోని విస్తారమైన జలమార్గాలను ఉపయోగించుకునేందుకు విమానయాన శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఏపీలోని శ్రీకాకుళం- విశాఖపట్నం - కాకినాడ - నర్సాపురం తదితర సువిశాల తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు శ్రీశైలం, ప్రకాశం బ్యారేజ్, రాజమండ్రి వంటి నదీ పరివాహక ప్రాంతాల్లో సీప్లేన్ విధానాన్ని అమలు చేసేందుకు యోచిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, విమానయాన నిపుణులు, పర్యావరణ అధికారులు సహా వివిధ వర్గాలతో సంప్రదించి, పర్యావరణ అనుకూలంగా మార్గదర్శకాలు రూపొందించామని ఆయన వివరించారు.

దేశ ఆర్థిక వృద్ధికి ఊతం..

భద్రతా నిబంధనలకు అనుగుణంగా ఏరోడ్రోమ్‌ల అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆపరేటర్ల విధులు, బాధ్యతలను రూపొందిస్తామని మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. సీప్లేన్ విధానాన్ని ఉడాన్ పరిధిలోకి తీసుకొస్తామని ప్రకటించారు.

తల్లి మరణం తట్టుకోలేక కూతురి మృతి

- రంగారెడ్డి జిల్లా మంతన్‌గౌరెల్లిలో ఘటన


బుచ్చమ్మ(ఫైల్)

యాచారం, ఆగస్టు 22: కన్నతల్లి మరణాన్ని తట్టుకోలేక ఆ కూతురు నీ వెంటే నేనంటూ ప్రాణాలు విడిచింది. అనారోగ్యంతో మృతి చెందిన తల్లి దగ్గర రోదిస్తూ అస్వస్థతకు గురై చనిపోయింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మంతన్‌గౌరెల్లికి చెందిన కందుల పోచమ్మ (60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. అదే గ్రామంలో నివసించే పోచమ్మ కుమార్తె బుచ్చమ్మ (40) తల్లి మృతదేహం వద్ద రోదిస్తూ స్పృహ కోల్పోయింది. ఆమెను మాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ప్రాణాలు విడిచింది. ఒకేరోజు తల్లీకూతుళ్ల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జోగి రమేశ్‌ను ప్రశ్నిస్తుంటే.. పొన్నవోలు సమాధానమిస్తున్నారు

- రమేష్ దర్యాప్తుకు సహకరించడం లేదు
- తక్షణం మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయండి
- హైకోర్టులో న్యాయవాది వాదనలు

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై మూకదాడి ఘటనలో నమోదైన కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ దర్యాప్తునకు సహకరించడం లేదని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా గురువారం హైకోర్టుకు నివేదించారు. తొందరపాటు చర్యలు వద్దని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను జోగి దుర్వినియోగం చేస్తున్నారని, తక్షణం వాటిని ఎత్తివేయాలని కోరారు. దర్యాప్తు అధికారి నిందితుడిని ప్రశ్నిస్తుంటే.. ఆయనతోపాటు విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సమాధానం చెబుతున్నారని వివరించారు. అందుకు సంబంధించి వీడియోను కోర్టు ముందు ఉంచామన్నారు. విచారణకు హాజరు కావాలని పిటిషనర్‌కు దర్యాప్తు అధికారి ఇప్పటి వరకు మూడుసార్లు నోటీసులు ఇచ్చారన్నారు. మూడో నోటీసు తరువాత సీనియర్ న్యాయవాదితో కలిసి జోగి రమేష్ విచారణకు హాజరయ్యారన్నారు. ఘటనలో ఇతర నిందితుల పాత్రకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందు పెట్టారు. పిటిషనర్‌తో పాటు దాడిలో పాల్గొన్న ఇతర నిందితులు ముందస్తు బెయిల్ పొందేందుకు అనర్హులని తెలిపారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి.. జోగిరమేష్ తరఫు సీనియర్ న్యాయవాది వాదనల కోసం విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను నేటి వరకు పొడిగించారు. చంద్రబాబు నివాసంపై మూకదాడిలో తాడేపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రిన్సిపాల్ వేధిస్తున్నారు.. మమ్మల్ని రక్షించండి

పోలీసుస్టేషన్ ఎదుట గురుకుల విద్యార్థుల ఆందోళన

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 22: తమను ప్రిన్సిపాల్ వేధింపులకు గురిచేస్తున్నారంటూ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఆదిలాబాద్ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 46 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో వసతుల కొరత, మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని కొన్ని రోజుల క్రితం వారు బడి ఎదుట ఆందోళన నిర్వహించారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న ప్రిన్సిపాల్ సంగీత.. తమను రోజూ వేధింపులకు గురి చేస్తున్నారని, పాఠశాల సమస్యలను బయటకు చెబుతారా అని తమపై కక్షగట్టి భోజనాన్ని సరిగా వడ్డించడం లేదని, ఇరుకు గదుల్లో ఉంచుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. గురువారం తెల్లవారు జామున పాఠశాల గోడ దూకి 6కి.మీ. కాలినడకన ఆదిలాబాద్ పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. ఆర్డీవోతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'లంక' ఎటువైపు?

బంగ్లాదేశ్ పరిణామాల తరువాత, మాల్దీవులూ మారిపోయాక, శ్రీలంక అయినా అక్కడి ఎన్నికల అనంతరం మనవైపు ఉంటుందా? వచ్చేనెల 21న అక్కడ జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో విజేతను బట్టి ఆ దేశం తన రెండు బలమైన పొరుగుదేశాలైన ఇండియా, చైనాల్లో ఎటువైపు మొగ్గుతుందో తేలిపోతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దౌత్యసంబంధాలమీద ఆ కుర్చీలో కూర్చోబోయేవారి ప్రభావం కాదనలేనిది. తీవ్ర ఆర్థికసంక్షోభంతో దేశం కుప్పకూలిపోయి, జనం ఆగ్రహావేశాలతో వీధుల్లోకి వచ్చి, అధ్యక్షభవనంలోకి చొచ్చి, పెత్తనం చెలాయిస్తున్న రాజపక్సలను పలాయనం చిత్తగించేట్టు చేసిన దృశ్యాలను ఎప్పటికీ మరిచిపోలేనివి. ఇప్పుడు అధ్యక్షపదవికి పోటీపడుతున్న 39మందిలో, ప్రముఖంగా చెప్పుకోవాల్సిన పేర్లలో రాజపక్స వారసుడు, మహీంద రాజపక్స కుమారుడు నమల్ కూడా ఒకరు. తమిళపులులను ఊచకోతకోసి, తమిళులపై అఘాయిత్యాలు చేయించి, యుద్ధకాలం నాటి వీరుడిగా పేరొందిన మహీంద రాజపక్స మీద ప్రజల్లో ఇంకా ఎంతో గౌరవం, మోజు ఉన్నందున నమల్ తప్పక నెగ్గుతాడని ఆయన పార్టీ శ్రీలంక పీపుల్స్ ఫ్రంట్ నమ్ముతోంది. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి) తరఫున కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీపడుతున్నారు. ప్రేమదాస, దిస్సనాయకే వారసులు కూడా బరిలో ఉన్నందున సమధికోత్సాహానికి లోటేమీ లేదు.

రెండేళ్ళక్రితం దివాలాతీసి, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఇచ్చిన భారీ అప్పుతో గాడినపడుతున్న దేశాన్ని కొత్తపాలకుడు దిశానిర్దేశం చేయాల్సి ఉంది. దానితోపాటు, ఎవరితో ఎక్కువ సాన్నిహిత్యాన్ని నెరపాలో కూడా నిర్ణయించుకోవాలి. రణిల్ బాధ్యతలు స్వీకరించిన సందర్భం వేరు కనుక, అందరితోనూ చక్కగా ఉంటూ కష్టాల్లో ఉన్న దేశాన్ని కాస్తంత ఒడ్డునపడేశారు. ఆయన భారతదేశానికి సన్నిహితుడని అక్కడివారు నమ్ముతారు. భారతదేశంతో కరెన్సీ ఒప్పంద ఆలోచనలు, అప్పులు, పెట్టుబడులు సాధించడంతో పాటు, నిబంధనలకు అతీతంగా అదానీకి మేలుచేశారన్న విమర్శలను కూడా అక్కడి విపక్షంనుంచి ఆయన ఎదుర్కొన్నారు. అదానీకి అడ్డుతోవలో వివిధ ప్రాజెక్టులు అప్పగించారన్న ఆరోపణలను ప్రధానంగా చేసిన సజిత్ ప్రేమదాస కూడా ఇప్పుడు అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ, భారత్, చైనాల్లో దేనినీ కాదనగలిగే స్థితిలో శ్రీలంక లేదన్నమాట వాస్తవం. రుణభారం మోయలేక, చెల్లింపులు చేయలేక చైనా నిర్మిత హంబన్‌టోటా ఓడరేవును ఆదేశానికే 99సంవత్సరాల లీజుకు 2017లో ఇచ్చేసినప్పుడు ప్రధాని స్థానంలో ఉన్నది విక్రమసింఘే. రణిల్ తిరిగి అధ్యక్షుడైతే భారత్‌కు కొత్త సమస్యలేమీ ఉండకపోవచ్చు కానీ, భారత వ్యతిరేకి, చైనా పూర్తి అనుకూల ఎన్‌పీపీ నేత అనుర కుమార దిస్సనాయకే పోటీపడటంతో పాటు మంచి ఊపుమీద ఉన్నట్టుగా వార్తలు వస్తున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికలు ఏడాదిన్నరగా జరపకుండా రణిల్ విక్రమసింఘే చట్టవ్యతిరేకంగా వ్యవహరించారంటూ శ్రీలంక సుప్రీంకోర్టు గురువారం తీవ్రంగా తప్పుబట్టింది. కేవలం డబ్బులేదన్న కారణంతో ఎన్నికలు వాయిదావేయడమేమిటని ఐదుగురు సభ్యుల ధర్మాసనం విమర్శించినప్పటికీ, ఎన్నికలు జరపనందుకు తాను ఏమాత్రం చింతించడం లేదని ఆయన చెప్పుకున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక, ఆహారం, చమురు, విద్యుత్ ఇత్యాదివి కరువై దేశం అల్లాడిపోతున్న స్థితిలో ఓటు హక్కు కంటే జీవించే హక్కుకు తాను అప్పట్లో ప్రాధాన్యం ఇచ్చానని ఆయన ఓ బహిరంగసభలో సమర్థించుకున్నారు. సర్వశక్తిమంతులమని అనుకున్న రాజపక్స కుటుంబీకులను రెండేళ్ళక్రితం సింహళులు, తమిళులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు చేయీచేయీ కలిపి దేశంనుంచి తరిమికొట్టిన విషయం తెలిసిందే. మతాలు, మూలాలతో సంబంధం లేకుండా దేశప్రజలంతా ఒక్కటైన సందర్భం అది. దీనికి సరిగ్గా మూడేళ్ళ ముందు ఈస్టర్ సందర్భంగా అక్కడ జరిగిన పేలుళ్ళలో 250మంది మరణించడం ప్రజల మనసులమీద పనిచేసి, రాజపక్స సోదరుల మాటలు నమ్మి వారిని అందలం ఎక్కించారు. కానీ, దొరికినచోటల్లా అప్పుతెచ్చిన సొమ్మును దుర్వినియోగం చేయడం, చేసిన అప్పులు తీర్చకపోవడం, ఉన్నపళంగా ఆర్గానిక్ వ్యవసాయం వైపు దేశాన్ని మళ్ళించడం వంటి అనేకానేక తప్పుడు నిర్ణయాలతో ఈ సోదరులు దేశాన్ని ముంచేశారు. తిండిగింజలు కూడా లేని ఆ దశనుంచి దేశం క్రమంగా తేరుకుంటున్న స్థితిలో ఇప్పుడు వారి వారసుడు మళ్ళీ అధ్యక్షస్థానం కోసం పోటీపడుతున్నాడు. పాలకులమీద తిరుగుబాటుతో తమ జీవించేహక్కును పరిరక్షించుకున్న శ్రీలంకవాసులు ఇప్పుడు తమ ఓటుహక్కును ఎంత తెలివిగా వినియోగించుకుంటారో చూడాలి.

చింతనాత్మక రాజకీయాలు యేవీ?

వికసిత్ భారత్! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోని ప్రధాన అంశాన్ని, స్వాతంత్ర్య శతాబ్ది (1947) భారత్ గురించిన ఆయన దార్శనికతను ఆ ఒక్కమాటలో సంక్షేపించి చెప్పవచ్చు. 'అభివృద్ధి చెందిన దేశంగా భారత్'.. ఇది బాగా అరిగిపోయిన మాట కాదూ? 1950 దశకం రాజకీయ వాగ్ధరిలోని ఆ భావన అప్పటి నుంచి ఇప్పటికీ రాజకీయవేత్తల, ముఖ్యంగా ప్రభుత్వాధినేతల నోట పదే పదే పునరుక్తమవుతూనే ఉంది. వినీ వినీ శ్రోతలు విసిగి వేసారిపోతున్నారు. అయినా రాజకీయవేత్తలు ఆ మంత్రాన్ని జపిస్తూనే ఉన్నారు! దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అది కేవలం ఒక వాక్యూరుని మేధో పరిమితి మాత్రమే కాదు; సమస్త రాజకీయవేత్తల అహేతుక ఆలోచనా ధోరణి– కృశించిన లేదా క్షీణించిన రాజకీయ ఆలోచనాశక్తిని ప్రతిబింబిస్తోంది. వాస్తవమేమిటంటే అధికార పక్షాల నాయకులు మాత్రమే కాదు, భావజాలాలకు అతీతంగా ప్రతి ఒక్క రాజకీయుడికి 'అభివృద్ధి' అనేది ఒక ఊతపదమైపోయింది. పైగా ఆ లక్ష్య సాధనకు తమ నిబద్ధతను పదే పదే ఏకరువు పెడుతూ ప్రజలను వారు నిత్యం సతాయిస్తూనే ఉన్నారు.

రెండు దశాబ్దాల క్రితం సంస్కృత భాష గురించి విఖ్యాత సంస్కృత విద్వాంసుడు Sheldon Pollock ఇప్పటికీ తరచు ఉదహరింపబడుతున్న ఒక వ్యాసాన్ని రాశారు అది: 'The Death of Sanskrit in 18th century India'. సంస్కృతం మృత భాష అయిపోయిందని చెప్పడం ఆయన ఉద్దేశం ఎంత మాత్రం కాదు. ఆ పురాతన భారతీయ భాష తన ఉనికిని కొనసాగిస్తూనే ఉన్నది. ఇండియాలో యూరోపియన్ల వలస పాలన ప్రారంభమైన తరువాత భారతీయ నాగరికత మేధో వ్యాసంగాల, సాంస్కృతిక భావాల వ్యక్తీకరణకు సంస్కృతం ప్రధాన మాధ్యమంగా ఉండడం నిలిచిపోయిందని చెప్పడమే ఆ పాశ్చాత్య విద్వాంసుని అభిమతం. ఆ అభిప్రాయానికి సుదీప్త కవిరాజ్ ప్రతిస్పందిస్తూ 'The Sudden Death of Sanskrit knowledge'. అనే వ్యాసాన్ని రాశారు. ఒక విశిష్ట చింతనా ధోరణి సంబంధమైన భావనాత్మక విశ్వం ఆకస్మికంగా అంతరించిపోయిందని కవిరాజ్ విశదీకరించారు.

సరిగ్గా అటువంటి విపరిణామమే మహోన్నత ఆధునిక భారత రాజకీయ చింతనా సంప్రదాయానికి కూడా సంభవించింది. వలసపాలనా కాలంలోనూ, స్వాతంత్ర్య సాధన అనంతరమూ దేశ రాజకీయాలను సమున్నత విలువలతో తీర్చిదిద్దిన, అభివృద్ధిపరిచిన మహా ప్రశస్త రాజకీయ చింతనే ఆ సంప్రదాయమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సరే, ఇప్పుడు నైతిక రాజకీయాలు క్షీణించిపోవడాన్ని అందరూ గుర్తించారు, విమర్శిస్తున్నారు, వేదన చెందుతున్నారు. అయితే అంతకంటే శోచనీయమైన ఒక వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవడం లేదు: మన రాజకీయ దార్శనికత శుష్కించి పోయింది, రాజకీయ సంవాదాలు సంకుచితమవడమే కాదు, వికృతమూ అవుతున్నాయి. మన రాజకీయ వివేకం నిస్సారమైపోయింది, రాజకీయ నిర్ణయాలలో భావ దారిద్ర్యం, రాజకీయ కార్యాచరణలో మందకొడితనం, సాహసోపేత క్రియాశీలత కొరవడడం.... నిజంగా ఇదొక విషాద వాస్తవం. భారత పునరుజ్జీవన, జాతీయోద్యమ యుగ రాజకీయాలను తీర్చిదిద్దిన, సమున్నతపరిచిన భావాల వాహిని ఎండిపోయింది. ఈ పరిణామాన్ని ఆధునిక భారత రాజకీయ చింతన హఠాన్మరణమని మీరు భావించవచ్చు.

భావాల ప్రపంచంలో సంభవించిన అన్ని ఉద్యమాల విషయంలో మాదిరిగానే ఈ 'మరణం' ఎప్పుడు చోటు



మన రాజకీయాలలోని ప్రస్తుత దుస్థితికి చైతన్యశీల రాజకీయ చింతన క్షీణించిపోవడమే ప్రధాన కారణం. భారత రాజ్యంగ నిర్మాతలు నెలకొల్పిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్రరాజ్యాన్ని మళ్లీ సాధించుకుని, సంరక్షించుకునేందుకు 'మరణించిన' ఆధునిక భారత రాజకీయ చింతనా సంప్రదాయాన్ని పునరుద్ధరించుకుని పునశ్శక్తిమంతం చేసుకోవడమనేది చాలా చాలా అవసరం.

చేసుకున్నదో ఒక తేదీని కచ్చితంగా చెప్పలేము. అయితే వలసపాలనానంతర, అంటే స్వతంత్ర భారతావని మొదటి పాతికేళ్ల (1947–72)లోనే సంభవించిందని నిశ్చితంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్య ఉషోదయంలో క్రియాశీలంగా ఉన్న మన రాజకీయ చింతకులను, వారి భావ విస్తృతి, ప్రభావశీలతను గుర్తుచేసుకోండి. కేవలం గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌లు మాత్రమే కాదు ఇంకా ఎంతో మంది ఉన్నారు. మన ఆలోచనలను విశాలం చేసిన తేజోమూర్తులు వారు. వారు విశ్వసించిన, ప్రతిపాదించిన భావజాలం ఏదైనా జాతి అభ్యుదయాన్ని మాత్రమే ఆ సమున్నతులు తమ దృష్టిలో ఉంచుకున్నారు. నవ్యమానవవాదాన్ని ప్రతిపాదించిన మానవేంద్రనాథ్ రాయ్, హిందూ చింతన, సంస్కృతిని మహోన్నత స్థాయికి తీసుకువెళ్లిన జాతీయవాద ప్రవక్త శ్రీ అరబిందో అప్పటికి క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలిగారు. రాజకీయాలలో క్రియాశీలంగా ఉన్నవారిలో కాంగ్రెస్ నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్; సోషలిస్టు భావుకులు, పోరాటయోధులు ఆచార్య నరేంద్ర దేవ, జయప్రకాష్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా; కమ్యూనిస్టు నాయక దిగ్గజాలు ఎస్ఏ డాంగే, పిసి జోషి; సామాజిక న్యాయపోరాటయోధుడు పెరియార్ రామస్వామి నాయకర్; స్వేచ్ఛా వాణిజ్య విధానాలను ప్రవచించిన సి. రాజగోపాలాచారి; హిందూ మతానికి ప్రాధాన్యమిచ్చిన వినాయక్ దామోదర్ సావర్కార్; ముస్లింల పక్షాన మాట్లాడిన మౌలానా మౌదూది ఆ తేజోమూర్తులలో కొందరు మాత్రమే.



■ యోగేంద్ర యాదవ్

ఆ ఉదాత్తుల భావాలు, ఆలోచనలతో మీరు అంగీకరించినా లేక విభేదించినా వారు ఉత్కృష్ట రాజకీయ తాత్వికులు అనే వాస్తవాన్ని మీరు నిరాకరించలేరు. అవును, వారు రాజకీయ క్రియాశీలురు. అయితే వారి రాజకీయ కార్యాచరణ భావి భారతీయ సమాజ నిర్మాణం గురించిన విశాల దార్శనికతతో ప్రేరణ పొందింది. సమున్నత లక్ష్యాలకు పరిపూర్ణంగా నిబద్ధమైన రాజకీయ కార్యాచరణ అది. దైనందిన రాజకీయాలలో పాల్గొంటూనే సర్వసాధారణమైన పాక్షికతలు, పక్షపాతాలకు అతీతంగా ఆలోచించారు, సమాజంతో సంభాషించారు, ప్రజలకు విపులంగా వివరించేందుకు తమ భావాలకు స్ఫూర్తిదాయకమైన అక్షర రూపమిచ్చారు. భారతదేశం, భారతీయుల బాగోగులే వారి ఉచ్ఛ్వాసనిశ్వాసాలు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎల్లెడలా జరుగుతున్న సంఘటనలు, వాటి పూర్వాపరాలను సమగ్రంగా తెలుసుకునే వారు. చదవడం, రాయడం ఆంగ్లంలోనే అయినప్పటికీ భారతీయ భాషల మహోన్నత సాంస్కృతిక వారసత్వం, సాహిత్య వైభవం వారి మేధో కృషికి, సమాజ సేవా కార్యకలాపాలకు ఒక స్ఫూర్తిగా, ఆలంబనగా ఉండేవి. ఆధునికత, సంప్రదాయంపై వారు విశాల దృక్పథంతో భిన్న రీతుల్లో వివేచించారు. అయితే పూర్తిగా దేశీయ అంటే విలక్షణమైన భారతీయ ఆధునికత రూపుదిద్దుకోవడానికి సమష్టిగా దోహదం చేశారు ఆ దేశభక్తులు, మానవతావాదులు విశిష్టమైన రాజకీయ ఆలోచనల సంచయాన్ని సృష్టించారు. ఆ భావాల సంచయమే మన రాజ్యాంగాన్ని విశిష్టంగా రూపొందించింది. భిన్న భావజాలాలు ప్రభవించి వర్ధిల్లడానికి, వివిధ రాజకీయ కార్యాచరణలకు ఆస్కారమిచ్చింది.

స్వతంత్ర భారతావని తొలి పాతికేళ్లలో ఈ మహోదాత్త రాజకీయ చింతనా సంప్రదాయం ఆకస్మికంగా అంతరించిపోయింది. 1970 దశకం తొలినాళ్లకు ప్రస్తావిత చింతకులు చాలా మంది కీర్తిశేషులయ్యారు. రాజకీయ చింతనలో రాజకీయ నాయకుల ప్రాబల్యం కొనసాగుతున్నప్పటికీ వారి ఆలోచనలు 1947లో ప్రజలకు మార్గదర్శకంగా ఉన్న రాజకీయ భావాలతో ఎంత మాత్రం పోల్చదగ్గవి కావు. వ్యక్తులుగా కూడా ఆ నేతలకు పాతతరం ఉదాత్తులకు మధ్య చాలా తేడా ఉన్నది. ఆ నాటికి సోషలిస్టు భావుకతలో ఇంకా మినుకు మినుకుమంటూ మిగిలి వున్నది లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవ' భావన మాత్రమే. చారు మజుందార్ సిద్ధాంతాలు మార్క్సిజంకు తుది సృజనాత్మక భాష్యాలు. వినోబా భావే చింతన ఏకపక్షమైనదే అయినప్పటికీ గాంధేయవాదులలో ఆయన ప్రముఖుడు. ఎమ్ఎస్ గోళ్వాల్కర్ 'హిందూత్వ' వాదాలను ప్రచారం చేస్తూనే ఉన్నారు గ్రామీణ భారతదేశ అభ్యున్నతికి ఒక విశిష్ట కార్యక్రమాన్ని ప్రతిపాదించిన దార్శనికుడు చౌదరి చరణ్ సింగ్. ఈ జాబితా అసంపూర్ణమైనది. అయితే ప్రస్తావితులు అందరూ దేశ ప్రజలను ప్రభావితం చేసినవారనడంలో సందేహం లేదు.

ఇరవయో శతాబ్ది తుది సంవత్సరాలకు వచ్చేసరికి రాజకీయ క్రియాశీల –చింతకులు కూడా చాలవరకు శాశ్వతంగా నిష్క్రమించారు. మిగిలి ఉన్న కిషెన్ పట్నాయక్, సచ్చిదానంద సిన్హా, రామ్‌దయాళ్ ముండా, ధరమ్‌పాల్, బిడి శర్మ ప్రధాన స్రవంతి రాజకీయాలకు వెలుపలే ఉండిపోయారు అప్పటి నుంచి రాజకీయ కార్యాచరణలపై వివేచించిన, వాటిని ప్రభావితం చేసిన అర్థవంతమైన రాజకీయ చింతన ఏదీ మనకు లేకుండా పోయింది.

రాజకీయ ఆలోచనాశక్తి క్షీణించిపోవడం, మరింత ధైర్యంగా, స్పష్టంగా ఆధునిక భారత రాజకీయ చింతన 'మరణం' గురించి మాట్లాడడమంటే రాజకీయ వ్యవహారాల గురించి నిశిత వివేచన చేసే ప్రశస్త మేధావులు, ఆలోచనాపరులు, రచయితలు మనకు ఇంకెంతమాత్రం లేరు అని చెప్పుతున్నట్టుగా భావించనవసరం లేదు. అటువంటి చింతకులు, భావుకులు ఉన్నారు. బహుశా ఇంతకు ముందు కంటే ఎక్కువ మందే ఉన్నారు. అయితే రాజకీయాలు, కనీసం వాటి సంకుచితార్థంలో సైతం వారి చింతనకు కేంద్రంగా లేవు. మన యెఱుక, అనుభవంలోకి వస్తున్న వర్తమాన రాజకీయ చింతనలోని ఏ స్రవంతిలోనూ మేధో కృషిని రాజకీయ కార్యాచరణలతో సంధాయకం చేసే ఒక సుసంగత సంభాషణ, ఒక శక్తిమంతమైన వాదన, ఒక అర్థవంతమైన చర్చ లేవు. అయితే ఇందుకు గౌరవప్రదమైన మినహాయింపులు లేకపోలేదు. అభివృద్ధి నమూనాపై నిశిత విమర్శలు, బహుళ ప్రత్యామ్నాయాల అన్వేషణ, స్త్రీవాద, అంబేడ్కరైట్ శ్రేణులలో సందర్భానుసారమైన చర్చలు, వాదోపవాదాలు రాజకీయ చింతనా సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతున్నాయి.

మొత్తం మీద రాజకీయ చింతన క్రమంగా విశ్వవిద్యాలయాలకు పరిమితమయింది. రజనీ కొఠారి, డీఎల్ సేఠ్, ఆశీస్ నంది, పార్థా చటర్జీ, సుదీప్త కవిరాజ్, రాజీవ్ భార్గవ మొదలైన ప్రశస్త రాజకీయ సైద్ధాంతికవేత్తలను మన విశ్వవిద్యాలయాలు సృష్టించాయి. అయితే వారి భావాలు రాజకీయ కార్యాచరణలను ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పేందుకు ఆస్కారం లేనే లేదు. రాజకీయ చింతనను విశ్వవిద్యాలయాల రాజనీతిశాస్త్ర విశారదులు స్వీకరించి స్వాధీనం చేసుకోవడమనేది ఒక మేధోపరమైన విపత్తు మాత్రమేకాకుండా ఒక రాజకీయ అనర్థం కూడా.

మన రాజకీయాలలోని ప్రస్తుత దుస్థితి, శోచనీయ పరిస్థితులకు చైతన్యశీల రాజకీయ చింతన క్షీణించిపోవడమే ప్రధాన కారణం. భారత రాజ్యంగ నిర్మాతలు నెలకొల్పిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్రరాజ్యాన్ని మళ్లీ సాధించుకుని, సంరక్షించుకునేందుకు ఆధునిక భారత రాజకీయ చింతనా సంప్రదాయాన్ని పునరుద్ధరించుకుని పునశ్శక్తిమంతం చేసుకోవడమనేది చాలా చాలా అవసరం.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఆకాశ వీధుల్లో ఇస్రో జైత్రయాత్ర

భూమి, చంద్రుల సామీప్యతను గణించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జూలై నెలను చంద్రయాన్–3కు అనుకూలం అని ఎంచుకున్నది. 2023 జూలై 14న శ్రీహరికోట సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఎల్‌వీఎంఎం–4 వాహకనౌక ద్వారా చంద్రయాన్–3ని ప్రయోగించారు. చంద్రయాన్–3లో ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ రోవర్ అనే ముఖ్యమైన మూడు భాగాలున్నాయి. ఇందులో ప్రొపల్షన్ మాడ్యూల్.. ల్యాండర్, రోవర్‌లను 100 కి.మీ చంద్ర కక్ష్య వరకు తీసుకువెళ్లింది. చంద్రయాన్–3లోని ల్యాండర్ విక్రమ్ చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో 2023 ఆగస్టు 23న సురక్షితంగా, మృదువుగా దిగింది. ఇది దిగిన ప్రదేశానికి 'శివశక్తి' అని నామకరణం చేశారు. ఇంతటి ఘనవిజయం సాధించిన ఆగస్టు 23ను ప్రతి సంవత్సరం జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ విజయం అంతరిక్ష పరిశోధనలలో ఒక పెద్ద ముందడుగు. సైన్స్ టెక్నాలజీ రంగంలో భారతదేశం సాధించిన అద్భుతమైన పురోగతికి నిదర్శనం. ఇది ఒక చరిత్రాత్మక విజయం.

1957 అక్టోబరు 4న స్పుత్నిక్–1 అనే తొలి మానవ నిర్మిత ఉపగ్రహ ప్రయోగంతో అంతరిక్ష యాత్రలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి మానవులు అంతరిక్షాన్ని అన్వేషిస్తూనే ఉన్నారు. ఇది సామాజిక ప్రయోజనాల నిరంతర ప్రవాహాన్ని సృష్టించింది. అంతరిక్ష యాత్రలు, పరిశోధనలు భూమిలోని అనేక రంగాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి. 1969లో ఇస్రో స్థాపనతో భారత అంతరిక్ష యాత్రలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు ఉపగ్రహాల ప్రయోగంలో ఇస్రో గణనీయమైన పురోగతి సాధించింది. చంద్రుడు, అంగారక గ్రహాన్వేషణ కార్యక్రమాలలో కూడా ప్రయోగాలు నిర్వహిస్తోంది. 2008 అక్టోబర్ 22న భారత్ చంద్రయాన్–1 ప్రయోగించింది. దీని ఫలితంగా ప్రపంచానికి తొలిసారిగా చంద్రునిపై నీటి జాడలు గుర్తించినట్లు భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్తలు ప్రకటించారు. 'మంగళ్‌యాన్'ను 2019 నవంబర్ 5న పిఎస్ఎల్‌విసి–25 ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. పిఎస్ఎల్‌విసి–37 ద్వారా నింగిలోకి ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రవేశపెట్టడంతో భారత్ ప్రపంచ రికార్డు సృష్టించింది.

చంద్రుని దక్షిణ ధ్రువం సమీపంలోని ఉపరితలంలో సల్ఫర్ ఉనికి గురించి ముందే తెలిసినా, అది అక్కడ ఉన్నదని చంద్రయాన్–3లో జరిపిన పరిశోధనలలో వెల్లడయింది. సల్ఫర్‌తో పాటు అల్యూమినియం, కాల్షియం, ఇనుము, క్రోమియం, టైటానియం, మాంగనీసు, సిలికాన్, ఆక్సిజన్ వంటి మూలకాలు కూడా ఉన్నట్లు గుర్తించారు. 2023 సెప్టెంబర్ 3న చంద్రుని ఉపరితలంపై ల్యాండర్ విక్రమ్ ఒక గంతు వేసింది. దాని ఇంజన్లను మండించి 30 సెంటీమీటర్లు ఎత్తుకు ఎగిరించి అంతే దూరం దూకించారు. భవిష్యత్‌లో జరిపే వెనక్కి తిరిగివచ్చే యాత్రల్లో ఉపయోగించాల్సిన సామర్థ్యాలను ఈ పరీక్ష ప్రదర్శించింది. చంద్రయాన్–3 విజయంతో చంద్రునిపై ల్యాండింగ్ సాధించిన నాల్గవ దేశంగా భారత్ గుర్తింపు పొందింది. అంతేకాక దక్షిణ ధ్రువం సమీపంలో చంద్ర ఉపరితలంపై దిగిన మొదటి దేశంగా చరిత్రలో స్థానం సంపాదించుకుంది.





జాతీయ అంతరిక్ష దినోత్సవం అంతరిక్ష పరిశోధనలలో భారతదేశం సాధించిన విజయాల వేడుక. ఇస్రో శాస్త్రవేత్తల, ఇంజనీర్ల కృషి, అంకితభావాన్ని ఈ శుభదినం గుర్తుచేస్తుంది.

ఉపగ్రహాలను భారతదేశం స్వయంగా ప్రయోగించే లక్ష్యంతో ఇస్రో మొదట ఎస్ఎల్‌వి (ఉపగ్రహ ప్రయోగ వాహనం) తరువాత పిఎస్ఎల్‌వి, ఆ తరువాత జిఎస్ఎల్‌విలను నిర్మించి అభివృద్ధిపరిచారు. ఇందులో ఎస్ఎల్‌వి తరగతికి చెందిన వాహకనౌక భూ నిమ్న కక్ష్యలో 40 కిలోల బరువు ఉన్న ఉపగ్రహాలను మాత్రమే అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగలదు. పిఎస్ఎల్‌వి రెండు వేల కిలోల బరువున్న ఉపగ్రహాలను భూనిమ్న కక్ష్యలో ప్రవేశపెట్టగలదు.

పిఎస్ఎల్‌వి వాహకనౌక ద్వారా పలు దేశీయ, విదేశీయ ఉపగ్రహాలను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అంతకుముందు ఇన్సాట్ వంటి దేశీయ ఉపగ్రహాలను భూస్థిర, భూఅనువర్తిత కక్ష్యకు పంపేందుకు ఇస్రో విదేశాలపై ఆధారపడేది. ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టడాన్ని సొంత గడ్డ మీద నుంచే సాధించాలనే లక్ష్యంతో జిఎస్ఎల్‌వి శ్రేణి వాహకనౌకలను రూపకల్పన చేసి, అభివృద్ధిపరచి నిర్మించారు. వీటి నిర్మాణానికి ఇస్రో 1990లో శ్రీకారం చుట్టింది. 2001 నుంచి 2015 ఆగస్టు 27 వరకు ఇస్రో తొమ్మిది జిఎస్ఎల్‌వి వాహకనౌకలను ప్రయోగించగా, క్రయోజనిక్ స్థాయిలో లోపం వల్ల మూడు ప్రయోగాలు విఫలమయ్యాయి. 1991లో రష్యా–భారత ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందాలలో రష్యన్ కంపెనీ గ్లావ్ కాస్మోస్ 5 క్రయోజనిక్ ఇంజన్లు, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వాల్సి ఉంది. కాని 1992లో ఇండియాపై అమెరికా విధించిన ఆంక్షల వల్ల రష్యా ఆ ఒప్పందం నుంచి వెనక్కి తగ్గి, కేవలం క్రయోజనిక్ ఇంజన్లు మాత్రమే సరఫరా చేసింది. 1994లో భారత్ సొంతంగా స్వదేశీ పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజన్‌ని అభివృద్ధిపరచడం ఆరంభించింది. 2014 నుంచి వైఫల్యాల తరువాత ప్రయోగాలు సఫలమైనాయి.

ఆగస్టు 23న జరుపుకునే జాతీయ అంతరిక్ష దినోత్సవం అంతరిక్ష పరిశోధనలనలో భారతదేశం సాధించిన విజయాల వేడుకగా దర్శనం ఇస్తుంది. ఇస్రో శాస్త్రవేత్తల, ఇంజనీర్ల కృషి, అంకితభావాన్ని గుర్తుచేస్తుంది. దేశవ్యాప్తంగా ఈ రోజున అంతరిక్ష కార్యక్రమాలకు మన దేశం సాధించిన విజయాల పరంపరలను ప్రదర్శించి, వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహిస్తారు. అంతరిక్ష అన్వేషణ ఫలితంగా పొందిన జ్ఞానంతో సుస్థిర అభివృద్ధి కోసం ఎలాంటి విధానాలు అమలు చేయవచ్చుననే విషయంపై చర్చా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. సైన్స్ అండ్ టెక్నాలజీల్లో కెరీర్‌లు కొనసాగించడానికి యువతరానికి స్ఫూర్తిని కలిగించే ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయాలి.

సమీప భవిష్యత్‌లో ఇస్రో కొన్ని అద్భుతమైన మిషన్లు ప్లాన్ చేస్తోంది. అవి– భారతీయ వ్యోమగాములను పరిశోధన కోసం అంతరిక్షంలోకి పంపడమే లక్ష్యంగా గగన్‌యాన్ ప్రాజెక్టు. సౌర కరోనాను అధ్యయనం చేయడానికి ఆదిత్య ఎల్–1 మిషన్. చంద్రయాన్–3కి కొనసాగింపుగా చంద్రుడి ఉపరితలాన్ని మరింత అన్వేషించడానికి చంద్రయాన్–4 ప్రాజెక్టును లక్ష్యంగా పెట్టుకుంది. శుక్రగ్రహాన్ని అధ్యయనం చేయడానికి శుక్రయాన్–1 ప్లాన్ చేస్తున్నారు. అంగారక గ్రహాన్ని మరింత లోతుగా అన్వేషించే లక్ష్యంతో మంగళయాన్–2ని రూపొందిస్తున్నారు. నాసా–ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్ (నిసార్) సంయుక్తంగా భూమి, భూమిపై మంచు ఉపరితలాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయనున్నది. అంతరిక్ష పరిశోధనలు, శాస్త్రీయ పరిశోధనలను ముందుకు తీసుకువెళ్లాలన్న ఇస్రో నిబద్ధతను ఈ మిషన్లు ప్రతిబింబిస్తున్నాయి.

● సివి సర్వేశ్వర శర్మ
ప్రెసిడెంట్, కోనసీమ సైన్స్ పరిషత్

(నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం)

పంటలపై కోతులు, వీధుల్లో కుక్కలు!

తెలంగాణ ప్రజలు రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న అతి ప్రధాన సమస్యలు ఏమిటి అని ప్రశ్నించుకుంటే మొదటి ఐదింట్లో ఖచ్చితంగా కోతులు, కుక్కల వల్ల ఎదురవుతున్న ఇబ్బందుల ప్రస్తావన వస్తుంది. సమస్య తీవ్రతను గుర్తెరిగి నేను శాసనమండలిలో దీన్ని లేవనెత్తాను, సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించాను. జంతువులు వైరస్‌ని తీసుకువెళతాయి. అవి మనుషులకు సోకితే జరిగే విపత్కర పరిణామాలకు అంతు ఉండదు. దీన్నో సామాజిక సమస్యగా గుర్తించాలి. రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాలు కలిసికట్టుగా కృషి చేయాలి.

కోతుల బెడద పంటలపై కూడా ప్రభావం చూపుతున్నది. కొన్ని ప్రాంతాల్లో రైతులు పంటల తీరును మార్చుకున్నారు. వేరుశెనగ, పచ్చి శెనగలు, కూరగాయలు, ఇంటి తోటలు, ఇళ్లలోని పండ్ల చెట్లు వంటి పంటలను కోతులకు భయపడి రైతులు వదులుకున్నారు. ఈ జంతువులు ఇప్పుడు ధాన్యం ఏర్పడే ప్రారంభ దశలో వరిని తింటున్నాయి. చాలామంది రైతులు తాము కోరుకున్న పంటలను సాగు చేయలేక పోతున్నారు. సాగు చేస్తున్న పంటల ఉత్పాదకతను కోల్పోతున్నారు. కోతులు, ఇతర జంతువుల కారణంగా వ్యవసాయ ఉత్పాదకత మొత్తం నష్టం సంవత్సరానికి కనీసం రూ.5వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు ఉండవచ్చు. ఉదాహరణకు వేరుశెనగ ఉత్పత్తి విలువ రూ.2000కోట్లకు దగ్గరగా ఉంటుంది. కోతుల బెడదతో చాలామంది రైతులు ఆ పంటను చాలా ప్రాంతాల్లో వదిలేశారు. ఈ జంతువులు పత్తి పంటను కూడా వదలడం లేదు. కాబట్టి ఈ జంతువుల వల్ల ఆర్థిక నష్టం దాదాపు రూ.10వేల కోట్లకు చేరువలో ఉంటుంది. రైతులకు ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేయడానికి సరైన సర్వే చేపట్టాలి.



తెలంగాణలో కోతుల, కుక్కల సమస్యకు కచ్చితమైన పరిష్కారం కనుక్కోవాల్సిన తక్షణ ఆవశ్యకత ఉంది. దీన్నో సామాజిక సమస్యగా గుర్తించాలి. పరిష్కారానికి అన్ని పార్టీలు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాలు కలిసికట్టుగా కృషి చేయాలి.

తెలంగాణలో కోతుల కాటు కారణంగా ప్రతి ఏటా అనేక మరణాలు కూడా నమోదవుతున్నాయి. హైదరాబాద్ నగరంతో సహా గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా కోతులు, కుక్కలు మనుషులపై దాడులు చేస్తూనే ఉన్నాయి. పిల్లలు ఆడుకోవడానికి వెళ్లడానికి జంకుతున్నారు. వృద్ధులు వీధుల్లో ఒంటరిగా నడవడం లేదు. వీటి బెడద సాధారణ జన జీవనానికి ఇబ్బందిగా మారింది. కోతుల, కుక్కల నుంచి రక్షణ కోసం రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి ఎంతో కొంత ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. కోతుల నుండి రక్షించడానికి ఇంటి చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేసుకోవాల్సి వస్తున్నది. సోలార్ ఫెన్సింగ్ వేలాది రూపాయల ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ, కొన్నిసార్లు ఫలితం కూడా ఇవ్వదు. కొన్ని చోట్ల కోతులను బెదిరించి పంపడానికి కొండెంగలను కూడ తీసుకొచ్చారు కానీ, ఆ ప్రయోగం కూడా పెద్దగా ఫలించలేదు. ఈ సమస్యకు తక్షణ, దీర్ఘకాలిక పరిష్కారం వెతకడం అనివార్యం.

ఈ ముప్పును నివారించే చర్యలను ప్రారంభించే ముందు ప్రభుత్వం కొన్ని పనులు చేయాలి. వివిధ జిల్లాల్లో సమస్య తీవ్రత, ప్రభావంపై సర్వే నిర్వహించాలి. సమస్యను పరిష్కరించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కమిటీలో ఉండేలా అన్ని పార్టీల శాసనసభా పక్ష బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ క్రమం తప్పకుండా పరిస్థితిని సమీక్షించాలి. సరైన అధికారాలతో ప్రత్యేక మంకీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఈ సమస్యను తొలగించే వరకు దానిని ఎదుర్కోవడానికి నిధులను అందిచాలి. సర్వే పూర్తయిన తర్వాత ఆడ, మగ కోతులకు సామూహిక స్టెరిలైజేషన్ చేయించాలి. స్టెరిలైజేషన్ తర్వాత సదరు కోతి, కుక్కకు గుర్తింపు సంఖ్య ఇవ్వాలి. మళ్లీ అదే కుక్క, కోతి పట్టబడితే మళ్లీ స్టెరిలైజ్ చేయాల్సిన అవసరం ఉండదు. రేబిస్ మరియు ఇతర వ్యాధులను తగ్గించడానికి టీకాలు ఏకకాలంలో వేయాలి. ప్రతి మండలానికి కనీసం ఒకటి చొప్పున సురక్షితమైన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. స్టెరిలైజ్ చేసిన కోతులను ఓపెన్ ఎన్‌క్లోజర్‌లలో ఉంచవచ్చు, తద్వారా ఆసక్తి ఉన్న వ్యక్తులు వాటిని సందర్శించి ఆహారం ఇవ్వవచ్చు. కుక్కల యాజమానులపైన కూడా నియంత్రణను అమలులోకి తీసుకురావాలి. కుక్కను పెంపుడు జంతువులుగా ఉంచుకోవాలనుకుంటే దాని యజమాని ఇతరులకు ఎటువంటి గాయం కాకుండా ఉండేందుకు నియమాలు, నిబంధనలను అనుసరించటాన్ని తప్పనిసరి చేయాలి. తెలంగాణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవి వీధికుక్కలు. అందుకే వీధుల్లో కుక్కలు కనిపించకపోవడమే లక్ష్యంగా పని చేయాలి.

○ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు
శాసనమండలి సభ్యులు

అభివృద్ధి వేగానికి పెట్టుబడుల ఇంధనం

"ఎన్నో ఏళ్లుగా కష్టపడి చారిత్రాత్మకమైన హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లను నిర్మించుకున్నాం. ఇప్పుడు మనందరం కలిసి ప్రపంచ స్థాయి నాలుగవ నగరంగా ఫ్యూచర్ సిటీని తయారు చేసుకుంటున్నాం. హైదరాబాద్‌లో ఇప్పుడు మీరు పెట్టుబడి పెట్టే ప్రతి రూపాయి తప్పకుండా మీ భవిష్యత్తుకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావాలి. అభివృద్ధిలో ప్రవాసులు భాగస్వామ్యం పంచుకోవాలి!" ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా చేసిన అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలివి. ఇది సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి రెండో విదేశీ పర్యటన. బాధ్యతలు చేపట్టిన తొలి రోజుల్లోనే దావోస్ పర్యటన చేసి రూ.40,232కోట్ల పెట్టుబడులను రాబట్టారు. తాజాగా ఏడు రోజుల అమెరికా, రెండు రోజుల దక్షిణ కొరియా పర్యటనలలో అమెరికా నుంచి రూ.31,502 కోట్లు, దక్షిణ కొరియా నుంచి రూ.4500 కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. దీంతో సుమారు 30,750 పైగా ఉద్యోగాలు రానున్నాయి.

తాము ఇచ్చిన తెలంగాణను దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా అభివృద్ధి చేసుకోవాలని కాంగ్రెస్‌కు ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే విజన్‌తో ముందుకు సాగుతోంది. అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలలో కుదిరిన ఒప్పందాలతో సుమారు 30,750 పైగా ఉద్యోగాలు రానున్నాయి.



తాము ఇచ్చిన రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా అభివృద్ధి చేసుకోవాలని కాంగ్రెస్‌కు ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే విజన్‌తో ముందుకు సాగుతోంది. అమెరికా పర్యటనలో భాగంగా మొదటగా ప్రముఖ అంతర్జాతీయ ఐటీ దిగ్గజ కంపెనీ కాగ్నిజెంట్ ప్రతినిధులతో జరిగిన సమావేశం విజయవంతమైంది. హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ 10 లక్షల చదరపు అడుగులతో భారీ విస్తరణ చేపట్టనున్నట్టుగా ప్రకటించడం శుభపరిణామం. దీంతో సుమారు 15వేల మందికి ఉద్యోగావకాశం లభిస్తుంది. ఉద్యోగావకాశాలే కాకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో పాటు ఇతర ఆధునాతన సాంకేతిక రంగాలలో ప్రగతిని సాధించేందుకు మార్గం ఏర్పడింది. అమెరికాకు చెందిన వాల్ష్ కర్రా హోల్డింగ్స్ సంస్థ రూ.839 కోట్లతో పెట్టుబడులను పెట్టేందుకు ముందుకొచ్చింది. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించేందుకు విహబ్‌లో మరో రూ.42 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పదం కూడా చేసుకుంది. బయో ఫ్యూయల్స్ తయారీ సంస్థ స్వచ్ఛ బయో ప్లాంట్‌ను రూ.1000 కోట్లతో హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. మరోవైపు టెక్నాలజీ, సర్వీసెస్ సొల్యూషన్స్‌లో పేరొందిన ఆర్సీసీఎం సంస్థ సైతం నగరంలో విస్తరణకు ముందుకొచ్చింది. ప్రముఖ ఫార్మా కంపెనీ వివింట్ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో రూ.400 కోట్లతో అత్యాధునిక ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. 2025 నుంచి కార్నింగ్ వాణిజ్య సంస్థ ఉత్పత్తిని చేపట్టేందుకు అంగీకరించింది. ఆర్థికపరమైన సేవల్లో పేరొందిన అమెరికా బహుళ జాతి సంస్థ చార్లెస్ స్క్వాబ్ సెంటర్ భారత్‌లోనే తొలి కేంద్రంగా హైదరాబాద్‌లో ఏర్పాటుకు ముందుకొచ్చింది. ప్రముఖ టెక్ దిగ్గజం అడోబ్ సంస్థ సీఈఓ శంతను నారాయణ్ హైదరాబాద్ 4.0 సిటీ నిర్మాణం, స్కిల్ వర్సిటీ, ఏఐలో భాగమయ్యేందుకు అంగీకరించడం హర్షించదగిన విషయం. ఇదే కాకుండా గ్రీన్ డేటా సెంటర్‌ను రూ.3,350 కోట్ల పెట్టుబడులతో నిర్మిస్తామని ఆరమ్ ఈక్విటీ పార్టనర్స్ సంస్థ ప్రకటించింది. ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జొయిటిస్ కంపెనీ హైదరాబాద్‌లో తమ కేపబిలిటీ సెంటర్‌ను విస్తరించనున్నట్టుగా ప్రకటించింది.

తెలంగాణలో ఏర్పాటు చేసే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, న్యూ లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీలతో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్యం కానుంది. తెలంగాణలో స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ శాటిలైట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, హెల్త్‌కేర్ రంగంలో యువతకు నైపుణ్యాల అభివృద్ధిని అందించే అవకాశం ఉంది. అమెజాన్ కంపెనీ హైదరాబాద్‌లో తన డేటా సెంటర్‌ను విస్తరించే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శించడం గొప్ప పరిణామం.

ఇవే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ప్రాధామ్యాల అమలుకు కావాల్సిన సహకారాన్ని అందించేందుకు ప్రపంచ బ్యాంకు కూడా ముందుకు రావడం మరో గొప్ప విజయం. రాష్ట్రంలో పెట్టుబడులకు దక్షిణ కొరియా కూడా ముందుకు రావడం మంచి పరిణామం. హ్యుందాయ్ మోటార్స్ తెలంగాణలో మెగా ఆటోమోటివ్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు కొరియాకు చెందిన 25 అగ్రశ్రేణి కంపెనీలు అంగీకరించాయి. దీంతో హైదరాబాద్‌తో పాటు వరంగల్ అభివృద్ధికి కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందనే విషయం స్పష్టమైంది. ఏది ఏమైనప్పటికీ స్వయంగా ముఖ్యమంత్రే రాష్ట్రంలో అంతర్జాతీయ పెట్టుబడుల కోసం చేసిన ప్రయత్నం విజయవంతం కావడం హర్షించదగిన విషయం.

■ డా. ఎన్. యాదగిరిరావు
అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
శుక్రవారం 23 ఆగస్టు 2024



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

- లోక్‌సభ ఎన్నికల్లో నైతికంగా ఓడిన బీజేపీ
- అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు
- హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణకు జేపీసీ వేయాలి
- సెబీ చైర్మన్‌తో రాజీనామా చేయించాలి
- జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓటమే
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

7

అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు దేశాన్ని అప్పగించి ప్రధాని మోదీ ఊడిగం చేస్తున్నాడని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో పూర్తిస్థాయి మెజారిటీ రాకున్నా.. మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేశారని అన్నారు. హనుమకొండలోని హరితహోటల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్న ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ



భద్రకాళి చెరువులో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క



కాలుష్య కోరల్లో చెరువులు

దుర్గంధం వెదజల్లుతున్న నగరంలోని జలాశయాలు

- విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్క నాచు
- కలుషితమవుతున్న చెరువుల నీరు..
- దెబ్బతింటున్న వాతావరణం
- దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్న ప్రజలు
- నిరుపయోగంగా ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ మిషన్
- చెరువుల శుద్ధిపై బల్దియాకు లోపించిన చిత్తశుద్ధి

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని దాదాపు అన్ని చెరువుల్లో చెత్తాచెదారం పేరుపోయింది. నాచు (గ్రీన్ ఆల్గే) పెరిగి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. చెరువుల నుంచి వస్తున్న దుర్వాసనతో అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వేసవిలో చెరువుల్లో జరిగే రసాయనిక చర్య వలన దుర్వాసన పెరుగుతోంది. చెరువుల్లో కలిసే వ్యర్థాలు, అందులో పెరిగే గ్రీన్ ఆల్గే, గుర్రపుడెక్క వల్ల తీవ్రత ఉంటోంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చెరువుల్లో విడుదలవుతున్న గ్యాస్ శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించి పరీక్షించిన తర్వాత వరంగల్ నగరంలోని చెరువులన్నీ కాలుష్య కాసారాలుగా మారిపోయాయని, వీటిని ఇలాగే వదిలేస్తే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించింది.

దట్టంగా గుర్రపు డెక్క

చెరువుల్లో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోతోంది. వర్షాకాలంలో ఇది మరింత వేగంగా చెరువులను ఆక్రమిస్తోంది. గుర్రపుడెక్క చెరువులన్నిటినీ పూర్తిగా ఆక్రమించడంతో అవి పచ్చనిమైదానంలా కనిపిస్తున్నాయి. దూరం నుంచి చూస్తే అవన్నీ పచ్చిక బయళ్లేమోననే భ్రమను కల్పింపచేస్తున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగించకపోతే చెరువులకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. గుర్రపు డెక్కను అంత సులభంగా తొలగించడం వీలుగాదు. వీటి వేళ్లు నీళ్లలో లోతుగా పాతుకుతాయి. చేతితో తొలగించడం కష్టం.


కూలీలతో తొలగించాలన్నా సాధ్యం కాదు. వేళ్లను మూలాల నుంచి తొలగిస్తే తప్పా దీనిని నిర్మూలించలేము. పైగా గుర్రపుడెక్కను తొలగించే క్రమంలో వాటితీగల్లో చిక్కుకుపోయి కూలీలు చెరువులో మునిగి మృతి చెందిన ఉదంతాలు ఉన్నాయి.

పర్యావరణ వేత్తల ఆందోళన

'మా చెరువులను కాపాడరూ' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని పురస్కరించుకొని వరంగల్‌లోని పర్యావరణవేత్తలు కొందరు నగరంలోని చెరువులను సందర్శించారు. వాటిలో గుర్రపుడెక్క విపరీతంగా పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థ పదార్థాలను తొలగించడంలో వరంగల్ కార్పొరేషన్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భద్రకాళి చెరువు వద్ద నిరుపయోగంగా పడి ఉన్న ఈ ఫ్లోటింగ్ మిషన్‌ను కూడా పరిశీలించారు. చెరువులను శుద్ధి చేయడానికి విలువైన ఈ యంత్రాన్ని ఉపయోగించాలని వారు కోరుతున్నారు.

దోమల బెడద

గుర్రపు డెక్క వల్ల దోమలు విపరీతంగా పెరుగుతాయి. నీళ్లు పూర్తిగా కలుషితమవుతాయి.



నిరుపయోగంగా ఉన్న ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ మిషన్

పరిసరాలు అపరిశుభ్రంగా మారుతాయి. నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడతాయి. వాతావరణం కలుషితమవు తుంది. దీంతో సమీప కాలనీల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధానంగా గుర్రపుడెక్క దట్టంగా పెరిగిన చెరువుల్లో చేపలు సరిగా పెరగవు. వాటికి ప్రాణవాయువు అందక మరణిస్తాయి. మత్స్యకారులు చెరువుల్లో గుర్రపు డెక్కలేకుండా చూడాలని వరంగల్ నగర పాలక సంస్థ అధికారులను తరుచూ విజ్ఞప్తులు చేస్తున్నారు. కాగా, భద్రకాళి చెరువులో సందర్శకుల కోసం బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. బోట్ నడవాలంటే చెరువులో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదు. కానీ ఇందులో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క, వ్యర్థ పదార్థాలు పేరుకుపోవడంతో ముందుగా దీనిని తొలగించాల్సిన అవసరం ఏర్పడింది.

ఎఫ్‌టీసీఎం మిషన్

వరంగల్ నగరంలోని చెరువుల్లో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్కను, పేరుకుపోయిన ఇతర వ్యర్థాలను తొలగించేందుకు వరంగల్ నగర పాలక సంస్థ రూ.2 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ మిషన్ (ఎఫ్‌టీసీఎం) ఏడాదిన్నరగా నిరుపయోగంగా పడి ఉన్నది. వాస్తవంగా మార్కెట్‌లో దీని రేటు రూ.1.20 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఉంటుంది. కానీ వరంగల్ నగర పాలక సంస్థ మాత్రం దీనిని రూ.2కోట్లకు కొనుగోలు చేసింది. ఈ వ్యవహారంలో సుమారు రూ.50లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయి. యంత్రాన్ని కొన్న కొత్తలో భద్రకాళి చెరువులోని గుర్రపు డెక్కను కొంత మేరకు తొలగించేందుకు దీనిని ఉపయోగించారు. భద్రకాళి చెరువులో బోట్ తిరగడానికి వీలుగా గుర్రపు డెక్కను తొలగించారు. ఓ నాలుగైదు నెలలు పని చేసిన తర్వాత ఈ మిషన్ చెడిపోయింది. అప్పటి నుంచి ఇది మూలపడింది. చెరువులోనే కట్టపక్క నీళ్లలో తేలుతూ నిరుపయోగం పడింది. చాలా కాలంగా ఇది నీళ్లలో నానుతుండడంతో క్రమంగా తుప్పుపట్టి దెబ్బతింటోంది. చెరువుల్లో గుర్రపు డెక్కను, నాచును, ఇతర వ్యర్థపదార్థాలను తొలగించాల్సిన ఈ విలువైన యంత్రాన్ని ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల ప్రజాధనం వృథా అయిపోతోంది. చెరువుల్లో కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది.

చెరువులు

వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాలతోపాటు దాని చుట్టు పక్కల విలీన గ్రామాల్లో చిన్నవి, పెద్దవి కలిపి సుమారు వందకుపైగా చెరువులు ఉన్నాయి. ఇందులో భద్రకాళి, వడ్డెపల్లి, చిన్నవడ్డెపల్లి చెరువులు, అలాగే మట్టెవాడ కోట చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, ఉర్సు రంగ సముద్రం చెరువు, తిమ్మాపురం బెస్తం చెరువు, రంగశాయిపేట దామెర చెరువు. తిమ్మాపురం చెస్తం చెరువు, రంగశాయిపేట బంధం చెరువు ప్రధానమైన చెరువులు. ఇవి కాకుండా పలు కుంటలు కూడా ఉన్నాయి.

'వరంగల్ జిల్లా'కు గవర్నర్ రాక

- ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన
- రచయితలు, కళాకారులు, ఉన్నతాధికారులతో సమావేశం
- చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్న జిష్ణుదేవ్‌వర్మ
- జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఆయా జిల్లాల కలెక్టర్లు



వివరాలు : 7లో..



సమ్మెలో మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన హేయం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- జూడాల ఆందోళనకు సంఘీభావం

వరంగల్ మెడికల్, ఆగస్టు 22: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం సంఘటన అత్యంత హేయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించినప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కావని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు చేస్తున్న నిరసనకు గురువారం ఎంపీ సంఘీభావం తెలిపి మాట్లాడారు. దేశవ్యాప్తంగా వైద్యులపై జరిగే దాడుల పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, దాడులకు పాల్పడే నిందితులకు కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ మెడికల్ కళాశాలలు, ఆస్పత్రుల్లో భద్రతను పెంచి, వైద్యులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూడాలు చేస్తున్న నిరసనకు తన పూర్తి మద్దతు ఉంటుందని ఎంపీ కావ్య పేర్కొన్నారు.

రుణమాఫీ కాకుంటే దరఖాస్తు చేసుకోవాలి

- నేటి నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు22: రుణమాఫీ కాని రైతులు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లతో రుణమాఫీపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రుణమాఫీకి రైతులు దరఖాస్తు చేసుకున్న వివరాలు అప్‌లోడ్ చేసిన వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్‌డెస్క్ నిరంతరం సాగే ప్రక్రియ అని, దీనికి ఆఖరి తేదీ అంటూ లేదన్నారు. రుణమాఫీపై నేటి నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి హెల్ప్‌డెస్కులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తారన్నారు. మండల వ్యవసాయ అధికారులు షెడ్యూల్ తయారు చేసుకుని దాని ప్రకారం ఏ గ్రామం వెళుతున్నారనేది ముందుగానే ఆ గ్రామంలోని రైతులకు తెలియజేసి వారిని ఒకదగ్గరకు రప్పించి సమస్య పరిష్కరించాలని సూచించారు. ముందుగానే అన్ని గ్రామాలకు సమాచారం పంపించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు బ్యాంకుల నుంచి రుణమాఫీ అయిన వారి రైతుల జాబితా తీసుకుని ఎవరైనా రెన్యువల్ కాని రైతులు ఉంటే వారికి సమాచారం ఇచ్చి రెన్యువల్ అయ్యేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంక్ అధికారులు మిగిలి ఉన్న ఖాతాలకు త్వరగా ఈ నెలాఖరులోగా రెన్యువల్ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 43,881 మంది రైతులకు రుణమాఫీ కాగా, 21,426 మంది రైతులకు రెన్యువల్ అయ్యాయని, వారికి రూ.1741.12కోట్లు జమ అయినట్లు ఈ సందర్భంగా కలెకర్ ప్రావీణ్య తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, బ్యాంక్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మాడవీధుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

భద్రకాళి దేవాలయ మాడవీధుల నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. మాడవీధుల సత్వర నిర్మాణం కోసం ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని అధికారులను కోరారు. భద్రకాళి ట్యాంకులో ఎక్కువ నీరు నిల్వ ఉంచేందుకు చెరువులోని మట్టిని పూడికతీసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భద్రకాళి చెరువును ఖాళీ చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్ తెలపగా, త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నీటిపారుదల శాఖ, కుడా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డీసిల్టింగ్, నాలా పనుల కోసం రూ.158కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇరిగేషన్, నీటిపారుదల, కుడా అధికారులు పాల్గొన్నారు.

గంజాయిని తరిమికొడదాం..

- డ్రగ్ కంట్రోల్ టీమ్ ఏర్పాటుతో సత్ఫలితాలు
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం, ఆగస్టు 22: ప్రజలు, పోలీసులు సమష్టిగా కృషి చేసి వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గంజాయి నిర్మూలనకు కృషి చేద్దామని సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గంజాయి నిర్మూలనకు ఏర్పాటు చేసిన డ్రగ్ కంట్రోల్ టీమ్ పనితీరు గురించి సీపీ వివరించారు. నెల కిందట ఏర్పాటు చేసి డ్రగ్ కంట్రోల్ టీమ్ కమిషనరేట్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, కోచింగ్ సెంటర్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లపై ప్రత్యేక నిఘా పెట్టిందన్నారు. గంజాయి విక్రయిస్తున్న వారిని, సేవిస్తున్న వారిని పట్టుకుందన్నారు. ఈ దాడుల్లో 14 కేసులు నమోదు చేసి 33 మంది గంజాయి విక్రయదారులను అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. వీరి నుంచి రూ.3లక్షల విలువైన 11 కిలోల గంజాయిని, ఆరు ద్విచక్ర వాహనాలు, 44 సెల్ ఫోన్లు, ఒక ట్యాబ్, ఒక ల్యాప్‌ట్యాప్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి సేవిస్తూ పట్టుబడిన 68మందికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఆయన వివరించారు. గంజాయి విక్రయించే వారిపై, సేవించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి విక్రయిస్తున్నట్లు, సేవిస్తున్నట్లు గుర్తిస్తే 8712584473 నంబర్‌కు కాల్ చేయాలని అంబర్ కిషోర్ ఝా సూచించారు.

అంతరాష్ట్ర ముఠా అరెస్టు

- నకిలీ ప్రెస్, సీబీఐ, కార్డులతో మోసాలు
- రూ.1కోటి34లక్షలు టోకరా
- సుబేదారీ సీఐ సత్యనారాయణ వెల్లడి

7

నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం

7

రైతులతో రాజకీయాలు వద్దు..

- అందరికీ రుణమాఫీ చేయాల్సిందే..
- రాజీలేని పోరాటం చేస్తాం, ప్రజల పక్షాన నిలబడతాం..
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



హనుమకొండ ఏకశిల పార్కు వద్ద రైతులతో కలిసి ధర్నా చేస్తున్న వినయభాస్కర్

రాంనగర్, ఆగస్టు 22: రైతులతో రాజకీయాలు చేయొద్దని, వందశాతం రైతులకు రుణమాఫీ చేసి తీరాల్సిందేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం హనుమకొండలోని ఏకశిలాపార్కు వద్ద పార్టీ అధ్వర్యంలో రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ధర్నాలో పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కొంతమందికి మాత్రమే మాఫీచేసి మోసం చేసిందన్నారు. రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాల్లోనూ కోతలేనని ఆయన ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతోందన్నారు. రైతులకు బోనస్ విషయంలో కాంగ్రెస్ మాటలు బోగస్ అయ్యాయన్నారు. రైతుబంధు ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి.. మొత్తానికి ఎగ్గొట్టారని ఆయన విమర్శించారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ దగా చేసిందని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని, ప్రజల పక్షాన నిలుస్తామని వినయభాస్కర్ తెలిపారు.

అనంతరం హనుమకొండలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చారు. పెగడపల్లి, వంగపహాడ్ సంఘాల సభ్యుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు అశోక్ యాదవ్, చెన్నం మధు, నర్సింగ్, రంజిత్‌రావు, రాధికారెడ్డి, దివ్య, నేతలు జనార్దన్‌గౌడ్, జోరిక రమేశ్, పులి రజనీకాంత్, చుంచు కృష్ణ, నరెడ్ల శ్రీధర్, కుఎర్ యాదవ్, శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఏడుగురు ఎస్ఐల బదిలీ



వరంగల్ క్రైం, ఆగస్టు 22: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.రాజేష్ రెడ్డి వీఆర్ నుంచి నర్సంపేటకు, జె.పరమేశ్వర్ వీఆర్ నుంచి ఆత్మకూరుకు, కె.అశోక్‌కుమార్ వీఆర్ నుంచి హనుమకొం డకు, పి.తిరుపతి వీఆర్ నుంచి నర్సంపేటకు, డి.నిహారిక సీఎస్‌బీ నుంచి పీసీఆర్‌కు, ఎం.రాజు సీసీఎస్ నుంచి కేయూ సీకి, ఎస్.రవి సీసీఎస్ నుంచి హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు.

అంబరాన్నంటిన తీజ్ సంబరాలు

- ప్రతిబింబించిన బంజారా సంస్కృతి
- భక్తి ప్రపత్తులతో తీజ్ నిమజ్జనోత్సవం

వడ్డెపల్లి, ఆగస్టు 22: హనుమకొండలోని వివిధ డివిజన్లలో తీజ్ ఉత్సవాల సంబరాలు అంబరాన్నంటాయి. బంజారా మహిళల ఆట పాటలతో బంజారా సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించాయి. నవరాత్రులు తీజ్ ఉత్సవాలను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించిన బంజారాలు గురువారం సాయంత్రం తీజ్ బుట్టలను నిమజ్జనం చేశారు. గ్రేటర్ వరంగల్ 55, 56వ డివిజన్ల పరిధిలోని గోపాల్‌పూర్, బాలాజీ నగర్, బాలా నగర్‌లలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రజిత వెంకటేశ్వర్లు యాదవ్, సిరంగి సునిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మేరామాయాడీని కొలిచారు. బాలాజీనగర్‌లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు బానోత్ జవహర్‌లాల్, ధారావత్ రాంచందర్ నాయక్‌తో పాటు ఎస్‌డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ గుగులోత్ ప్రొఫెసర్ వీరన్న నాయక్‌తోపాటు బంజారా మహిళలు, యువతులు మేరామాయాడీని భక్తి ప్రపత్తులతో కొలిచారు. 56వ డివిజన్‌లోని వెటర్నరీ కాలనీలో సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం కన్వీనర్ పోరిక అనసూయ, అధ్యక్షుడు లావుడ్య హేమా నాయక్, ప్రధాన కార్యదర్శి బి. వీరన్న నాయక్, లావుడ్య రాజు నాయక్ ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాల వేడుకలు నయనానందకరంగా నిర్వహించారు.

నవరాత్రులు ఉత్సవాలను నిర్వహించిన బంజారా మహిళలు తీజ్ బుట్టలను నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య బంజారా సంస్కృతి ఉట్టి పడే రీతిలో నృత్యాలు చేస్తూ ఊరి పొలిమేరలోని చెరువు, కుంటల వద్దకు తరలించి మేరామాయాడీని పూజించి భక్తిశ్రద్ధలతోతీజ్ బుట్టలను నిమజ్జనం చేశారు.



తీజ్ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రజితవెంకన్న, సిరంగి సునిల్‌కుమార్

వ్యవసాయ శాఖలో అధికారుల బదిలీలు

బాలసముద్రం, ఆగస్టు22: హనుమకొండ జిల్లా వ్యవసాయశాఖలో అధికారులు బదిలీ అయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదేశాలతో మల్టీజోన్-1పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాలో పని చేస్తున్న అధికారులకు సాధారణ బదిలీలు అయినట్లు తెలిపారు. ఎం.లక్ష్మీనారాయణ మహబూబాబాద్ నుంచి హనుమకొండ ఏడీఏగా, హనుమకొండ ఏడీఏగా పని చేసిన కె.దామోదర్‌రెడ్డి నర్సంపేటకు బదిలీ అయ్యారు. అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోలుగా అఫ్జల్‌పాషా, భీమదేవరపల్లి నుంచి హనుమకొండకు బదిలీ కాగా, బి.మాధవి హనుమకొండ నుంచి దుగ్గొండికి బదిలీ అయ్యారు. కాజీపేట ఏవోగా పని చేసిన శ్రీధర్‌రెడ్డి హనుమకొండ అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోగా వచ్చారు. భీమదేవరపల్లి ఏవోగా రాజేష్, నూతన మండలం వేలేరు ఏవోగా లలిత, ఐనవోలు ఏవోగా సీహెచ్. సునీల్‌కుమార్, నడికూడ ఏవోగా పోరిక జైసింగ్, దామెర ఏవోగా రాకేష్‌లు బదిలీలపై వచ్చినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరంగల్, హనుమకొండ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా జి.సంగీత నల్లగొండ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. వరంగల్ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా పని చేసిన శ్రీనివాసరావు కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా హార్టికల్చర్ అధికారిగా చెరల రాకేష్ తొర్రూర్ నుంచి బదిలీపై వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22: ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈ నెల 30లోపు చెల్లించాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు మీసేవ, టీఎస్‌ఆన్‌లైన్ తదతర కేంద్రాల ద్వారా ఫీజు చ్లెలంచాలని తెలిపారు. ఆగస్టు 30 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా, సెప్టెంబర్ 4 వరకు రూ. 25 అపరాధ రుసుముతో, సెప్టెంబర్ 9 వరకు రూ. 50 అపరాధ రుసుముతో చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేటి నుంచి సెమీ డీలక్స్ ఆర్టీసీ సర్వీసులు

బాలసముద్రం, ఆగస్టు 22: వరంగల్ రీజియన్ పరిధిలో సెమీ డీలక్స్ ఆర్టీసీ బస్సు సర్వీసులను శుక్రవారం నుంచి నూతనంగా నడుపనున్నట్లు రీజినల్ మేనేజర్ డి.విజయభాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి భూపాలపల్లి, ఏటూరునాగారం, కాళేశ్వరం రూట్లలో సెమీ డీలక్స్ బస్సు సర్వీసులను నడుపనున్నట్లు తెలిపారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190, హనుమకొండ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ రూ.100, సెమీ డీలక్స్ రూ.110, డీలక్స్ రూ.110, హనుమకొండ నుంచి కాళేశ్వరం ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190 కాగా, బస్సు ప్రయాణం చేసిన ప్రతీ ఒక్కరు టికెట్ తీసుకోవలసి ఉంటుందన్నారు.

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

● జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయం ● తెలంగాణలో సీపీఐకి ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
● సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ● ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, ఆదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ఆరోపించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణసమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మోదీ విధానాలను తూర్పారబట్టారు. మోదీ అండదండలతో కార్పొరేట్ శక్తులు దేశాన్ని నిలువునా దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్.. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాసేలా ఉందన్నారు. సామాన్యుల ఆశలు, ఆకాంక్షలు ఆ బడ్జెట్‌లో ఏ మాత్రం ప్రతిఫలించలేదని అన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, తదితర కీలక రంగాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించే ఏ చర్యను బడ్జెట్‌లో ప్రతిపాదించలేదన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య అంతకంతకూ పెరిగిపోతోందని, పరిష్కారానికి మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రూపాయి విలువ దారుణంగా పతనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదానీ, అంబానీ అక్రమాలపై విచారణ జరపాలని డి.రాజా డిమాండ్ చేశారు. ఆదానీ గ్రూపులో సెబీ చైర్మన్ విదేశాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టారంటూ హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, దీనిపై విచారణకు జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ) వేయాలని రాజా డిమాండ్ చేశారు. హిండెన్ బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెబీ చైర్మన్‌తో రాజీనామా చేయించాలన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించింది గెలుపుకాదని, ప్రజల ఆ పార్టీని నైతికంగా ఓడించడం ద్వారా తగిన గుణపాఠం చెప్పారన్నారు. 400 స్థానాలతో అధికారంలోకి వస్తామని ఎన్నికల ప్రచార సభల్లో పదేపదే చెప్పిన మోదీ.. 250లోపు సీట్లకే పరిమిత మయ్యారన్నారు. నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడు ఊతకర్రల సాయంతో కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటైందని, ఈ ఇద్దరి మద్దతు ఎంతకాలం ఉంటుందనేది పెద్ద ప్రశ్న అని అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారిందని మోదీ చెబుతున్నా.. ప్రజలకు రేషన్ ఉచితంగా ఇచ్చే పరిస్థితి ఇంకా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఇప్పటికీ దేశంలోని నిరుపేదల్లో చాలా మందికి రేషన్‌కార్డులు లేవని, ఇది దేశ వ్యాప్త సమస్య అని, వారందరికీ కార్డులు ఇచ్చే



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో ఒక మెడికో విద్యార్థినిపై అత్యాచార సంఘటనపై దేశవ్యాప్తంగా అట్టుడుకుతున్నా..మోదీ మౌనం వీడడం లేదని రాజా పేర్కొన్నారు. దేశంలో మహిళలపై దాడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. వైద్యవృత్తిలో కొనసాగుతున్నవారికి రక్షణ కోసం ఒక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌ను మోదీ అంగీకరించడం లేదని రాజా ఆరోపించారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేస్తోందని, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తోందన్నారు. మనది భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, ఈ భావనకు తూట్లు పొడుస్తూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక విధానాలకు భిన్నంగా ఒకే దేశం.. ఒకే ఎన్నిక, ఒకే దేశం.. ఒకే మతం వంటి నినాదాలతో మోదీ ప్రభుత్వం విచ్ఛినకర పాలనను సాగించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బ్యూరోక్రసీలోకి ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను జొప్పించే ప్రయత్నం మోదీ చేస్తున్నారని, ఇదే జరిగితే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందన్న ఆవేదన ఆయన వ్యక్తం చేశారు.

రాజ్యాంగం స్థానంలో కొత్త మతతత్వ రాజ్యాంగాన్ని తేవడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయని రాజా అన్నారు. నిత్యం రామజపం చేసే బీజేపీకి రాముడు జన్మించిన ప్రదేశంలోనే ప్రజలు ఓటుతో ఓడించి బుద్ధి చెప్పారన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాల పట్ల జమ్మూ కశ్మీర్ ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, అక్కడ శాంతి భద్రతలను కాపాడేందుకే చర్యలు తీసుకున్నామని గొప్పగా చెబుతున్నప్పటికీ ఇప్పటికీ ఉగ్రవాదుల మారణకాండ కొనసాగుతూనే ఉందన్నారు. జమ్మూకశ్మీర్, హరియాణాలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖామన్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని రాజా జోస్యం చెప్పారు. కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంలో మోదీ దారుణంగా విఫలమయ్యారని విమర్శించారు. వినేష్ పొగట్ ఒలంపిక్‌లో గోల్డ్‌మెడల్ తెచ్చేవారని, బీజేపీ అనుసరించిన విధానాల వల్లే పతకం జేజారిందని చెప్పారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, మతతత్వ విధానాలను అడ్డుకునేందుకు ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఒక్కటికావాలని రాజా పిలుపు నిచ్చారు. ఇటీవలి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు, సీట్లను పెంచుకోవడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా నిలబడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తానని చెప్పి జాప్యం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై కొద్దినెలలే అయినందువల్ల వేచిచూస్తున్నామన్నారు.

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సృష్టించిన సంక్షోభం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం బయటపడలేకపోతోందన్నారు. రుణమాఫీ వంద శాతం అమలు కాలేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకోవద్దని కోరుకుంటున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగని పక్షంలో పోరాటం చేస్తామని కూనంనేని వెల్లడించారు. బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, బీజేపీని నిలువరించడంతో పాటు సీపీఐ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు తమ పార్టీ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడుతున్న సీపీఐని మరింత బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై కౌన్సిల్ నిర్మాణ సమావేశంలో లోతుగా చర్చించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కౌన్సిల్ నిర్మాణ సమావేశాలను పూర్తి చేసుకున్నామన్నారు. డిసెంబర్ 25నాటికి సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఒక క్రియాశీల, మిలిటెంట్ పార్టీగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తోందని చెప్పారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, సీపీఐ నాయకుడు అజీజ్‌పాషా, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డి.రాజా సమావేశాల ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రకార్యవర్గం సమావేశమైంది. వివిధ అంశాలపై చర్చించింది.



డి.రాజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వినయభాస్కర్

సీపీఐ నేతలను కలిసిన వినయభాస్కర్

బాలసముద్రం, ఆగస్టు 22: హనుమకొండ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ గురువారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, జాతీయ కార్యదర్శులు చాడా వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావులను హనుమకొండలోని హరిత హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలకు హాజరైన జాతీయ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్కడికి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ హాజరై జాతీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ హనుమకొండలో చాలాసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు జాతీ య నాయకులకు కూనంనేని సాంబశివరావు పరిచ యం చేశారు. అనంతరం వినయ్ భాస్కర్‌తో ఎమ్మెల్యే కూనంనేని సరదాగా మాట్లాడుతూ.. మీరు చేసుకున్న అపకారమే మీ ఓటమికి కారణాలని అనగా.. వినయ్‌భాస్కర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ బయటకు వెళ్లిపోయారు. కాగా సీపీఐ జాతీయ నాయకులను వినయ్ భాస్కర్ కలవడంపై పలువురు ఆసక్తిగా చర్చించుకున్నారు.



హనుమకొండలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నాయకులు

అట్టహాసంగా సీపీఐ సమావేశాలు ప్రారంభం

హాజరైన సీపీఐ జాతీయ నేతలు డి.రాజా, చాడ వెంకట్‌రెడ్డి, నారాయణ
విడతల వారీగా సమావేశాలు నిర్వహించిన నేతలు

బాలసముద్రం, ఆగస్టు 22: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలపై ప్రస్తుత రాజకీయాలు, పార్టీ బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు హరిత హోటల్‌కు చేరుకున్న జాతీయ నాయకులకు జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా సీపీఐ జెండాను రాష్ట్ర నాయకులతో కలిసి ఎగురవేశారు. అనంతరం హరితహోటల్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్వర్యంలో మొదటగా రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యు లు 11 మందితో, సమావేశం నిర్వహించారు. తరువాత 31 మంది ఎగ్జిక్యూటివ్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం 137 మంది స్టేట్ కౌన్సిల్ మెంబర్‌లతో జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొని పార్టీ నిర్ణయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

ప్రజాసమస్యలపై ఉద్యమిస్తేనే పార్టీ బలోపేతం

నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమించినప్పుడే కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్‌లో గురువారం సీపీఐ పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో తొలిరోజు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇటీవల వివిధ రాష్ట్రాలలో మరణించిన సీపీఐ నాయకులు, వామపక్ష ప్రజాస్వామ్యవాదుల చిత్రపటాలకు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పార్టీ నాయకులకు వివరించారు. ఈనేపథ్యంలో పెట్టుబడిదారీ శక్తులకు ధీటుగా కమ్యునిస్టులు పని చేయాలని అన్నారు. అట్టడుగు వర్గాలను చైతన్యవంతులను చేయాలని కమ్యునిస్టు నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్‌పాష, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, పల్ల వెంకట్‌రెడ్డి, తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, కలవేని శంకర్, వీఎస్ బోస్, బాల మల్లేశ్, బాల నరసింహాలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సీపీఐ నాయకులు

'వరంగల్ జిల్లా'కు గవర్నర్ రాక

ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన

వరంగల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈనెల 27, 28, 29 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. తన పర్యటనలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు ఓరుగల్లులోని అనేక చరిత్రాత్మక కట్టడాలు, లక్నవరం సరస్సును సందర్శించనున్నారు. అలాగే ఉత్తమ ఉద్యోగులతో పాటు కవులు, కళాకారులు, రచయితలతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. అలాగే పలువురిని సన్మానించనున్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

● 27వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు గవర్నర్ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 8గంటలకు భువనగిరి జిల్లాలోని యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి చేరుకుంటన్నారు. అక్కడ స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం 8.45లకు రోడ్డు మార్గాన బయలుదేరి ములుగు జిల్లా కలెక్టరేట్‌కు 11.30గంటలకు చేరుకుంటారు. 12గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 1గంటకు ఉన్నతాధికారులతో పరిచయం కార్యక్రమం ఉంటుంది. అప్పటి నుంచి 3గంటల వరకు రచయితలు, ఆర్టిస్టులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన వారితో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని గణపేశ్వరాలయంను సైతం గవర్నర్ సందర్శించనున్నారు. అక్కడి నుంచి గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్దకు సాయంత్రం 6.30గంటలకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.

● 28వ తేదీ బుధవారం ఉదయం లక్నవరం అందాలను ఆస్వాదిస్తారు. ఆపై ఉదయం 8గంటలకు లక్నవరం నుంచి బయలుదేరి 9.15గంటలకు హనుమకొండలోని నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 9.45వరకు గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 10గంటలకు హనుమకొండ సమీకృత కలెక్టరేట్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేరుకుంటారు. 11.05గంటల నుంచి 12.05గంటల వరకు ఉన్నతాధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. మధ్యాహ్నం 12.15గంటల నుంచి 2.30గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందినవారితో గవర్నర్ పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఖిలావరంగల్ కోట, వేయిస్తంభాల ఆలయం, భద్రాకాళి దేవాలయం, పద్మాక్షి గుడితోపాటు నగరంలోని ఇతర ముఖ్యమైన ప్రదేశాలను గవర్నర్ సందర్శిస్తారు. సాయంత్రం 6.40గంటలకు నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు.

● 29వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జనగామ జిల్లాకు బయలుదేరి వెళతారు. 10 గంటలకు జనగామ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ఉ.11.15గంటల వరకు అధికారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.35గంటలకు ఒబుళాకేశ్వాపూర్ గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందినవారితో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.10గంటలకు ఒబుళాకేశ్వాపూర్ నుంచి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రోడ్డు మార్గాన బయలుదేరి భువనగిరి జిల్లా కొలనుపాకు వెళ్లనున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజుల గవర్నర్ పర్యటన ముగుస్తుంది. కాగా, గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా కలెక్టర్లు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

నీటి పారుదల శాఖ అధికారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

బాలసముద్రం, ఆగస్టు 22: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏడాదిలోపు సాగునీటి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతీ ఎకరానికి సాగునీరు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కాల్వల పనులను పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. గురువారం చింతగట్టులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఈసందర్భంగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవాదుల ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. జనగామ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడకుండా గోదావరి జలాలను పంటలకు అందించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ధర్మసాగర్ సౌత్ కెనాల్, నవాబ్‌పేట మెయిన్ కెనాల్, అశ్వరావుపేట రిజర్వాయర్, నష్కల్ నుంచి పాలకుర్తితో పాటు గండి రామారం రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూటరీ కాల్వలలో పేరుకుపోయిన పూడిక, జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ఇతరత్రా పనులను గుర్తించి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి 15 రోజుల్లోగా సమగ్రమైన నివేదిక అందించాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో సీఈ అశోక్, వరంగల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జనగామ ఎస్ఈ సుధీర్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

● నకిలీ ప్రెస్, సీబీఐ, కార్డులతో మోసాలు ● రూ.1కోటి 34లక్షలు టోకరా ● వివరాలు వెల్లడించిన సుబేదారీ సీఐ సత్యనారాయణ

బాలసముద్రం, ఆగస్టు 22: వివిధ రాష్ట్రాలలో నకిలీ ప్రెస్‌కార్డులు, సీబీఐ కార్డులు చూపించి ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను గురువారం సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నిమిత్ కెపాసి (అలియాస్) అమిత్‌కుమార్ (47), సమన్ కాపాసి (అలియస్)కాసోజు జయ(42) ఇద్దరూ కలిసి వివిధ కంపెనీలలో పెట్టుబడి పేరుతో ఇతర రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడ్డారు. అమిత్ కుమార్ 2023లో హనుమకొండ జూలైవాడకు చెందిన సయ్యద్ రియాజ్, ప్రవీణ్ కుమార్‌లను పరిచయం చేసుకొని వారికి తన కంపెనీలో ఉద్యోగం ఇచ్చాడు. అదే విధంగా మరికొంత మంది యువకులను నియమించుకుని వారి అకౌంట్ నెంబర్లకు అమిత్‌కుమార్ సెల్ నంబర్ జత చేసి సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. తన కంపెనీ సిబ్బంది వసూలు చేసిన డబ్బులను వారి అకౌంట్‌లో వేసుకుంటే అమిత్‌కుమార్ అకౌంట్‌కు డబ్బులు వచ్చే విధంగా మార్చుకుని అమాయకులను మోసం చేశాడు.



సుబేదారి పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

వరంగల్, హైదరాబాద్, పూణే, విశాఖపట్నం నగరాలలో పలు కంపెనీలైన స్పీకింగ్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్, మాట్రీ మోని, ఓవర్‌సిస్ కన్సల్టెన్సీ, బ్యాంకు లోన్స్ తదితర కంపెనీలలో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారు. హిందీ, ఇంగ్లీష్, గుజరాతీ, బెంగాలీ భాషలలో అనర్గళంగా మాట్లాడుతూ ఆధార్‌కార్డు, ఫాన్ కార్డు అడ్రస్‌లు మార్చి నిందితులు మోసాలకు పాల్పడుతూ సుమారు రూ.1కోటి 34లక్షలు వసూలు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిని గురువారం సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇలాంటి మోసాలు చేసే వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో మక్కలకు మంచి ధర

గరిష్ఠంగా క్వింటాకు రూ.2,821

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 22: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మొక్కజొన్నలకు మంచి ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్ చరిత్రలోనే పలకని గరిష్ఠ ధర క్వింటాకు రూ.2,821 పలికింది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన చిలుముల మొగిలి 33 బస్తాల మొక్కజొన్నలను మార్కెట్‌కు అమ్మకానికి తీసుకువచ్చాడు. మాధవి ట్రేడర్స్ అడ్తి ద్వారా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు క్వింటాకు రూ.2,821 చొప్పున ఖరీదు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు చిలుముల మొగిలి మాట్లాడుతూ మార్కెట్‌లో మక్కలకు ఆశించిన ధర పలికినందుకు సంతోషంగా ఉందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించినందుకు గిట్టుబాటు ధర పలికితే యువకులందరు ఉద్యోగాల కోసం పరుగులు తీయాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి భూమిలో వారు వ్యవసాయం చేసుకుంటే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువే సంపాదించవచ్చని అన్నారు.

సబ్‌స్టేషన్‌లను ప్రొటెక్షన్ టీమ్‌లు తనిఖీ చేయాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 22: ప్రొటెక్షన్ టీమ్‌లు నిత్యం సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్ఈలు, యంఆర్‌టీ, టెక్నికల్ డీఈలతో గురువారం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి సీఎండీ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా డబుల్ ఎర్తింగ్ ఉండాలని సూచించారు. సర్వీసులను డిజిటలైజేషన్ చేయాలని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మ్యాపింగ్ వేగవంతం చేయాలన్నారు. లోడ్ ఎక్కువ ఉన్న చోట కెపాసిటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో సిబ్బంది నైపుణ్యత పెంచడానికి శిక్షణ తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఆ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ అశోక్‌కుమార్, మధుసూదన్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

నిబంధనలు విస్మరించి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు

ఆలస్యంగా వెలుగులోకి ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం

రాంనగర్, ఆగస్టు 22: ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను అడ్డుకోవడం సాధ్యం కాదనే ఆరోపణలున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల విషయంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు గత ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. నాన్ లేఅవుట్ ప్లాట్లు, పార్ట్, అనుమతులు లేని ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు చేయకూడదనే నిబంధనలు పొందుపరిచింది. ఈ నిబంధనలను బుట్టదాఖలు చేసిన పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్‌లు చేసిన విషయం తెలిసిందే. నిబంధనలు విస్మరించి రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు డబ్బులు దండుకుంటూ మహబూబాబాద్, పరకాల సబ్ రిజిస్ట్రార్‌లు ఏసీబీకి అడ్డంగా దొరికిన సంఘటనలు సైతం ఉన్నాయి.

కాగా, ఈ సంఘటనలు జరుగుతుండగానే ఖిలా వరంగల్, వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలు విస్మరించి పలు రిజిస్ట్రేషన్‌లు చేసి అందినంత దండుకున్న ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల జరిగిన బదిలీల్లో పొరుగు జిల్లాలకు బదిలీ అయిన ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు పదుల సంఖ్యలో నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఖిలావరంగల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని బొల్లికుంటలో వెలిసిన ఒక నాన్ లేఅవుట్ వెంచర్‌కు సంబంధించిన 40కి పైగా రిజిస్ట్రేషన్‌లు కిందటేడు నెలాఖరున జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లు ఒకే రోజున జరిగినవి కాగా, మిగతా రోజుల్లో చాలానే జరిగినట్లు సమాచారం. సదరు సబ్ రిజిస్ట్రార్ గజానికి రూ.200 చొప్పున డబ్బులు దండుకుని నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఇక వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ గొర్రెకుంటకు చెందిన నాన్ లేఅవుట్ 30కి పైగా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు సమాచారం. మూడు మాసాల్లో ఈ రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లకు సైతం సదరు సబ్ రిజిస్ట్రార్ గజాల లెక్కన వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఇద్దరు వసూలు చేసిన మొత్తం లక్షల్లో ఉంటుందనే ప్రచారం సాగుతోంది. వీరిద్దరు ప్రస్తుతం పొరుగు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులపై గతంలో సైతం పలు ఆరోపణలున్నాయి. మొత్తంగా జిల్లాను వీడిన వీరి బాగోతంపై ఉన్నతాధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



రుణమాఫీ కాని రైతులు అధికారులకు ఫిర్యాదు చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్

బాలసముద్రం, ఆగస్టు 22: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణమాఫీ కాని రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందజేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్ గురువారం రైతులను ఒక ప్రకటనలో కోరారు. హనుమకొండ జిల్లాలో 49,598 మంది లబ్ధిదారులకుగాను రూ. 408.18 కోట్లు రుణమాఫీ చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో రైతుల సందేహాల నివృత్తి కోసం ఫిర్యాదులు స్వీకరించడానికి హెల్ప్‌డెస్క్‌లు ఈ నెల 18 నుంచి ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వ్యవసాయ విస్తీర్ణ అధికారుల బదిలీల అనంతరం మండల వ్యవసాయ అధికారులను నోడల్ ఆఫీసర్స్‌గా నియమించనున్నట్లు ఆయన తెలిపారు. రైతు వేదికలలో రైతులు సరైన ధృవీకరణ పత్రాలు తీసుకొచ్చి రుణమాఫీ కోసం ఫిర్యాదులు అందజేయాలన్నారు.

హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

కాళోజీ జంక్షన్, ఆగస్టు 22: కోల్‌కత్తాలోని ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను ఖండిస్తూ, దోషులను కఠినంగా శిక్షించాలని గురువారం కాళోజీ సెంటరులో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి కాళోజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా ముఖ్యమంత్రి ఉన్న రాష్ట్రంలోనే పీజీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరగడం శోచనీయమన్నారు. విద్యాసంస్థల్లోనే కాకుండా పౌర సమాజంలో కూడా పిల్లలకు తల్లిదండ్రులు నైతిక విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బి.రమాదేవి, రామబ్రహ్మం, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, బూర భిక్షపతి, చంద్రమౌళి, కిషన్, కవిరాజ్, ఇందిర, రావుల రమేశ్, శ్రీనివాస్, గోవిందరావు, శ్రీనివాస్ రెడ్డి, ఉప్పలయ్య, వనిజా పాటిల్ పాల్గొన్నారు.

• వడ్డెపల్లి: కోల్‌కతాలో పీజీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఉమ్మడి జిల్లా చైర్మన్ బుర్ర రమేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా విభాగం చైర్మన్ గుగులోతు కమలమ్మ డిమాండ్ చేశారు. గురువారం వడ్డెపల్లిలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో పీజీ డాక్టర్ ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి దైవాన్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టపరంగా నేరస్థులకు శిక్ష పడినప్పుడే ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఉంటాయన్నారు.

• వరంగల్ ఎడ్యుకేషన్: కోల్‌కత్తాలో మెడికోపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డీఆర్. సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని కౌన్సిల్ కార్యాలయంలో మెడికోపై జరిగిన హత్యాచారానికి నిరసనగా కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ... మహిళలకు ప్రత్యేకమైన రక్షణ చట్టాలు చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పటిష్టమైన చట్టాలను రూపొందించి నిందితులు తప్పించుకోకుండా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా వింగ్ చైర్మన్ గుగులోత్ కుమలమ్మ, సభ్యులు పాల్గొన్నారు.



కాళోజీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యాలయంలో కొవ్వొత్తులను వెలిగిస్తున్న దృశ్యం



నిరసన ప్రదర్శన చేస్తున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి జిల్లా సభ్యులు

మొక్కలు నాటడం బాధ్యతగా స్వీకరించాలి



మొక్కను నాటుతున్న సీఈఓ విద్యాలత

హసన్‌పర్తి, ఆగస్టు 22: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడం బాధ్యతగా స్వీకరించాలని హనుమకొండ జెడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లాంట్ ఫర్ మదర్, నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా గురువారం పెంబర్తిలో మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే మొక్కలు తప్పని సరిగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు లేని ప్రపంచాన్ని ఊహించలేమని భవిష్యత్తు తరాల పరిస్థితిని అంచనా వేయలేమన్నారు. ఇప్పటికైనా రాబోయే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడం ఇప్పటి నుంచే ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో కరుణాకర్‌రెడ్డి, ఏపీవో విజయలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి హేమలత, టెక్నికల్ అసిస్టెంట్ శివప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ వల్లాల నరేష్, కారోబార్ చాతళ్ల సదానందం, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నైపుణ్యాల మెరుగుదలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అశోక్‌రెడ్డి

హసన్‌పర్తి, ఆగస్టు 22: నైపుణ్యాల మెరుగుదలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్టూడెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుదేశించి మాట్లాడారు. ఎంతో చక్కటి భవిష్యత్తు ఉన్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని కోరారు. కళాశాలలో క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను కొనసాగించినప్పుడే లక్ష్య సాధన సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ కె.వేణుమాధవ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్‌రెడ్డి విభాగాధిపతులు, డీన్స్ ఎల్.సుధీర్, వి.రాజగోపాల్, సి.వెంకటేష్, ఇంటర్న్‌షిప్ ఎంఓయూల సెల్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జి.రఘోత్తంరెడ్డి, డీన్ ఎస్ఎ ప్రొఫెసర్ ఎం.శ్రీలత, అసోసియేట్ డీన్ నర్సింరాములు, పీఆర్ఓ డాక్టర్ డి.ప్రభాకరాచారితో పాటు సుమారు 2వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



పూలతో అలంకరించిన రాఘవేంద్రస్వామి విగ్రహం

వడ్డెపల్లి, ఆగస్టు 22 : హనుమకొండ వడ్డెపల్లి పరిమళ కాలనీలో గల శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు నేత్ర పర్వంగా జరిగాయి. వడ్డెపల్లి, ఆర్టీసీ కాలనీ, పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీ, జవహర్ కాలనీతో పాటు సుమారు 20 కాలనీల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాఘవేంద్రస్వామిని మఠం మేనేజర్ మాధవరావు, విచారణకర్త ప్రభాకర్‌రావు, ముస్కుల కిరణ్‌కుమార్, అంబదాస్ రావు, వికాస్ మురళి, సంజీవరావు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కొలిచి అర్చనలు, అభిషేకాలు చేశారు.

ఫొటోగ్రాఫర్‌కు సన్మానం

కాజీపేట, ఆగస్టు 22: ప్రపంచ ఫొటోగ్రఫీ పోటీలలో మెదటి బహుమతి పొందిన కాజీపేటకు చెందిన పిల్లి అనిల్‌కుమార్‌ను గురువారం గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేశ్ ఖన్నా అభినందించారు. బొకే ఇచ్చి శాలువా శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహిత అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఏపీ నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన పోటీలలో కొమురవెల్లి జాతర ఫొటోతో బహుమతి పొందడం సంతోషంగా ఉందన్నారు.

గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి

అధికారుల సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు22: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మఈ నెల 28న జిల్లా పర్యటనకు రానున్నారని, గవర్నర్ పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లా అధికారులకు కేటాయించిన విధులను జాగ్రత్తగా నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్ఓ వై.వి గణేష్, ఏసీపీ సలీమా, ఆర్‌డీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాళోజీ కళా క్షేత్ర నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

బాలసముద్రం: బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. గురువారం కాళోజీ కళా క్షేత్ర నిర్మాణ పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకడేతో కలిసి కలెక్టర్ పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ కళా క్షేత్రం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

బీజేపీ నాయకుడి మృతికి మాజీ ఎమ్మెల్యేల సంతాపం



సునీల్ భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ధర్మారావు, అరూరి రమేష్

మడికొండ, ఆగస్టు 22: మడికొండ నెహ్రూనగర్‌కు చెందిన బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి ధరావత్ సునీల్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. గురువారం మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, మార్తినేని ధర్మారావు సునీల్ భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి వెంట బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, జిల్లా నాయకులు పోనగోటి వెంకట్రావు, దువ్వ నవీన్, ముత్తోజు సురేష్, ఆకుల శ్రీకాంత్, బొల్లికొండ వినోద్‌కుమార్, బుర్ర రాజన్‌బాబు, బైరపాక వెంకటేష్, ఎలగొండ శివ, గడ్డం కిరణ్, దెప్పెల్లి అరవింద్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు తిరుపతి రెడ్డి హఠాన్మరణం



జర్నలిస్టు తిరుపతిరెడ్డి భార్యను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వడ్డెపల్లి, ఆగస్టు 22: జర్నలిస్టు సిరిపురం తిరుపతిరెడ్డి హనుమకొండ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఆయన భౌతిక కాయాన్ని హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థిక సాయం అందజేసి, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయిస్తానని ప్రకటించారు. వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జర్నలిస్టులు సిరిపురం తిరుపతి రెడ్డి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమ సంస్కారాల కోసం రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. సీనియర్ జర్నలిస్టులు, వివిధ యూనియన్ల నేతలు తిరుపతిరెడ్డి భౌతిక కాయానికి పూల మాలలు వేసి, ప్రెస్‌క్లబ్ ఆవరణలో నివాళులర్పించారు. అనంతరం దుగ్గొండి మండలం నాచినపల్లికి భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

బీఎస్ఎన్ఎల్ ప్యానల్ న్యాయవాదిగా నర్సింహరాములు



హసన్‌పర్తి, ఆగస్టు 22: మండల కేంద్రానికి చెందిన పోరండ్ల నర్సింహరాములు వరంగల్ జిల్లా కోర్టులో బీఎస్ఎన్ఎల్ సంస్థకు ప్యానల్ అడ్వకేట్‌గా నియామకమయ్యారు. ఈయనను బీఎస్ఎన్ఎల్ ప్యానల్ న్యాయవాదిగా నియమిస్తూ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ లీగల్ డిపార్టుమెంట్ హైదరాబాద్ వారు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింహరాములు విశాఖపట్నం ఎన్‌బీఎం లా కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేసి 1994లో లా పట్టాను పొందారు. అప్పటి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్టులలో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. సంస్థకు సంబంధించిన కేసులను జిల్లా కోర్టులో బీఎస్ఎన్ఎల్ తరుపున న్యాయవాదిగా వాదిస్తారు. తన నియామకానికి సహకరించిన సంస్థ జనరల్ మేనేజర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


దొంగలతో అప్రమత్తంగా ఉండాలి..

వరంగల్ క్రైం, ఆగస్టు 22: అంతరాష్ట్ర దొంగల ముఠా నగరంలో సంచరిస్తోందని, కాలనీల వాసులు జాగ్రత్త వహించాలని కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ సీఐ సంజీవ్ ఒక ప్రకటనలో సూచించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు, ఊర్లకు వెళ్లినప్పుడు నమ్మకస్తులైన పక్కన వారికి లేదా పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. కాలనీల్లో కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగితే సమాచారం ఇవ్వాలని సంజీవ్ తెలిపారు.

• ధర్మసాగర్: గ్రామాల్లో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తున్నందున ధర్మసాగర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రవీణ్ కుమార్ ప్రకటనలో గురువారం తెలిపారు. తాళం చేసిన ఇండ్లనే దొంగలు టార్కెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతున్నారన్నారు. గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్టు కనిపిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100ద్వారా సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

• వేలేరు : మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సురేష్ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉత్తర భారత్ నుంచి అంతర్ రాష్ట్ర ముఠా సంచరిస్తున్నారని ఇంటి, యజమానులు ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పక్క ఇంటి వారికి, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్100 ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

మడికొండలో కమ్యూనిటీ పోలీసింగ్



ప్రజలకు నేర నియంత్రణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్

మడికొండ, ఆగస్టు 22: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అదేశాల మేరకు మడికొండలోని కపిల్ హోమ్స్ ఆవరణలో గురువారం మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ కిషన్ మాట్లాడుతూ.. దొంగతనాలు, సైబర్ నేరాలు, 100 డయల్ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఇటీవల అంతరాష్ట్ర దొంగలు జిల్లాలో సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారని వస్తున్న సమాచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు తెలిస్తే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, ఎఎస్సై చంద్రమౌళి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వరదారెడ్డి

హసన్‌పర్తి, ఆగస్టు 22: మెరుగైన విద్యాతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని అది కేవలం ఎస్సార్ విద్యా సంస్థల్లోనే సాధ్యమని ఎస్సార్ విద్యా సంస్థల చైర్మెన్ ఎ.వరదారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్టూడెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం చేయడం వల్ల వారి లక్ష్యసాధన సులభతరమవుతుందన్నారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా క్యాంపస్ లీడ్ వర్చూసా హెడ్ డి.అభిషేక్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఎన్.శ్రీవాణి, విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ కె.మహేందర్, ఏవో వేణుగోపాలస్వామితో పాటు విద్యార్థుల తల్లిదండులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన జిల్లా అధికారి



ముప్పారం కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా గ్రామమీణాభివృద్ధి అధికారి నాగపద్మజ

ధర్మసాగర్, ఆగస్టు 22: ధర్మసాగర్ శివారు ముప్పారంలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగపద్మజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలోని స్టాకుకు సంబంధించిన రికార్డులు, వంటగది, సామగ్రి నిల్వ చేసిన గదులను, కూరగాయల నాణ్యతను ఆమె పరిశీలించారు. వర్షాకాలం అయినందున గదులు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమ్మ పేరుమీద మొక్క అనే కార్యక్రమంలో భాగంగా కళాశాల అవరణలో ఆమె మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంపీవో సంపత్, జేఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమేష్, టీఏ కరుణాకర్ పాల్గొన్నారు.

కేంద్ర సంఘం నేతలను కలిసిన టీఎన్జీవోలు



కేంద్ర సంఘం నేతలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా టీఎన్జీవోలు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 22: టీఎన్జీవో కేంద్ర సంఘం నేతలను హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు గురువా రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లకు నేతలు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న కేంద్ర సంఘం నాయకత్వానికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. బదిలీలలో ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేసిన కేంద్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోయిజ్, లక్ష్మీ ప్రసాద్, రాజేష్ ఖన్నా, గౌతం, లక్ష్మణ్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

సెయింట్ గ్యాబ్రియెల్ స్కూల్‌లో ఆర్ట్ గ్యాలరీ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

కాజీపేట, ఆగస్టు 22: కాజీపేట సెయింట్ గ్యాబ్రియెల్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఆర్ట్‌గ్యాలరీ నిర్వహించారు. ఈ గ్యాలరీలో విద్యార్థులు చిత్రాలు గీసి ప్రదర్శించారు. ఈ గ్యాలరీని ముఖ్యఅతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక చిత్రంలో వేల అర్థాలు దాగి ఉంటాయన్నారు. ఈ గ్యాలరీలో ఒక్కో చిత్రం ఒక్కో ఆణిముత్యంలా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ రిటైర్డ్ అధికారి ఆర్‌నాగనాథ్, ప్రముఖ చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు, బ్రదర్‌లు జైకో గర్వాసిస్, స్లీవారెడ్డి, గ్యాబ్రీయేల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆంథోని పొలిశెట్టి, తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



ధర్మసాగర్ మండల కేంద్రంలో రుణమాఫీ నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎ.రాకేష్‌రెడ్డి

ధర్మసాగర్, ఆగస్టు 22: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఎ.రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రుణాలు తీసుకున్న రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల రుణమాఫీపై రాష్ట్ర మంత్రుల్లో స్పష్టత లేదన్నారు. రైతు పండించిన పంటకు ప్రతీ క్వింటాల్‌కు బోనస్ రూ.500 చెల్లిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం సన్నవడ్లకి మాత్రమే చెల్లిస్తామని చెప్పడం బాధాకరమన్నారు. రైతులకు రుణమాఫీ చేసే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రభుదాస్, మండల పార్టీ అధ్యక్షుడు రాజు, జూబేదలాల్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

• వేలేరు : ప్రభుత్వం ఎలాంటి అంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ వేలేరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. బ్యాంక్ ఎదుట బైఠాయించి రైతులకు పెద్ద ఎత్తున నినాదాలు చేసి ధర్నా కొనసాగించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని లేని పక్షంలో నిరసన కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగరావు,మాజీ జడ్పీటీసీ సరిత, సంపత్, భూపతి రాజు, సురేష్, ప్రభాకర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహజయోగ

శ్రీకృష్ణ పరమాత్మ గురించి తెలుసుకోవాలంటే ఆయన తత్త్వాన్ని తెలుసుకోవాలి. శ్రీమన్నారాయణుడు కొత్త అవతారాన్ని ధరించినప్పుడు... అంతకు ముందు అవతారంలో తాను ప్రబోధించిన విషయాలను అవగాహనా లోపంతో సరిగ్గా అర్థం చేసుకోకుండా, మితిమీరిన, విపరీతమైన వైఖరులను అనుసరిస్తున్న ప్రజలను సంస్కరించడానికి ఆ కొత్త అవతారంలో ప్రయత్నిస్తాడు. ఈ కారణం వల్లనే భగవంతుడు మళ్ళీ మళ్ళీ అవతరిస్తూ ఉంటాడు. రామావతారంలో అత్యంత ఆదర్శవంతంగా ఆయన జీవించాడు. 'శ్రీరాముడిలా మనం కూడా బంధరహితులుగా ఉందాం' అనుకున్న ప్రజలు వివిధ అపోహలతో కఠినమైన జీవితాన్ని గడిపారు. వారిని మునులు, యోగులు ఎంతో క్రమశిక్షణలో పెట్టేవారు. క్రమశిక్షణను ఉల్లంఘించేవారికి కఠిన ప్రాయశ్చిత్తాలు ఉండేవి. దీనితో ప్రజలు గంభీరమైన జీవితానికి అలవాటు పడిపోయారు. ఆ తరువాత... ఈ చరాచర సృష్టి అంతా ఒక లీల అని, ఆనందమయమని నిరూపించడానికి శ్రీకృష్ణావతారం వచ్చింది. ప్రజలు ఎల్లప్పుడూ సంతోషంగా, ఉల్లాసంగా, ఆడుతూ పాడుతూ, ఎలాంటి అరమరికలు, కఠిన నియమ నిబంధనలు లేకుండా ఎలా ఉండాలో ఆయన తన జీవితం ద్వారా ప్రత్యక్షంగా చూపించాడు.

శరణాగతితో ఆత్మసాక్షాత్కారం

26న శ్రీకృష్ణాష్టమి

శ్రీకృష్ణుడు యోగీశ్వరుడు. శ్రీకృష్ణునికి మనం సంపూర్ణంగా శరణాగతులైతే... మనలోని యోగ స్థితిని స్థిరపరచుకోవచ్చు. భగవంతుడి శక్తితో మన అంతర్గత శక్తి కలయికే యోగం. అది ఆత్మసాక్షాత్కారం ద్వారా సాధ్యమవుతుంది. శ్రీకృష్ణుడు విరాట్ పురుషుడు. కదనరంగంలోకి స్వయంగా దూకకుండానే... సమస్త దుష్ట శక్తులతో పోరాటం సాగించాడు. ఆయన జీవితం ఎంతో మనోహరంగా, సృజనాత్మకంగా, ప్రేమతత్త్వంతో నిండి ఉంటుంది. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు దుఃఖితుడై ఉన్నప్పుడు గీతా బోధతో కర్తవ్యం బోధించాడు. స్థితప్రజ్ఞత గురించి, ఆధ్యాత్మికత గురించి, సంపూర్ణ బంధరాహిత్యం గురించి చాలా వివరంగా చెప్పాడు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా... మన అంతరంగంలోనూ, బాహ్యంగానూ ఉన్న దుష్ట శక్తులతో పోరు సాగించాలని ఉపదేశించాడు.




మనకు ఉన్న ఆధ్యాత్మిక మార్గాల్లో భక్తి ఒకటి. అది మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలో ఎడమ పార్శ్వానికి సంబంధించినది. భక్తి అంటే భగవంతుణ్ణి కీర్తించడం, అర్పణ భావంతో ఉండడం, మంచి కర్మలు నిర్వర్తించడం. ఆ విధంగా భగవంతుడికి మనం దగ్గరవుతాం. ఇది ఋషులు, మతాలు ఆమోదించిన పద్ధతి. అయితే దీన్ని మనం ఎలా ఆచరిస్తున్నాం? దైవంతో అనుసంధానం కాకపోతే... దైవం పట్ల సంపూర్ణ సమర్పణ భావాన్ని ఎలా కలిగి ఉండగలం? అనన్య భక్తి మన అంతరంగంలో ఉంటే దైవంతో ఐక్యత సాధించగలం. మరొకటి కర్మ సిద్ధాంతం. అంటే మనం మన కార్యాలను బంధరాహిత్యంతో నిర్వహించడం. ఇది అంత సులభం కాదు. మనల్ని మనం నిర్మలంగా మార్చుకోవడం కోసం... ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందిన మహర్షులను దర్శిస్తున్నాం, ప్రార్థనలు చేస్తున్నాం, పుణ్యక్షేత్రాలను దర్శిస్తున్నం. అన్ని రకాల కర్మ కాండలను ఆచరిస్తున్నాం. ఇది కర్మయోగం. సహజయోగ ప్రకారం... ఇది మన శరీరంలోని కుడి పార్శ్వానికి సంబంధించినది. కానీ మనం ఏ కర్మలు చేసినా వాటి ఫలాలు ఎలా ఉంటాయో చెప్పలేమనీ, కాబట్టి భగవంతుడి ఆశీస్సులు లభించడానికి ఫలానా కర్మలే చెయ్యాలని చెప్పడానికి వీలు లేదనీ అన్నాడు శ్రీకృష్ణుడు. "కర్మలు చెయ్యడం నీ పని. వాటి ఫలితాలను ఆశించకూడదు" అని చెప్పాడు. ఆత్మసాక్షాత్కారం పొందినవారిని, ధర్మమార్గం అనుసరించేవారిని, ధర్మబద్ధమైన కర్మలను ఆచరించేవారిని శ్రీకృష్ణుడు ఎల్లప్పుడూ ఆశీర్వదిస్తాడు.

మూడోది విచక్షణ. దీన్నే మనం జ్ఞానమార్గం అంటాం. ఇది మధ్యేమార్గం. దీనిద్వారా మనం పరిణామం పొందుతాం. లౌకిక విషయాలకు అతీతమైన శక్తిని పొందినప్పుడు... సంపూర్ణ, నిర్మల, సూక్ష్మ జ్ఞానాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ జ్ఞానమార్గంలోకి వెళ్ళలేరని, దానికి ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం, స్థితి ఉండాలని చాలామంది చెబుతారు. కానీ అది సరి కాదు. అందరూ జ్ఞానమార్గాన్ని అనునసరించవచ్చు. దానికి దోహదపడే సూక్ష్మ శరీర వ్యవస్థ అంతర్గతంగా మనలోనే నిర్మాణమై ఉంది. మనకు పుత్రధర్మం, పితృధర్మం, పతిధర్మం, పత్నీధర్మం, దేశధర్మం... ఇలా అనేక ధర్మాలు ఉన్నాయి. 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మమేకం శరణం వ్రజ... అన్ని ధర్మాలను వదిలిపెట్టు. నన్ను శరణాగతి వేడు" అన్నాడు శ్రీకృష్ణుడు. ధర్మాలన్నిటినీ ఆయనకు సమర్పిస్తే... అవి ఒక సమ స్థితికి వస్తాయి. ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత... ఉత్తమ ధర్మాలను మనలో ఆయన స్థిరపరుస్తాడు. మనలో శ్రీకృష్ణుడి గుణగణాలు జాగృతి చెందడం చాలా ముఖ్యం. ఆయన పద్ధతి తేనెలా ఎంతో మధురంగా ఉంటుంది. అందుకే ఆయన ఆశీస్సులు పొందాలనుకొనే ప్రజలు 'మాధవ' అని సంబోధించారు. అయితే దుర్మార్గులకు ఆయన అతి భయంకరుడు. శ్రీకృష్ణుడు సామూహికతకు ప్రాధాన్యత ఇస్తాడు. సామూహికంగా మనకున్న సంబంధాలను ఉపయోగించుకుంటూ... సత్యం, ప్రేమ, కరుణ, ఆత్మసాక్షాత్కారాలను సాకారం చేసుకోవాలి. కుండలినీ ఉత్థానం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొంది, సహజయోగ సాధనతో స్థితప్రజ్ఞ స్థితిని సాధించవచ్చునని శ్రీమాతాజీ నిర్మలాదేవి నిరూపించారు. మన అంతర్గత సూక్ష్మ శరీర నాడీ వ్యవస్థలో ఏడు చక్రాలు ఉంటాయి. వాటిలో విశుద్ధ చక్రంలో... అధిష్ఠాన దేవతగా శ్రీకృష్ణుడు ఆసీనుడై ఉంటాడు. ఆయన చెప్పిన ధర్మ సూత్రాలను, అనుసరించిన ధర్మ మార్గాలను మనం అనుసరిస్తే ఆయన అనుగ్రహానికి పాత్రులం అవుతాం.

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ





మనకు కావలసింది గాఢభక్తి

తనికెళ్ళ భరణి... నాటక, సినీ రచయిత, నటుడు, దర్శకుడే కాదు... 'ఆటగదరా నీకు' అంటూ పరమశివుణ్ణి నిందాస్తుతి చేసిన తాత్త్విక కవి. "నిన్ను నువ్వు ప్రేమించుకున్నట్టే ఎదుటివారినీ ప్రేమించు. ఇదే సర్వ ధర్మాల సారం. అదే ఆధ్యాత్మికత" అంటున్న ఆయన 'నివేదన'తో ప్రత్యేకంగా సంభాషించారు.

"నేను 'ఆటగదరా శివా' అంటూ పద్యాలు రాశాను. వాటిని మళ్ళీ మళ్ళీ చదువుతున్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది... 'ఇది రాసింది నేనేనా?' అని. 'ఏదో ఒక శక్తి నాలో ప్రేరణ కలిగించి నాతో అవి రాయించింది. నేను నిమిత్తమాత్రుణ్ణి' అని గట్టిగా నమ్ముతాను. నాకు పరిజ్ఞానం ఉండవచ్చు. కానీ నాలో సంకల్పం కలగడం, శ్రద్ధగా రాయగలగడం, దానికి నా పరిజ్ఞానం అక్కరకు రావడం, రాసినవి అద్భుతంగా కుదరడం, అవి జనరంజకం కావడం... వీటి వెనుక మానవ ప్రయత్నం ఉన్నా... ఏదో అతీతమైన శక్తి దానికి బలం చేకూర్చి, నాతో ఆ పని చేయించిందని భావిస్తున్నాను."

"నా జీవితంలో అనుకోకుండా అద్భుతాలు కొన్ని జరిగాయి. అవే నన్ను భగవంతుడికి అతుక్కుపోయేలా చేశాయి. నేను గొప్ప ప్రతిభావంతుణ్ణి కాదు. ప్రజ్ఞావంతుణ్ణి కాదు. నేను పెద్ద పెద్ద చదువులు చదవలేదు. చాలా సామాన్యుణ్ణి. నేను ఇంత జనాదరణ పొందడానికి, ఇంతటి కీర్తి ప్రతిష్ఠలు రావడానికి, సమాజం నుంచి ప్రేమాభిమానాలు పొందడానికి కారణం కేవలం 'నా ప్రతిభ' అని అనుకుంటే అది అవివేకం. దేవుడి మీద నిర్వివాదమైన భక్తి ఉన్నప్పుడు... 'పవి పుష్పంబగు, నగ్ని మంచగు... శివ నీ నామము సర్వవశ్యకరమౌ' అని 'శ్రీకాళహస్తీశ్వర శతకం'లో ధూర్జటి చెప్పినట్టు... మనకు ఇబ్బందులు ఎదురైనా కొద్ది కాలంలోనే అవి చెల్లాచెదురైపోతాయి. నాకు ఎదురైన అలాంటి సంఘటన ఒకటి చెబుతాను.

ఏదీ దొరకని చోట...

నా కుటుంబంతో, సన్నిహితులతో కలిసి ఒకసారి తమిళనాడులో యాత్ర చేస్తున్నాను. అప్పట్లో నేను శివ దీక్షలో ఉన్నాను. కుంభకోణం దగ్గరకు వచ్చిన తరువాత... "ఈ రోజు మనం టిఫిన్లు చెయ్యొద్దు. చిదంబరం వెళ్ళేసరికి సరిగ్గా ఒంటిగంట అవుతుంది. అక్కడ మంచి ప్రసాదం తిందాం" అని చెప్పాను. తీరా చిదంబరం వచ్చేసరికి... కావేరీ నీటి వివాదం కారణంగా అక్కడ సమ్మె జరుగుతోంది. గుడితో పాటు దుకాణాలన్నీ మూతపడి ఉన్నాయి. మేము పొద్దున్న టిఫిన్ కూడా చెయ్యకుండా వచ్చాం. ఏం చెయ్యాలో తెలియడం లేదు. ఒక పక్క ఆగాం. నన్ను అక్కడ ఉంచి... తినడానికి ఏదైనా దొరుకుతుందేమో వెతకడానికి మా వాళ్ళు వెళ్ళారు. నాకు ఎదురుగా షట్టర్ వేసేసిన ఒక హోటల్ ఉంది. ఆ హోటల్ వాచ్‌మేన్ నన్ను చూశాడు. "తినడానికి ఏదైనా ఉంటుందా?" అని సైగ చేశాను. అతను లేదని సైగ చేశాడు. 'నా ఖర్మ' అన్నట్టు నుదుటి మీద బొటన వేలితో అడ్డంగా రాశాను. అతను ఏమనుకున్నాడో ఏమో? లోపలికి వెళ్ళి, మళ్ళీ బయటకు వచ్చి ఎంతమంది ఉన్నారని సైగ చేశాడు. మేం ఆరుగురం ఉన్నామని వేళ్ళు చూపించాను. 'అమ్మ బాబోయ్' అన్నట్టు గుండె మీద చెయ్యి వేసుకొని, లోపలకు వెళ్ళిపోయాడు. ఈలోగా మా వాళ్ళు వచ్చారు. "ఏవీ లేవు. ఇవాళ మనం ఉపవాసమే" అన్నారు. 'ఉపవాసం ఉందాం' అనుకొని ఉండడం వేరు, తిండి దొరక్క బలవంతంగా ఉపవాసం ఉండడం వేరు. ఒక్కొక్కరినీ ఆకలి దహించేస్తోంది. ఇంతలో ఆ వాచ్‌మేన్ బయటికొచ్చాడు. 'ఒక్కొక్కరూ లోపలికి రండి' అంటూ సైగ చేశాడు. అందరం వెళ్ళాం. అప్పుడు హోటల్లో ఉన్న వాళ్ళు "ఈ రోజు హోటళ్ళు బంద్. కాకపోతే మేం తినాలి కాబట్టి మాకోసం సాంబారు, కూర, పచ్చడి లాంటివి చేసుకుంటున్నాం. మీకు అభ్యంతరం లేకపోతే అవే మీకు పెడతాం" అన్నారు. "చద్దన్నం పెట్టినా చాలు" అని కూర్చున్నాం. ఇంతలో... మేడ మీద నుంచి ఒక వ్యక్తి కిందకు వచ్చి, నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. "మీరేంటండీ... ఇక్కడున్నారు?" అన్నాడు. అతను చీఫ్ చెఫ్. అతనిది శ్రీకాకుళం. విషయం చెప్పాం. "భలేవారే! మీకేం కావాలో చెప్పండి. అరగంట టైమివ్వండి" అన్నాడు. తరువాత అతను ఎంతో ప్రేమతో వంకాయ కూర, సాంబారు, పప్పు, పచ్చడి, పెరుగు, స్వీటు... ఇలా షడ్రుచులతో భోజనం పెట్టి పంపించాడు. అప్పుడు నా భార్య "మీకు అడవిలోకి వెళ్ళినా అన్నం దొరుకుతుంది" అంది. "మా శివయ్య భార్య అన్నపూర్ణ కదా. అమ్మ ఆకలితో ఉండనిస్తుందా?" అన్నాను ఇది చాలా యాదృచ్ఛికంగా జరిగిందే. కానీ ఆ క్షణానికి మాత్రం అది అద్భుతం.

ఏ మతమైనా చెబుతున్నది అదే...

'దైవం మానుష రూపేణ' అనేది నేను బలంగా నమ్ముతాను. అలాగే ప్రకృతే దైవం. చిన్నప్పుడు 'పుట్టకు దండం పెట్టు, గుట్టకు దండం పెట్టు, పిట్టకు దండం పెట్టు' అని పెద్దవాళ్ళు చెప్పినప్పుడు... మేము పెట్టేస్తూ ఉండేవాళ్ళం. కాస్త జ్ఞానం వచ్చాక... వేరేవాళ్ళు వేళాకోళం చేస్తూ ఉండేవాళ్ళు వానరాలకు, వరాహాలకు, చెట్లకు, పుట్టలకు, రాళ్ళకు నమస్కారం చెయ్యడమేమిటని. నాక్కూడా ఒక్కోసారి 'వాళ్ళ మాటలు నిజమేనేమో? నేను చేసేది అసంబద్ధమేనేమో?' అనిపించింది. కానీ మన చుట్టూ ఉన్న ప్రకృతిని, చరాలను, అచరాలను కాపాడుకోవాలనే గొప్ప ఆలోచన దానిలో ఇమిడి ఉన్నదని అర్థమయింది. ఆ ఆలోచనను విస్మరించడం వల్ల కలిగే పర్యవసానాలను ఇప్పుడు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ భూమి మన అబ్బసొమ్మేం కాదు. ఇక్కడ బతకడానికి మనకెంత హక్కుందో, చీమకు, దోమకు, ఈగకు కూడా అంతే హక్కు ఉంది. ముప్పు మనవరకూ వస్తే ఎలా ఉంటుందో కరోనా సమయంలో బాగా తెలిసివచ్చింది. జంతువులు, పక్షులు స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటే... మనం బందీలుగా ఉండిపోయాం. కాబట్టి అన్నిటిలోనూ మనల్ని మనం చూసుకోవాలి. 'అన్నిటిలోనూ ఉండేది ఒకే ఆత్మ' అనేది మన తాత్త్వికత. అందుకే 'నాలోన శివుడు కలడు' అని రాశాను. నాలోన శివుడు ఉంటే నీలోనూ శివుడు ఉంటాడు. నిన్ను నువ్వు ప్రేమించినట్టు ఎదుటివాణ్ణి కూడా ప్రేమించు. ఏ మతమైనా అదే చెబుతోంది.

భక్తిలో 'అతి' కూడదు...

అయితే భక్తిలో కొన్ని అవాంఛితమైన ధోరణులను కూడా మనం చూస్తున్నాం. ఉదాహరణకు వినాయక చవితిని తీసుకుంటే... మన భారతీయుల శక్తిని బ్రిటిష్ వారికి చూపించాలన్న ఆలోచనతో... సామూహికంగా ఉత్సవాలు మొదలుపెట్టాలని లోకమాన్య బాలగంగాధర తిలక్ నిర్ణయించారు. ఇప్పుడు అది సంప్రదాయం అయిపోయింది. వినాయకచవితితో పాటు వేరే పండగలకు కూడా ఇది పాకింది. ప్రతి పండగకూ వీధుల్లోకి రావడం, రోడ్లు మూసేయడం, ఇతరుల పనులకు ఆటంకం కలిగించడం, కొన్నిసార్లు బెదిరించి కూడా చందాలు వసూలు చేయడం... ఇదంతా 'అతి'. ఆలయాల విషయానికి వస్తే... అభిషేకాన్ని నీళ్ళతో చేసేవారు. ఆ తరువాత పంచామృతాలు అన్నారు. పంచామృతాలైనా భక్తితో ఒక ఉద్ధరిణితో అభిషేకిస్తే చాలు. 'నేను వంద కిలోల పెరుగుతో చేస్తాను, వంద కిలోల పంచదారతో చేస్తాను' అంటూ తమ స్థాయిని భక్తిద్వారా దేవుడికి కాకుండా... లౌకికమైన వాటి ద్వారా ప్రపంచానికి ప్రదర్శించుకోవాలనే ఆరాటం పెరిగిపోయింది. అందుకే...

'చెంబెడు నీళ్ళుపోస్తె ఖుష్...
చిటికెడు బూడ్దె పూస్తె బస్...
వాటి పుణ్యానికి మోక్షమిస్తావు గదా
శబ్బాష్‌రా... శంకరా' అని రాశాను.

'నీలకంఠుని శిరసుపై నీళ్ళు చల్లి
పత్రినిసుమంత యెవ్వడు పారవైచు
గామధేనువు వానింట గాడి పసరము
అల్ల సురశాఖి వానింటి మల్లెచెట్టు' అన్నాడు 'రాజశేఖర చరిత్ర'లో మాదయ్యగారి మల్లన. శివుడి మీద నీళ్ళు కాస్తంత చిలకరించినా, విసిరినా, పారేసినా కూడా నిన్ను కరుణిస్తాడని అర్థం. అలా కాకుండా కిలోలకి కిలోలతో అభిషేకాలు చేయడం వల్ల మన దేశంలో ఎన్నో శివలింగాలుపాడైపోయాయి, అరిగిపోయాయి. కొన్నేళ్ళ కిందట మన వాళ్ళు కళ్ళు తెరిచి వాటికి వెండి తొడుగో, బంగారు తొడుగో అమర్చి... నేరుగా అభిషేకం చెయ్యడానికి వీల్లేదని చెబుతున్నారు. అలా చెయ్యకపోతే కొన్నాళ్ళకు ఆ శివలింగాలు మాయమైపోతాయి. విభక్తము కానిది భక్తి. కానీ అతి చెయ్యకూడదు. అతి భక్తినే 'మూఢభక్తి' అంటారు. నిజానికి అంతరాంతరాల్లో ఉండే భక్తి... గాఢభక్తి. కన్నప్పకు ఉన్నది గాఢభక్తి. మనలో చాలామందికి ఉన్నది మూఢభక్తి.

అది మన ఒక్కరికోసం కాదు...

భక్తి తత్పరుడికి ఉండవలసిన ప్రధాన లక్షణం... తను పదిమందికి సాయం చేస్తూ జీవించాలి. పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనం... ఆ పరోపకారం అనేది భక్తివల్ల సాధ్యమవుతుంది. అలాగే సాటి మనుషుల పట్ల, జంతువుల పట్ల, సమస్త జీవుల పట్ల దయాగుణం కలిగి ఉండాలి అనేది నా ప్రధాన ప్రతిపాదన. అప్పుడు మనం చేసే ప్రతి పనిలోనూ మంచి ప్రతిబింబిస్తూ ఉంటుంది. నా పద్యాల్లో సామాజిక పరిస్థితుల మీద ఆవేదన, వ్యంగ్యం, నిరసన, కోపం ప్రదర్శించడానికి, చీదరించుకోవడం, చిరాకుపడడం లాంటివి చెయ్యడానికి కారణం... మనిషిలో, సమాజంలో నైతికమైన మార్పు రావాలనే ఆకాంక్షే. భారత, భాగవత, రామాయణాలన్నీ నీతి పాఠాలే చెప్పాయి. "ఇలా బతకండి, బాగా బతకండి, సమాజానికి ఉపయోగపడేలా బతకండి. దుర్మార్గాన్ని ఖండించండి" అని బోధించాయి. మనం మన ఒక్కరి కోసం కాదు. మనం నూరుశాతం సమాజంలో భాగం. కాబట్టి సమాజం పట్ల మనకు గౌరవం, భక్తి ఉండాలి, ప్రేమ ఉండాలి. అదే ఆధ్యాత్మికత. సమాజానికి ఉపయోగపడని ఆధ్యాత్మికత వ్యర్థం."

దేవుణ్ణి ఏం కోరుకోవాలంటే...

బాల్యం నుంచీ నాకు దైవ భక్తి మెండుగానే ఉంది. మా ఇంట్లో శివారాధన ఉంది, విష్ణారాధనా ఉంది. అందుకే 'ఆటగదరా శివా... ఆటగదరా కేశవా' అని నా పద్యాన్ని ప్రారంభించాను. శివకేశవులు ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. విష్ణు పురాణంలో 'మద్భక్త శ్శంకరః ద్వేషీ, మద్వేషీ శంకరప్రియః, యో భౌ నరకంయాన్తి, యావచ్చంద్ర దివాకరౌ...' అన్నారు. "నన్ను ప్రేమించి శంకరుణ్ణి ద్వేషించేవాడు, శంకరుణ్ణి ప్రేమిస్తూ నన్ను ద్వేషించేవాడు... వాళ్ళిద్దరికీ నరకం తప్ప స్వర్గం రాదు" అని కటువుగా చెప్పాడు మహావిష్ణువు. ఒక దేవుడికి మొక్కుకుంటాం. అనుకున్నది అవుతుంది. ఇక ఆ దేవుణ్ణే నమ్ముకుంటాం. మన బలహీనతలన్నీ దేవుడికి ఆపాదిస్తాం. మనం ఎంత బలహీనులమో... దేవుళ్ళని కూడా అంతే బలహీనులుగా భావిస్తూ ఉంటాం. వాస్తవానికి భగవంతుడు మనకు ఎవరిమీదా ఆధారపడని స్థితి ఇచ్చాడు. దేవుణ్ణి మనం కోరుకోవలసింది, తీసుకోవలసింది కేవలం ఆత్మ విశ్వాసం, ఆత్మబలం. "నువ్వు మాకు ఉన్నావు. ఆ ధైర్యంతో మా పని మేం చేసుకుంటాం" అనుకోవాలి. అన్నీ దేవుడే చేసేటట్టయితే... కృష్ణుడే యుద్ధం చేసేవాడు కదా! అలా చెయ్యలేదు. "నువ్వు చెయ్యి. నీ వెనకాల ఉంటాను. లేదా నీ ముందు ఉంటాను" అన్నాడు. అన్నీ మనమే చేసుకోవాలి. మనకోసం ఎవ్వరూ చెయ్యరు. ఆ దేవుడు కూడా ఏదీ చెయ్యడు.

సంభాషణ: కృష్ణశర్మ


స్థితప్రజ్ఞత

గీతాసారం



మనం ఒక పరిస్థితిని, ఒక వ్యక్తిని లేదా ఒక పని తాలూకు ఫలితాన్ని మంచి లేదా చెడుగా విభజిస్తాం. అయితే ఏ అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యని మూడవ స్థితి కూడా సంభవమే. శ్రీకృష్ణుడు ఆ మూడవ స్థితి గురించి ప్రస్తావిస్తూ "దేనిపట్లా మమతాసక్తులు లేనివాడు, అనుకూల పరిస్థితుల్లో సంతోషం, ప్రతికూల పరిస్థితుల్లో ద్వేషం లాంటి మనోవికారాలకు లోనుకానివాడు అయిన వ్యక్తిని 'స్థితప్రజ్ఞుడు' అంటారు" అని చెప్పాడు. స్థిత ప్రజ్ఞుడు తన సొంత అభిప్రాయాలను వదిలేసి, వాస్తవాలను వాస్తవాలుగా తీసుకుంటాడని ఇది సూచిస్తోంది. ఎందుకంటే 'మంచి-చెడు" అనే విభజన 'సుఖదుఃఖాలు' అనే ద్వంద్వాలకు జన్మస్థలం. పరిస్థితులను, వాస్తవాలను తక్షణమే మంచి లేదా చెడు అని వర్గీకరించే మన ధోరణికి విరుద్ధంగా ఈ బోధ నడుస్తుంది. కాబట్టి ఇది కఠినంగా కనిపిస్తుంది. చెడుగా అనిపించే పరిస్థితిని లేదా వ్యక్తిని ఎదుర్కొన్నప్పుడు వెనువెంటనే అయిష్టత, విరక్తి, ద్వేషం అనేవి వాటంతట అవే కలుగుతాయి. కానీ స్థితప్రజ్ఞుడు ఏ పరిస్థితి గురించి అభిప్రాయాన్ని ఏర్పరచుకోడు కాబట్టి అతనిలో ద్వేషం పుట్టడానికి అవకాశమే లేదు. అదే విధంగా మంచి విషయాలకు స్థితప్రజ్ఞుడు పొంగిపోడు.

ఉదాహరణకు మన అందరిలో అందం, ఆకర్షణ కాలక్రమేణా సహజంగా తగ్గిపోతాయి. వృద్ధాప్యం అనే దశకు చేరుకుంటాం. ఇవి కేవలం ప్రాకృతిక వాస్తవాలు. కానీ మనం వాటిని అప్రియంగా లేదా చెడ్డవిగా భావిస్తే... అవి దుఃఖాన్ని తెస్తాయి. గాయం లేదా అనారోగ్యం లాంటి విషయాలలో సరైన చికిత్స వైపు దృష్టి పెట్టకుండా... ప్రస్తుత పరిస్థితులను చెడుగా భావించడమే దుఃఖం. ఒక శస్త్రవైద్యుడు (సర్జన్) వివిధ పరీక్షల ద్వారా వెల్లడయిన ఫలితాల ఆధారంగా రోగికి శస్త్రచికిత్స చేస్తాడు. స్థితప్రజ్ఞుడు కూడా వాస్తవిక దృష్టితో పరిస్థితులను ఎదుర్కొంటాడు. ఒక సూపర్ కండక్టర్ ఎలాగైతే మొత్తం విద్యుత్తును ఎలాంటి ఆసక్తి లేకుండా... స్వేచ్ఛగా తనలోంచి ప్రవహింపజేస్తుందో... స్థితప్రజ్ఞుడు కూడా అదే విధంగా ఆసక్తి లేకుండా జీవిస్తాడు. మనం పరిస్థితుల పట్ల, వ్యక్తులపట్ల, పనులపట్ల ఇష్టంతో కాని, అయిష్టంతో కాని ఉంటాం. ఇష్టం అంటే ఆ అంశాలతో ఏర్పడే అనుబంధం అని అర్థం చేసుకోవడం చాలా సులభం. కానీ అయిష్టం కూడా ఒక రకమైన అనుబంధమే. కాకపోతే అది ద్వేషంతో ముడిపడిన బంధం. స్థితప్రజ్ఞుడికి మమతాసక్తులు లేవన్నాడు శ్రీకృష్ణుడు. అంటే వారు ఇష్టాలు, అయిష్టాలు... ఈ రెండిటినీ వదిలేస్తారని అర్థం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/NcVWHsFలో చదవండి.

సరళ జీవనమే ధ్యాన సోపానం

ధ్యానానికి, జీవనశైలికి అవినాభావ సంబంధం ఉంది. జీవితంలో సరళత తెచ్చుకుంటే... ధ్యానస్థితి దానంతట అదే అనుభవంలోకి వస్తుంది. ఆలోచనల ప్రవాహం నెమ్మదించడానికి, మానసిక ఒత్తిడి కొంత తగ్గడానికి రోజూ కొంత సమయంపాటు ధ్యానసాధన మంచిదే. అయితే, జీవితంలో ప్రశాంతత, ధ్యానస్థితి నిరంతరం ఉండాలంటే... అందుకు అనువైన వాతావరణం కల్పించడం మరింత ముఖ్యం. దీనికి మౌలికమైన పునాది సరళ జీవనం అనేది నిస్సందేహం. ప్రస్తుత హడావిడి జీవితంలో ఏ మార్పూ లేకుండా, కోరికలు, ప్రాపంచిక వ్యాపకాలు యథావిధిగా కొనసాగిస్తున్నవారికి ధ్యానం పేరుతో కాసేపు కళ్ళు మూసుకుని కూర్చోవడం వల్ల ఫలితం శూన్యం. వాహన వేగం తగ్గించాలంటే ఉన్నపళంగా బ్రేక్ వేయలేం. ముందు వేగవర్ధకం (యాక్సిలరేటర్) మీద ఒత్తిడి తీసేయాలి. అలాగే జీవితాన్ని సరళతరం చేసుకోవాలి. అదే నిజమైన ధ్యాన సాధన.



పరిమిత వినియోగం

సరళ జీవనం అంటే ఏమిటి? అవసరం మేరకే వనరులు ఉపయోగించటడం, ప్రాపంచిక విషయాల్లో చిక్కుకుపోకుండా ఉండడం. ఆకలి తీర్చుకోవడానికి ఆహారం అనే రోజులు పోయాయి. నేడు జిహ్వా చాపల్యం కోసం, కాలక్షేపం కోసమే తింటున్నామంటే అతిశయోక్తి కాదు. సౌకర్యాల స్థాయి దాటి విలాసాలకు చిరునామా అయ్యాయి మన నివాసాలు. ఇవన్నీ ఒక ఎత్తయితే... ఈ వినిమయ సంస్కృతినే అభివృద్ధిగా చూడడం, వాడెయ్-పారెయ్ ధోరణి వెర్రితలలు వేయడం మరో విషాదం. వేడుకల పేరుతో జరుగుతున్న అనవసర ఆర్భాటం ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

నిజమైన ప్రేమ

ఇక కుటుంబ బంధాల్లో సరళత అత్యంత ముఖ్యం. పిల్లల పాలన-పోషణ, విద్యాబుద్ధులతో పాటు, వారితో తగిన సమయం గడపడం, వాళ్ళ అభిరుచులను గౌరవించాలి. వాళ్ళు స్వేచ్ఛగా, స్వతంత్ర వ్యక్తులుగా ఎదిగేలా తల్లిదండ్రులు సహకరించాలి. ఇవీ వారిపై నిజమైన ప్రేమకు నిదర్శనాలు. కానీ వాస్తవంలో చూస్తే... పిల్లలను తమ ఆస్తిపాస్తులు కాపాడే వారసులుగా, తమ కలలను, ఆశలను నెరవేర్చిపెట్టే సాధనాలుగా భావించటం, తమకన్నా విలాసవంతంగా బతకాలి అని కోరుకోవడం నేటి తల్లిదండ్రుల్లో ఎక్కువైపోయిందన్నది వాస్తవం. ఆలోచిస్తే ఇది పిల్లలపై ప్రేమ కాదు సరి కదా కేవలం స్వార్థపరత్వం. ఇక ఉద్యోగంలో తమను తాము నిరూపించుకోవడానికి ఒత్తిడి పెంచుకోవడం, సహోద్యోగులతో నిరంతర పోటీవైఖరి, పదోన్నతులు, జీతం పెంపుల కోసం యాతన పడడం, ఇలా ఉద్యోగమే జీవితం అయిపోయిన వాళ్ళు ఎందరో ఉన్నారు.

గృహస్థుగా ఉంటూనే...

ఇలాంటి హైటెక్, హైస్పీడ్ జీవితాల వేగం ఇలాగే కొనసాగిస్తూ 'రోజూ కాసేపు ధ్యానం' అంటూ సాధన చేయడం వృథా. ఇది జబ్బును పెంచి పోషిస్తూ ఉత్తుత్తి మాత్రలు మింగడం లాంటిది. వాహన వేగం పెంచుకుంటూ పోతూ బ్రేక్ పడాలని ప్రార్థించడం లాంటిది. సరళ జీవనం అంటే అందరూ ఋషులూ, సన్యాసులూ అయిపోవాలని కాదు. ఆ అవసరమూ లేదు. గృహస్థుగా ఉంటూనే... మితాహారం, వస్తు-సౌకర్యాలను పొదుపుగా వాడడం, ప్రకృతికి దగ్గరగా జీవించడం, ఏదో ఒక సృజనాత్మక వ్యాపకం పెంపొందించుకోవడం, భవిష్యత్తుపై అతిభయాన్ని తగ్గించుకోవడం, వర్తమానాన్ని పూర్తిగా ఆస్వాదించడం... ఇలాంటి మార్గాల ద్వారా జీవితాన్ని సరళతరం చేసుకుంటే ధ్యానం దానంతటదే కలిగే అనుభవం అవుతుంది. జీవితమే ధ్యానాత్మకమై వెలుగులీనుతుంది.

• ఈదర రవికిరణ్

సిద్ధి పొందాలంటే...

చింతన

సిద్ధ సంప్రదాయం గురించి తెలుసుకోవాలంటే 'సిద్ధి' అనే పదానికి అర్థం తెలుసుకోవాలి. అందుకోసం సాధన చేయాలి. గురువు నుంచి ఉపదేశ దీక్ష, మార్గదర్శకత్వం పొంది, యోగ మార్గంలో తీవ్ర సాధన చేసి... సాధకుడు తనలోని అరిషడ్వర్గాలను జయించాలి. ఆత్మసాక్షాత్కారం పొందాలి. అదే 'సిద్ధ స్థితి' లేదా 'సిద్ధ అవస్థ'.

యోగికి ఆత్మసాక్షాత్కారం కలిగినప్పుడు... పూర్వకర్మలు, వాటి ప్రతిఫలాలు, అహం, ఆత్మ, జ్ఞానం, మాయ, సర్వేంద్రియాలు, ఇంద్రియ శక్తులు, మనస్సు తదితరాలన్నీ అతనిలోనే అంతర్గతంగా ఉన్న బ్రహ్మతత్త్వంలో లీనమవుతాయి. ఆ విధంగా సిద్ధావస్థకు చేరుకున్న యోగి బాహ్య స్పృహ కోల్పోతాడు. పరమాత్మలో లీనమవుతాడు. నిర్మల, నిర్గుణ, నిరామయ, నిత్య వర్తమాన స్థితిలో ప్రకాశిస్తూ ఉంటాడు. సృష్టిలోని జీవ పరిణామ క్రమంలో 84 లక్షల జీవరాశుల మీదుగా (తరు, శిల జన్మలు మొదలుకొని గోవు, మానవ జన్మల వరకూ) సాగే ప్రయాణంలో సర్వోన్నతమైన మానవ జన్మ నుంచి ఆత్మ సాక్షాత్కారం ద్వారా పరమేశ్వరునిలో లీనం కావడం అనేది సృష్టి తాలూకు నియమిత గమ్యం. సిద్ధపరంపరకు ఆది పురుషుడు పరమశివుడు. ఆ తరువాత కార్తికేయుడు, అగస్త్యముని మొదలుగా సిద్ధ సంప్రదాయంలో లోక కల్యాణార్థం ఎందరో మహాత్ములు తేజోమయ స్థితిలో విరాజిల్లుతున్నారు. దత్త తత్త్వంలో శివతత్త్వం అంతర్భాగం కాబట్టి ఆదిగురువైన పరంజ్యోతి దత్తప్రభువు... సిద్ధ సంప్రదాయానికి పరమావధి.

సిద్ధ స్థితిలో ఉన్న వ్యక్తిలో స్వతఃసంకల్పం, వ్యక్తిత్వం అనేవి శూన్యమవుతాయి. అతడు జీవన్ముక్తావస్థలో నిలిచి ఉంటాడు. పరమేశ్వరుడి సంకల్పం, దివ్య లీల లోక కల్యాణార్థం ఆ సిద్ధుని ద్వారా ప్రకటితమవుతాయి. యోగ మార్గంలో తపిస్తున్న యోగ్యులైన సాధకులకు పరమేశ్వర సంకల్పానుసారం సిద్ధ యోగులు భావతరంగాల మాధ్యమంలో సంకేత, సంబోధనల ద్వారా... కొన్ని సమయాల్లో స్వప్న సాక్షాత్కారం, సూక్ష్మ శరీర మాధ్యమం ద్వారా ప్రత్యక్ష, పరోక్ష మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తూ ఉంటారు. దత్త ప్రభువుల లీలా విలాసంలో భాగంగా... 60 వేలమంది సిద్ధ యోగులు నిరంతరం ఈ విశాల విశ్వంలో కొలువై ఉంటారు. వారిద్వారా దత్తప్రభువు ఈ సృష్టిని పరిపాలిస్తూ ఉంటాడు. సమున్నత హిమాలయ ప్రాంతాల్లో... మామూలు కళ్ళకు కనిపించని నిగూఢమైన, అవాఙ్మానస గోచరమైన దివ్య సిద్ధ ఆశ్రమాలలో వందలాది, వేలాది సంవత్సరాలకు పైబడిన సిద్ధులు ఎందరో నివసిస్తున్నారు. వారి సంకల్పం, అనుగ్రహం ఉన్న సాధకులకు, జిజ్ఞాసులకు, అన్వేషకులకు సిద్ధాశ్రమ దర్శనానికి, ప్రవేశానికి అవకాశం కలుగుతుంది. తద్వారా ఆధ్యాత్మిక పరిణతి, పురోగతి సాధ్యమవుతుంది.



వివిధ కాలమాన పరిస్థితులలో మానవాళికి సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు... దత్త సంకల్పం ద్వారా కొంతమంది సిద్ధ పురుషులు మానవ జన్మ (కారణ జన్మ) ద్వారా... మానవాళికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేస్తారు. యోగమార్గాన్ని సరళం చేసి... కొన్ని తరాలవారికి జీవన అభ్యున్నతిని, ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదిస్తారు. అనంతరం తమ కారణ జన్మలను చాలించి సిద్ధాశ్రమానికి మరలి వెళ్తారు. రామకృష్ణ పరమహంస, వివేకానంద, యోగానంద లాంటి సిద్ధ పురుషులు ఇందుకు ఉదాహరణలు.

• దేవరకొండ శ్రీకాంత్



బర్త్‌డే సర్‌ప్రైజ్!

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా 'విశ్వంభర' చిత్రంలోని ఆయన లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఒక రాతిపై కూర్చుని ప్రత్యేక శక్తులు కలిగిన త్రిశూలాన్ని పట్టుకుని ఉన్న మెగాస్టార్ పవర్‌ఫుల్‌గా అనిపించారు. ఆయన పుట్టినరోజున టీజర్ విడుదల ఉండదని దర్శకుడు వశిష్ట ముందే స్పష్టం చేయడంతో కొంత నిరాశ చెందిన మెగా అభిమానులను ఈ లుక్ సర్‌ప్రైజ్ చేసింది. 'చీకటి, చెడు ఈ ప్రపంచాన్ని ఆక్రమించినప్పుడు ఒక అద్భుతమైన తార పోరాడడానికి ప్రకాశిస్తుంది' అని చిత్రం టీమ్ ఈ పోస్టర్‌లో పేర్కొంది. 'విశ్వంభర' చిత్రం కోసం ఓ ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు. అద్భుతమైన డ్రామా, ఎమోషన్స్‌తో ఈ సినిమా విజువల్ వండర్‌గా ఉంటుందని నిర్మాతలు విక్రమ్, వంశీ, ప్రమోద్ చెప్పారు. అలాగే పుట్టినరోజు సందర్భంగా తండ్రితో దిగిన ప్రత్యేక ఫొటోను రామ్‌చరణ్ విడుదల చేశారు.

నచ్చితే ఎక్కడికైనా వెళతా..

"మనకు నచ్చిన వారి కోసం మనం తప్పకుండా నిలబడాలి. నాకు నచ్చినవారి కోసం ఎక్కడికైనా.. ఎంతదూరమైనా వెళతా.. ఏమైనా చేస్తా. ఈ మూవీ ఫంక్షన్ కోసం తబిత సుకుమార్ నన్ను పిలిచారు. అందుకే 'పుష్ప 2' క్లైమాక్స్ షూటింగ్‌లో ఉండి కూడా.. ఇక్కడికి వచ్చాను. 'మారుతీనగర్ సుబ్రమణ్యం' లాంటి సినిమాలు హిట్టవ్వాలి. ఇలాంటి మంచి కథలు ఉన్న చిత్రాలు మరిన్ని రావాలి అని కోరుకుంటున్నాను" అని అల్లు అర్జున్ అన్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రావురమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ, రమ్య పసుపులేటి ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సుకుమార్ చిత్రాన్ని సమర్పించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లు అర్జున్, సుకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమాను చూశాను. చాలా బాగుంది" అని చెప్పారు. "సినిమా అనుకున్నదానికంటే బాగా వచ్చింది. ఇది టీమ్ ఎఫర్ట్" అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు.





హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ ఒకటయ్యారు. కర్ణాటకలోని కూర్గ్‌లో బంధు విత్రుల సమక్షంలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరిగింది. వీరిద్దరికీ తొలి చిత్రం అయిన 'రాజావారు రాణీగారు'లో నటించే సమయంలో ప్రేమలో పడ్డారు. మార్చి 13న వీరి నిశ్చితార్థం జరిగింది.

ఐటమ్ సాంగ్ చేస్తుందా?



నటి శోభితా ధూళిపాళకు ఇటీవలే నాగచైతన్యతో నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అమ్మడును ఓ క్రేజీ ఆఫర్ వచ్చి తలుపు తట్టింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్, కియారా అద్వానీ జంటగా తెరకెక్కనున్న 'డాన్ 3'లో ఓ ప్రత్యేక గీతంలో నటించడానికి శోభితను మేకర్స్ సంప్రదించారట. దానికి శోభిత సమ్మతించారని కొందరు, అదేంకాదు ఇంకా చర్చల్లోనే ఉందని మరికొందరు అంటున్నారు. మరి శోభిత నిజంగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా.. లేదా అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఆమె నిర్ణయం కోసం ఆ చిత్ర దర్శక నిర్మాతలే కాదు, అక్కినేని అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొత్త ఇంట్లో నరేశ్



సీనియర్ నటుడు నరేశ్ ఓ ఇంటివాడయ్యారు. చిలుకూరి బాలాజీ ఆలయానికి సమీపంలో ఉన్న ఆయనకు ఓ వ్యవసాయ క్షేత్రం ఉంది. అందులో ఓ పెద్ద ఇల్లుని అత్యాధునిక వసతులతో నిర్మించి ఇటీవలే గృహ ప్రవేశం చేశారు. ఈ భవంతికి విజయకృష్ణ మందిరం అని పేరు పెట్టారు. ఇక్కడే హీరో కృష్ణ, ఇందిరా దేవి విగ్రహాలతో ఏర్పాటు చేసిన ఇందిరా దేవి స్ఫూర్తి వనాన్ని కూడా ఆ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన చిత్ర ప్రముఖులకు నరేశ్, పవిత్ర స్వాగతం పలికారు. నరేశ్ కొత్త ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇన్ ప్రోగ్రెస్

చిన్నా ఇది వింత లోకం!



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ కీలక పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ సినిమా తీస్తున్నారు. నందకిశోర్ ఈమని దర్శకుడు. ఈ చిత్రం నుంచి భరద్వాజ్ గాలి రాసిన 'చిన్నా.. ఇది వింత లోకం' పాటను విడుదల చేశారు. స్కూల్ ఎపిసోడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

గరుడ పురాణం ఏం చెబుతోంది?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా నటిస్తున్న తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కే.ఎస్.నందీశ్ దర్శకత్వంలో విజయ్‌లోహిత్ నిర్మిస్తున్నారు. ఇటీవలే సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నందీశ్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. ఇదో వైవిధ్యభరితమైన సినిమా" అని అన్నారు. "మంచి కథతో తెరకెక్కుతోన్న ఈ సినిమా అందరికీ మంచి ఫీల్ గుడ్ మూవీ చూశామనే అనుభూతిని ఇస్తుంది" అని నిర్మాత విజయ్‌లోహిత్ చెప్పారు.

బయట ప్రపంచం చాలా చెత్తగా ఉంది



'ఏ మహిళ అయినా ఎవరితోనూ తన ఇబ్బందిని చెప్పుకొనే ధైర్యం చేయలేదని అనిపిస్తేనే ఆమెను మరింత ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారికి నో చెప్పడం నేర్చుకోవాలి' అన్నారు మంచు లక్ష్మి. చిత్ర పరిశ్రమలో మహిళా ఆర్టిస్టులను వెంటాడి వేధిస్తున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'అన్యాయం జరిగిన వెంటనే బయటకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఉంది. అలాగే ఆర్టిస్టులు తెలివిగా నో చెప్పడం నేర్చుకోవాలి. కెరీర్ మొదలు పెట్టిన సమయంలో నన్నూ కొందరు ఇబ్బంది పెట్టారు. వారిపై గట్టిగా అరిచి నాకు వచ్చిన ఛాన్స్ పోగొట్టుకున్నా. కానీ తర్వాత అలాంటి విషయాల్లో తెలివిగా వ్యవహరించడం నేర్చుకున్నా. అప్పటికీ అవతలి వారు విసిగిస్తుంటే మనం వారికి బుద్ధి చెప్పక తప్పదు. ఎందుకంటే బయటి ప్రపంచం చాలా చెత్తగా ఉంది' అన్నారామె.

రేవంత్‌ది దైవద్రోహం

రుణమాఫీ చేస్తామని ఒట్టేసి మాటతప్పారు.. ముక్కు నేలకు రాసి పరిహారం చేసుకోవాలి


యాదగిరిగుట్టలో మాఢవీధుల్లో పూజలు చేయిస్తున్న హరీశ్‌రావు

- జనగామ రైతు ధర్నాలో హరీశ్ నిప్పులు
- అందరికీ రుణమాఫీ చేసేవరకూ ప్రభుత్వాన్ని వదలం: కేటీఆర్ ధ్వజం
- అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ నేతల దీక్షలు
- ఆందోళనలతో తిరుమలగిరిలో ఉద్రిక్తత

('ఆంధ్రజ్యోతి' న్యూస్‌నెట్‌వర్క్)

వంద శాతం రుణమాఫీ చేస్తానంటూ సీఎం రేవంత్ దేవుళ్లపై ఒట్టేసి మాటతప్పారని.. రైతులను మోసం చేయడమే కాక, దైవద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఏ ఒక్క గ్రామంలోనైనా 100 శాతం రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని పేర్కొన్నారు. 54 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదన్న ఆయన.. ఈ విషయాన్ని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, రేవంత్ ఏ మండలానికి ఏ ఊరుకు వస్తారో రావాలని సవాల్ చేశారు. నేరుగా రైతులవద్దకే వెళ్లి వంద శాతం రుణమాఫీ జరిగిందో లేదో అడుగుదామన్నారు. ప్రభుత్వం చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని నిరసన వ్యక్తం చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో, జనగామ జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు ధర్నాల్లో హరీశ్ పాల్గొన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ అమలు చేస్తానంటూ కొమురవెల్లి మల్లన్న, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టు వేశారని గుర్తుచేశారు. మాటతప్పినందుకు.. వెంటనే సీఎం దేవుళ్ల ఎదుట ముక్కు నేలకు రాసి పాప పరిహారం చేసుకోవాలని.. దేవుళ్లకు, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై యాదగిరి గుట్ట ఆలయం నుంచి యాత్ర మొదలుపెట్టామని.. రేవంత్ ఒట్టేసిన అన్ని ఆలయాలకూ ఈ యాత్రలో భాగంగా వెళ్తామని చెప్పారు. రేవంత్‌ను క్షమించాలంటూ యాదగిరిగుట్టలో లక్ష్మీనృసింహస్వామికి పూజలు చేశామని చెప్పారు. దేవుళ్లను మోసం చేసిన ముఖ్యమంత్రి బండారాన్ని బయటపెడతామని హెచ్చరించారు. మరోవైపు.. ఎలాంటి ఆంక్షలూ లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేసేవరకూ ప్రభుత్వాన్ని వదలబోమని.. పోరాటాన్ని ఆపబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రుణమాఫీ కోసం అధికారుల చుట్టూ తిరగొద్దని.. హామీ ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ నాయకులను ఊరూరా నిలదీసి అడగాలని రైతులకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఆయన రైతు నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం సొంత ఊరైన కొండారెడ్డిపల్లెలోనూ పూర్తిగా రుణమాఫీ కాలేదని విమర్శించారు. మాఫీ మొత్తాన్ని రూ.49 వేల కోట్ల నుంచి రూ.7500 కోట్లకు తగ్గించారని ధ్వజమెత్తారు. "ప్రభుత్వం వచ్చి 8 నెలలైంది. రేవంత్‌రెడ్డీ.. నీ పాలన ఎలా ఉందో ప్రజలకు తెలుసు. సమయానికి విత్తనాలు, ఎరువులు అందుతున్నాయా లేవా? మద్దతు ధర లభిస్తోందా? రుణమాఫీ అయిందా? బోనస్, రైతు బంధు లభిస్తున్నాయా లేదా? ..అన్నీ రైతులే చెబుతారు. నీవు ఏ ఊరికి వస్తావో రా. దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా రా. తేల్చుకుందాం" అని సవాల్ చేశారు. రుణమాఫీ చేస్తామని అనేక దేవుళ్ల మీద ఒట్లేసి.. చేయకుండా సీఎం దైవద్రోహానికి పాల్పడ్డారని విమర్శించారు. మనుషులనే కాక దేవుళ్లను కూడా రేవంత్ మోసం చేశారని ఆరోపించారు. పాలన సక్రమంగా లేదన్న పాపానికి సబితక్కపై రేవంత్ పగబట్టాడని.. ఆమెను నిండు శాసనసభలో అవమానించాడని దుయ్యబట్టారు. రుణమాఫీ అమలు విషయంలో ప్రజాభిప్రాయసేకరణ కోసం సీఎం సొంతూరికి వెళ్లిన మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ గుండాలతో దాడులు చేయిస్తూ అసభ్యంగా ప్రవర్తించారని నిప్పులు చెరిగారు.

హరీశ్‌పై గుట్టలో కేసు నమోదు

యాదగిరీశుడి ఆలయ మాడవీధుల్లో ఆయన ఓ ప్రైవేట్ పూజారితో పూజలు నిర్వహించారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆలయ మాడవీధుల్లో తూర్పురాజగోపురం వద్ద హరీశ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, పలువురు బీఆర్ఎస్ నేతలు ఆలయంతో సంబంధం లేని ఒక పూజారితో పూజలు చేయించారు. దీంతో ఆలయ ఈవో భాస్కర్‌రావు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు.. బీఆర్ఎస్ నేతలు అపవిత్రం చేశారంటూ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు ఆలయాన్ని నీటితో శుద్ధిచేశారు.


చేవెళ్లలో నిర్వహించిన రైతు దీక్షలో మాట్లాడుతున్న కేటీఆర్

ఉద్యమకాల నిరసనలు.. మళ్లీ చేస్తాం

తెలంగాణ ఉద్యమ కాలంలో చేసిన అన్ని రకాల నిరసనలూ మళ్లీ చేస్తామని కేటీఆర్ అన్నారు. చేవెళ్ల రైతు దీక్ష సందర్భంగా మీడియాతో చిట్‌చాట్ చేసిన ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుందని తాము అనుకోవట్లేదని తెలిపారు. బీసీలకు 42 శాతం సీట్లిస్తామన్న కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అప్పులపై రేవంత్ సర్కారు దుష్ప్రచారం చేస్తోందన్న ఆయన.. రాహుల్, రేవంత్ మధ్య చాలా విభేదాలున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభ స్థానాన్ని మాదిగలకు ఇస్తానని చెప్పి మోసం చేసి.. అభిషేక్ మను సింఘ్వీకి ఇచ్చారని విమర్శించారు. తెలంగాణలో అదానీతో ఒప్పందాలు చేసుకున్న రేవంత్.. ఇప్పుడు అయనకు వ్యతిరేకంగా నిరసనలు చేయడం హాస్యాస్పదమని ట్వీట్ చేశారు.

నినాదాలు.. ప్రతినినాదాలు..

రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు, నిరసనలు, దీక్షలు నిర్వహించారు. అయితే, సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో జరిగిన నిరసనలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ కార్యకర్తలు డౌన్‌డౌన్ నినాదాలు చేశారు. వారికి ప్రతిగా బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ కార్యకర్తలపై గుడ్లు, రాళ్లు విసిరారు. వారు అట్నుంచీ చెప్పులు విసిరారు. పరిస్థితి శ్రుతి మించడంతో పోలీసులు లాఠీలు ఝుళిపించి ఇరువర్గాలనూ చెదరగొట్టారు.



మహిళలకు పోలీసు వాహనాల్లో
ఉచిత ప్రయాణం ఫేక్

సోషల్ మీడియాలో ప్రచారంపె తెలంగాణ పోలీసుల స్పష్టత

అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలని సూచన

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల మధ్య ఒంటరిగా ప్రయాణించే మహిళలను పోలీసులు తమ వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుస్తారంటూ... సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ పోలీసులు ప్రకటించారు. అలాంటి పథకాన్ని తాము అమలు చేయడం లేదని స్పష్టం చేశారు. వదంతులు నమ్మవద్దని సూచించారు. పోలీసులు మహిళల కోసం ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించారని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఒంటరిగా ప్రయాణించే మహిళలు 1091, 78370 18555 నెంబర్లకు ఫోన్ చేసి సాయం అడిగితే సమీపంలోని పోలీసు వాహనం వారిని గమ్యస్థానానికి చేరుస్తుందనే సందేశం వాట్సాప్ గ్రూపుల్లో విపరీతంగా తిరుగుతోంది. ఈ సందేశం తప్పుడు సమాచారమని ప్రకటించిన పోలీసులు అత్యవసర పరిస్థితుల్లో సాయం కోసం ప్రజలు 100కు డయల్ చేయాలని సూచించారు.

జీహెచ్ఎంసీలో గ్రామాల విలీనం వద్దంటూ పిటిషన్లు

ఏకపక్షంగా నోటిఫికేషన్ ఇచ్చినట్టు అభ్యంతరాలు

శంషాబాద్ రూరల్, 22(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషరేట్ (జీహెచ్ఎంసీ) పరిధిలో తమ గ్రామాలను విలీనం చేయకూడదని కోరుతూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఔటర్‌రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తున్నట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన జీవోను పిటిషనర్లు సవాలు చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం చిన్న గోల్కొండ మాజీ సర్పంచ్ పద్మావతి అనంతరెడ్డితో పాటు, హమీదుల్లానగర్, పెద్ద గోల్కొండ, బహదూర్‌గూడ, రషీద్‌గూడ గ్రామాల తరపున పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై గురువారం జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం ముందు న్యాయవాది రఘునాథ్ వాదనలు వినిపించారు. పంచాయతీల తీర్మానాలు లేకుండా గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో రైతులు, కూలీలు కేంద్ర ప్రభుత్వ పథకాలకు దూరం అవుతారన్నారని చెప్పారు. ఉపాధి హామీ వంటి పథకాలు వారికి వర్తించవని తెలిపారు. జస్టిస్ వినోద్‌కుమార్ స్పందిస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా జీవో విడుదల చేసినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ సంబంధిత అధికార్లకు నోటీసులు పంపించారు.

పాము కాటుతో అన్నదాత మృతి

- కాళేశ్వరం కెనాల్‌లో పడి రైతు దుర్మరణం
- సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో ఘటనలు

కంగ్టి, దిలావర్‌పూర్, ఆగస్టు 22 : పాము కాటుకు గురై ఓ రైతు మృతి చెందగా, ప్రమాదవశాత్తూ కాళేశ్వరం కెనాల్‌లో పడి మరో అన్నదాత ప్రాణాలు పోగొట్టుకున్నాడు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని జంగి.కె గ్రామానికి చెందిన కోటగిరి సంతోశ్ తన భార్య కవితతో కలిసి కుటుంబ పోషణ నిమిత్తం కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. గ్రామంలోని తన వ్యవసాయ భూవిలో బోరు వేసి పత్తి, మొక్క జొన్న పంటలు సాగు చేశాడు. బుధవారం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన సంతోశ్ రాత్రి పొలం వద్ద ఉన్న గుడిసెలోనే నిద్రించగా రాత్రి పాము కాటు వేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కదిలి గ్రామానికి చెందిన గైక్వాడ్ అశోక్(43) పెసర పంటను అడవి పందులు పాడు చేస్తుండటంతో బుధవారం రాత్రి కాపలాకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పక్కనే ఉన్న కాళేశ్వరం కెనాల్‌లో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగి చనిపోయాడు.

మహిళా యూట్యూబర్లను
అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కెమెరాలు, మొబైల్ ఫోన్లు లాక్కొని ఇబ్బందులు

రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ఘటన


నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు రక్షణ కోసం వచ్చిన యూట్యూబర్లు విజయారెడ్డి, సరిత

వంగూరు/వెల్దండ, ఆగస్టు 22: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో గురువారం పంట రుణాల మాఫీ వివరాలను తెలుసుకోవడానికి వచ్చిన విఠ్రర్ టీవీ విజయారెడ్డి, సిగ్నేచర్ టీవీ సరిత, ఇతర యూట్యూబర్లను కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఉదయం గ్రామానికి వచ్చిన యూట్యూబర్లు రైతు రుణమాఫీ అందరికీ అయ్యిందా, రుణ మాఫీలో ఇబ్బందులు ఉన్నాయా? అని కొందరు గ్రామస్థులను అడిగారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తమ గ్రామంలో అనేక సమస్యలు ఉండేవని, అప్పుడు రాని మీరు ఇప్పుడు వచ్చి సమస్యలు సృష్టిస్తున్నారని యూట్యూబర్లను ప్రశ్నించారు. విచారణ చేయొద్దని వారి కెమెరాలు, సెల్‌ఫోన్లను లాక్కున్నారు. తమ కెమెరాలను తిరిగి తీసుకునేందుకు యూట్యూబర్లు ప్రయత్నం చేయగా.. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మహిళలు అని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ అవమానపరిచారని యూట్యూబర్లు ఆవేదన వ్యక్తంచేశారు. తమపై దాడి చేశారని పేర్కొంటూ వంగూరుకు వచ్చి పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించి గుండాయిజం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, తమ మొబైల్ ఫోన్లు, కెమెరాలను ఇప్పించాలని పీఎస్‌లో ఉన్న వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేందర్‌లను కోరారు. ఇదిలాఉండగా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షుడు గువ్వల బాల్‌రాజు విషయం తెలుసుకొని పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అదుపులోకి తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. యూట్యూబ్ చానళ్ల వారు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. కాగా, స్థానిక పోలీసులు యూట్యూబర్లు విజయారెడ్డి, సరితలకు రక్షణగా నిలిచి బందోబస్తు నడుమ వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కాగా, కొండారెడ్డిపల్లిలో మహిళా యూట్యూబర్లపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేయడం అమానుషమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని.. బీఆర్ఎస్ నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, దేవీప్రసాద్, తదితరులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ జరిగిందా.. లేదా..? అన్న విషయాన్ని తెలుసుకునేందుకు వెళ్లిన వారిపై దాడి చేయడం హేయమని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

- ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు




న్యూఢిల్లీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. ఆమెకు గురువారం ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి, తిరిగి జైలుకు తీసుకొచ్చారు. ఆమె కొంతకాలంగా గైనిక్ సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి తోడు ఇటీవల వైరల్ జ్వరం బారినపడ్డారు. జూలై 16న తొలిసారిగా కవితను ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల తర్వాత 18న ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరచగా, తనకు ఎదురవుతున్న అనారోగ్య సమస్యలను జడ్జి కావేరి బవేజా దృష్టికి తీసుకెళ్లారు. కవిత విజ్ఞప్తి మేరకు ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడలేదు. జైలు వైద్యులే ఆమెకు వైద్యం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మళ్లీ ఆమె అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. జైలు వైద్యుల సూచన మేరకు గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో అధికారులు ఆమెను ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కవిత భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి జైలుకు తరలించారు. ఆమె సుమారు ఐదున్నర నెలల నుంచి జైలులోనే ఉన్నారు. జైలుకు వెళ్లిన తర్వాత ఆమె సుమారు 11 కేజీల బరువు తగ్గారు. బెయిల్ విషయంలో ట్రయల్ కోర్టుతో పాటు హైకోర్టులో కూడా ఆమెకు నిరాశే ఎదురైంది. ఈ నెల 27న ఆమె బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది.

సీఎంను కలిసిన యునిసెఫ్ ఫీల్డ్ అధికారి

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునిసెఫ్ ఫీల్డ్ కార్యాలయం ముఖ్య అధికారి జెలాలెమ్ బి.టాఫీసీ కలిశారు. యునిసెఫ్ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన గురువారం సచివాలయంలో సీఎంకు వివరించారు.

టాప్-5లో చంద్రబాబు

- ఉత్తమ సీఎంపై 'ఇండియా టుడే' సర్వే



అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో అత్యంత జనాదరణ కలిగిన టాప్-5 సీఎంల జాబితాలో నిలిచారు. 'ఇండియా టుడే- సీ ఓటర్' సర్వేలో ఈ విషయం వెల్లడైంది. 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో అనేక అంశాలపై దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ఫలితాలను గురువారం 'ఇండియా టుడే' వెల్లడించింది. ఇందులో... అత్యధిక జనాదరణ కలిగిన ముఖ్యమంత్రులకు సంబంధించి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఏపీ సీఎం చంద్రబాబు ఇద్దరూ నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిలిచారు. తర్వాతి స్థానాల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో... స్టాలిన్, చంద్రబాబు నిలిచారు. ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించిన రెండు నెలల్లోనే చంద్రబాబు టాప్-5 ముఖ్యమంత్రుల జాబితాలోకి రావడం విశేషం. "అభివృద్ధి రాజకీయాలకు దేశంలో చంద్రబాబు చిరునామాగా ఉన్నారు. గతంలో హైదరాబాద్‌ను బాగా అభివృద్ధి చేసిన రికార్డు ఆయన సొంతం" అని దీనిపై జరిగిన చర్చలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు.

ట్రామాకేర్‌కు ఎన్‌హెచ్ఏఐ మోకాలడ్డు!

- తాము సేకరించిన స్థలంలో పనులపై ఎన్‌హెచ్ఏఐ ఆగ్రహం
- ఏడీపీకి సంస్థకు నోటీసులు.. నిలిచిన పనులు

కేతేపల్లి, ఆగస్టు 22: నల్లగొండ జిల్లాలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు అర్ధాంతరంగా నిలిచిపోయింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) మోకాలడ్డడంతో నిర్మాణ సంస్థ ఆటోమెటిక్ డేటా ప్రాసెస్ (ఏడీపీ) పనులను నిలిపేసింది. రైతులకు పరిహారం చెల్లించి తాము సేకరించిన భూమిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏడీపీకి ఎన్‌హెచ్ఏఐ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఏడీపీ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.5 కోట్ల నిధులతో ప్రమాదకర రోడ్డుగా పేరున్న 65వ నంబర్ హైవేపై కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఎకరా విస్తీర్ణంలో ట్రామా కేర్ సెంటర్ నిర్మించ తలపెట్టింది. ఈ పనులకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత నెల 8న ఏడీపీ ఇండియా హెడ్ విజయ్ వేములపల్లితో కలిసి భూమి పూజ చేశారు. పనులను 2 నెలల్లో పూర్తి చేసి సెప్టెంబరులోనే ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభిస్తామని మంత్రి అప్పటి సభలో ప్రకటించారు. ఇటు పనులు ప్రారంభించిన ఏడీపీ సంస్థ ప్రతినిధులు పిల్లర్లకు ఫుటింగ్‌లు, పిల్లర్ బుట్టలు కట్టే పనులు పూర్తి చేయించారు. ఈ క్రమంలోనే టోల్‌ప్లాజా ఆవరణలో ట్రామాకేర్ సెంటర్ నిర్మిస్తున్న సమాచారం తెలుసుకున్న ఎన్‌హెచ్ఏఐ అధికారులు.. ఏడీపీ సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అనుమతులు లేకుండా తాము సేకరించిన స్థలంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయడమేంటని.. తక్షణం పనులు నిలిపేసి స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో ఏడీపీ యంత్రాంగం.. భవన నిర్మాణ పనులను నిలిపేసి పిల్లర్ బుట్టలను గ్యాస్ కట్టర్లతో కట్ చేసి సామగ్రి అంతా తరలించి వారం రోజుల కిత్రం స్థలాన్ని ఖాళీ చేసింది. ఇదే విషయమై ఏడీపీ సంస్థ ప్రతినిధులను సంప్రదించేందుకు ప్రయత్నించగా.. వారు స్పందించలేదు.

2 నెలల్లో ఈఆర్‌సీ ఖాళీ

విద్యుత్ నియంత్రణ మండలిలో మొదలవని నియామక ప్రక్రియ

ఆర్నెల్ల ముందే చేపట్టాల్సి ఉన్నా ఉలుకుపలుకు లేని యంత్రాంగం

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల్లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) ఖాళీ కానుంది. డిస్కమ్‌ల వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలతో పాటు విద్యుత్ సంస్థల ఏ పిటిషన్ విచారించడానికి అయినా ఒక్క సభ్యుడు కూడా కమిషన్‌లో ఉండరు. 2019 అక్టోబరులో నియమితమైన ప్రస్తుత చైర్మన్, సభ్యుల పదవీ కాలం అక్టోబరు 29వ తేదీతో ముగియనుంది. విద్యుత్తు చట్టం-2003లోని సెక్షన్-85 ప్రకారం చైర్మన్/సభ్యులు ఐదేళ్లు లేదా 65 ఏళ్లు నిండే వరకే పదవిలో ఉండాలి. దీంతో కొత్తగా నియామకం అనివార్యంగా మారింది. ఈ ప్రక్రియను సభ్యుల పదవీ కాలం పూర్తికావడానికి ఆర్నెల్ల ముందు నుంచే చేపట్టాలి. మే నెలలోనే నోటిఫికేషన్ ఇవ్వాలి. దీనికి అనుగుణంగా ప్రభుత్వానికి టీజీఈఆర్‌సీ సమాచారం ఇచ్చింది. అయితే, అప్పట్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండడంతో సర్కారు దృష్టిపెట్టలేదు. ఫలితాల అనంతరం నోటిఫికేషన్ ఇచ్చి, దరఖాస్తుల స్వీకరణ చేపడతారని భావించారు. ఈ క్రమంలోనే ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీని బదిలీ చేసి రోనాల్డ్‌రాస్‌కు బాధ్యతలు అప్పగించారు. శాఖపై పట్టు సాధించేలోపే ఆరోగ్యం బాగోలేక సెలవుపై వెళ్లారు. ఇటీవలే విధుల్లో చేరారు. ఈ నేపథ్యంలో నియామక ప్రక్రియ ముందుకెళుతుందా?లేదా? అనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది.

హైకోర్టు మాజీ సీజేలకు చోటు దక్కేనా?

హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) నుంచి ఒకరు సభ్యులుగా ఉండే కమిటీ టీజీఈఆర్‌సీ చైర్మన్, సభ్యుల ఎంపికను చేపట్టాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ప్రతి పోస్టుకు ఇద్దరు అభ్యర్థుల వివరాలను ప్రభుత్వం ఈ కమిటీకి అందించాలి. కాగా, విభజన అనంతరం తెలుగు రాష్ట్రాలకు రెండు కమిషన్లు ఏర్పడగా.. ఏపీలో హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తులనే చైర్మన్లుగా నియమించారు. తెలంగాణలో ఒకసారి విద్యుత్ రంగ నిపుణుడిని, మరోసారి న్యాయవాదిని నియమించారు. ప్రస్తుతం సభ్యులుగా దక్షిణ డిస్కమ్ పూర్వ అధికారితో పాటు ఓ చార్టర్డ్ అకౌంటెంట్ ఉన్నారు. దీంతో ఈసారైనా హైకోర్టు మాజీ సీజేలకు చోటు కల్పిస్తారా? గత ప్రభుత్వం అనుసరించిన సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? అనేది తేలాల్సి ఉంది.

అదితి, నేహాకు స్వర్ణాలు

అమ్మాన్: జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో జరుగుతున్న అండర్-17 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నాలుగు స్వర్ణాలతో సత్తా చాటింది. గురువారం జరిగిన మహిళల 43 కిలోల విభాగం ఫైనల్లో అదితి కుమారి 7-0తో మారియా లౌజియాని చిత్తు చేసి పసిడి పతకం సొంతం చేసుకోగా, 57 కిలోల తుది పోరులో నేహ 10-0తో సుట్సుయిపై విజయంతో స్వర్ణం అందుకుంది. 65 కిలోల ఫైనల్‌బౌట్‌లో పుల్కిత్ 6-3తో డారియాపై, 73 కిలోల్లో మాన్సి లాథర్ 5-0తో హనా పిర్స్‌కయాపై గెలిచి పసిడి పతకాలు దక్కించుకున్నారు. కాగా మరో ఇద్దరు భారత అమ్మాయిలు కాజల్ (69 కి), శ్రుతికా శివాజీపాటిల్ (46 కి) స్వర్ణం రేసులో నిలిచారు. వీరి ఫైనల్స్ శుక్రవారం జరగనున్నాయి.

చదువు కోసం ఆటకు వీడ్కోలు

టీటీ స్టార్ అర్చనా కామత్ నిర్ణయం



న్యూఢిల్లీ: భారత యువ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ అర్చనా కామత్ సంచలన నిర్ణయం తీసుకుంది. కేవలం 24 ఏళ్ల వయస్సులోనే ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించింది. భారత మహిళల టేబుల్ టెన్నిస్ జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో తొలిసారి క్వార్టర్స్‌కు చేరి చరిత్ర సృష్టించింది. ఆ టీమ్‌లో అర్చన కూడా సభ్యురాలే. జర్మనీతో జరిగిన పోరులో భారత్ 1-3తో ఓడగా.. ఆ ఒక్క గెలుపు కూడా అర్చనా కామత్ ద్వారానే రావడం విశేషం. అయితే మరో నాలుగేళ్ల తర్వాత లాస్‌ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పతకం సాధించే అవకాశం తక్కువగా ఉండడంతో ఆటను వదిలి విద్యపై దృష్టి సారించాలని భావిస్తోంది. త్వరలోనే యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్‌లో అర్చన పబ్లిక్ పాలసీపై మాస్టర్స్ చదివేందుకు యూఎస్ వెళ్లనుంది. వచ్చే గేమ్స్‌లో మెడల్ సాధించడం చాలా కష్టమేనని కోచ్ చెప్పడంతో..తన 15 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలకడమే ఉత్తమమని కామత్ భావించింది.

రేస్ వాకర్ భావనపై వేటు

న్యూఢిల్లీ: డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించిన భారత రేస్ వాకర్ భావనా జాట్‌పై 16 నెలల నిషేధం విధించారు. నిరుడు ఆగస్టులో ఆమె.. తాను ఎక్కడున్నాననే సమాచారాన్ని జాతీయ డోపింగ్ నిరోధక కమిటీకి తెలియజేయడంలో నిర్లక్ష్యం వహించింది. దాంతో ఆమెపై వేటు వేశారు.

బంగ్లా బోర్డు కొత్త అధ్యక్షుడు ఫరూఖ్

ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కొత్త అధ్యక్షుడిగా మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్ ఫరూఖ్ అహ్మద్ ఎన్నికయ్యాడు. బంగ్లాలో నెలకొన్న రాజకీయ సంక్షోభంతో నజ్ముల్ హసన్ దేశం విడిచి పారిపోవడంతో అతడిస్థానంలో అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

జపాన్ ఓపెన్‌లో సతీష్ ఓటమి

యోకొహామా: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ సతీష్‌కుమార్‌కు చుక్కెదురైంది. గురువారం జరిగిన రెండోరౌండ్‌లో సతీష్ 21-18, 18-21, 8-21తో కాంటాఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడాడు.

గుకేష్‌కు తప్పిన ఓటమి

సెయింట్ లూయిస్(యూఎస్): సింక్యుఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో మూడో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ త్రుటిలో ప్రజ్ఞానంద చేతిలో ఓటమిని తప్పించుకొని డ్రాతో గట్టెక్కాడు. ఇతర గేముల్లో అబ్దుసతోరోవ్‌పై కరువానా, అనీష్ గిరిపై నెపోమ్నియాచి గెలిచారు. అలీరెజా-లగ్రావ్, లిరెన్-వెస్లీతో గేమ్‌లు డ్రా అయ్యాయి.

బోల్ట్, ఫెల్ప్స్‌ను నిషేధించలేదే?

నటి తాప్సీ ఫైర్



న్యూఢిల్లీ: అల్జీరియాకు చెందిన వివాదాస్పద మహిళా బాక్సర్ ఇమానె ఖెలీఫ్‌కు బాలీవుడ్ నటి తాప్సీ పన్ను మద్దతు పలికింది. ఇటీవలి ఒలింపిక్స్‌లో తన లింగత్వంపై తీవ్ర విమర్శలు ఎదురైన విషయం తెలిసిందే. 'ఇమానెకు పుట్టుకతోనే టెస్టోస్టిరాన్ హార్మోన్లు అధిక స్థాయిలో ఉన్నాయి. ఇది ఆమె తప్పు కాదే! తనకు తానుగా సామర్థ్యం పెంచుకునేందుకు ఇంజెక్షన్ తీసుకోలేదు కదా? ఇదే సమస్యతో నిషేధానికి గురైన అథ్లెట్ (ద్యూతీచంద్) జీవితంపై నేను గతంలో సినిమా కూడా చేశాను. అయినా స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్, స్విమ్మర్ మైకేల్ ఫెల్ప్స్‌లాంటి వారు ఇతరులతో పోలిస్తే శారీరకంగా కాస్త ప్రత్యేకంగా ఉంటారు. ఫెల్ప్స్‌కు ఇతరులకంటే పాదం పెద్దదిగా ఉంటుంది. మరి వారినెందుకు అప్పట్లో నిషేధించలేదు?' అని తాప్సీ ప్రశ్నించింది.

స్వర్ణంపై నాగర్ నజర్

పారిస్ పారాలింపిక్స్



కృష్ణ నాగర్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

భారత పారా షట్లర్ కృష్ణ నాగర్ జీవితం వడ్డించిన విస్తరి కాదు. చిన్ననాటినుంచి అతడి జీవితం సవాళ్ల మయం. ఆ సవాళ్ల నుంచి పాఠాలు నేర్చుకున్నాడు. తద్వారా కష్టాలకు ఎదురొడ్డి నిలవడం అలవాటు చేసుకున్నాడు. ఎత్తు తక్కువగా ఉన్నాడంటూ అతడిని అంతా హేళన చేసేవారు. ఆ అవహేళనలకు నాగర్ ఎప్పుడూ కుంగిపోలేదు. ఆ మరుగుజ్జుతనంతో సాధించిన విజయాలతో వారి నోళ్లు మూయించాడు. తొలి నాళ్లలో నాగర్ ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అయితే అవి అతడిలోని క్రీడా జిజ్ఞాసకు అడ్డుకాలేదు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, లాంగ్‌జంప్‌తోపాటు స్ప్రింట్‌లో ఈవెంట్లలో నాగర్‌కు ప్రవేశం ఉంది. బ్యాడ్మింటన్‌తో అతడి పయనం 2017లో జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఆరంభమైంది. అనతి కాలంలోనే అది పారా ఒలింపిక్స్‌కు దూసుకు పోయింది. 2021 అరంగేట్ర టోక్యో ఒలింపిక్స్‌ను కృష్ణ నాగర్ చిరస్మరణీయం చేసుకున్నాడు. ప్రమోద్ భగత్ తర్వాత పారా లింపిక్స్‌లో పసిడి పతకం సొంతం చేసుకున్న రెండో భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం ఎస్‌హెచ్6 విభాగంలో తన స్వర్ణాన్ని నిలబెట్టుకోవడమే ధ్యేయంగా పారిస్ పారాలింపిక్స్‌లో అతడు బరిలో దిగుతున్నాడు. 'ఇవి నాకు రెండో పారా విశ్వక్రీడలు. మెగా ఈవెంట్ కావడంతో ఒకింత ఉత్కంఠగానూ ఉంది' అని 25 ఏళ్ల నాగర్ చెప్పాడు. ఎస్‌హెచ్6 అంటే పొట్టిగా ఉన్నవారు తలపడే విభాగం. 'ప్రతిష్ఠాత్మక క్రీడల్లో రెండోసారి పాల్గొనడం నిజంగా అద్భుతం..అదృష్టం. మరోసారి పసిడి పతకాన్ని సాధించి నాపై అంచనాలను నిలబెట్టుకోవడం ప్రథమ కర్తవ్యం' అని వివరించాడు. నాలుగు అడుగుల ఆరు అంగుళాల నాగర్ ..పారిస్‌లో తలపడుతున్న 13 మంది పారా షట్లర్లలో ఒకడు.

టోక్యో అపూర్వ విజయం అనంతరం అతడి జీవితం సాఫీగా సాగలేదు. గాయం నాగర్ బ్యాడ్మింటన్ కెరీర్ పురోగతికి అడ్డుపడితే..తల్లి మరణం రూపంలో అతడికి మరో ఊహించని పరిణామం ఎదురైంది. అయితే మనోధైర్యానికి మారుపేరైన నాగర్ ఆ రెండు షాక్‌లనుంచి త్వరగానే కోలుకున్నాడు. 'టోక్యో క్రీడల తర్వాత పాదానికి గాయం అయ్యింది. అలాగే కొన్ని ఇతర సమస్యలూ వెంటాడాయి. ఇప్పుడు అన్నీ సర్దుకున్నాయి. ఆట గాడిలో పడింది. భిన్న పరిస్థితుల్లో, విభిన్న ప్రత్యర్థులకు దీటుగా ఎలా బదులివ్వాలనే అంశాలపై దృష్టి సారించా. వేగంగా లేదా మందకొడిగా ఉన్న కోర్టుల్లో పాజిటివ్ దృక్పథంతో ఆడుతూ సురక్షితంగా స్మాష్‌లు కొట్టాల్సి ఉంటుంది' అని నాగర్ తెలిపాడు. జైపూర్‌లో యదువేంద్ర సింగ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న నాగర్..గత ఫిబ్రవరిలో థాయ్‌లాండ్‌లో జరిగిన పారా వరల్డ్ బ్యాడ్మింటన్‌చాంపియన్‌షిప్స్‌లో టైటిల్ దక్కించుకున్నాడు. ఇక..డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించడంతో స్టార్ షట్లర్ ప్రమోద్ భగత్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఫలితంగా పారిస్ క్రీడలకు అతడు దూరమయ్యాడు. దాంతో భారత్‌నుంచి టైటిల్ నిలబెట్టుకొనే ఏకైక షట్లర్‌గా నాగర్ నిలిచాడు.

వచ్చే జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్

మహిళల జట్ల మధ్య పరిమిత ఓవర్ల సిరీస్

షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్ షెడ్యూల్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) గురువారం విడుదల చేసింది. దీనికోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న టీమిండియా 2025, జూన్ 20 నుంచి ఆగస్టు 4 వరకు ఈ సిరీస్ ఆడనుంది. ఇరు జట్ల మధ్య చివరిసారి 2021లో జరిగిన ఐదు టెస్టుల సిరీస్ 2-2తో డ్రాగా ముగిసింది. తాజా సిరీస్‌లో తొలి టెస్టుకు లీడ్స్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఆ తర్వాత జూలై 2-6న రెండో టెస్టు బర్మింగ్‌హామ్, జూలై 10-14న మూడో టెస్టు లార్డ్స్‌లో, నాలుగో టెస్టు జూలై 23-27న మాంచెస్టర్‌లో, ఆఖరి టెస్టు జూలై 31-ఆగస్టు 4న ది ఓవల్‌లో జరుగుతాయి.

హర్మన్‌ప్రీత్ సేనతో..: భారత పురుషుల జట్టు టెస్టు సిరీస్ ఆడతున్న సమయానే హర్మన్‌ప్రీత్ సేనతో ఇంగ్లండ్ మహిళల జట్టు 8 పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో భాగంగా జూన్ 28 నుంచి జూలై 12 వరకు ఐదు టీ20ల సిరీస్.. జూలై 16 నుంచి జూలై 22 వరకు మూడు వన్డేల సిరీస్ జరుగనున్నాయి. ఇదిలావుండగా.. 2026లో ప్రఖ్యాత లార్డ్స్ మైదానం తొలిసారిగా మహిళల టెస్టు క్రికెట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఏకైక టెస్టు సిరీస్ ఇక్కడ జరుగనుంది.

ఎల్బ్రస్‌పై తెలుగు మహిళ



ఆంధ్రజ్యోతి (గల్ఫ్ ప్రతినిధి): ఐరోపాలోని ఎత్తయిన పర్వత శిఖరం మౌంట్ ఎల్బ్రస్‌ను గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన బండారు అన్నపూర్ణ విజయవంతంగా అధిరోహించింది. ప్రస్తుతం సౌదీ అరేబియాలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అన్నపూర్ణ నాలుగురోజుల కిందట ఈ ఘనత సాధించింది. 5,642 మీటర్ల పొడవైన ఈ శిఖరం ప్రపంచంలోని 10వ ఎత్తయిన పర్వతం.

ఆధిక్యంలో ఇంగ్లండ్

మాంచెస్టర్: శ్రీలంకతో తొలి టెస్టులో ఇంగ్లండ్ స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. గురువారం రెండోరోజు వెలుతురులేమితో ఆట ముగిసేసరికి ఇంగ్లండ్ 259/6 స్కోరు చేసింది. జేమీ స్మిత్ (72 బ్యాటింగ్), బ్రూక్ (56) అర్ధసెంచరీలతో రాణించారు. లంక తొలి ఇన్నింగ్స్‌లో 236 రన్స్ చేసింది. మిలన్ రత్నాయకె (72) టెస్టు అరంగేట్రంలో ఎక్కువ రన్స్ చేసిన 9వ నెంబర్ బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు.

శాట్జ్ కొత్త లోగో ఆవిష్కరణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్జ్) కొత్త లోగోను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌కు కొత్త లోగో విశిష్టతను ప్రభుత్వ క్రీడా శాఖ సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి, శాట్జ్ ఛైర్మన్ శివసేనా రెడ్డి వివరించారు. ఐదు వర్ణాలతో ఒలింపిక్ జ్యోతి, క్రీడారంగ ప్రాముఖ్యాన్ని ప్రతిబింబించేలా కొత్త లోగోను రూపొందించారు. తెలంగాణ నూతన క్రీడా చరిత్రకు ఇది నాంది కావాలని రేవంత్ ఆకాంక్షించారు. లోగో ఆవిష్కరణలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శాట్జ్ వీసీ-ఎండీ సోనీబాలాదేవి కూడా పాల్గొన్నారు.

రిజ్వాన్, షకీల్ శతకాలు

పాక్ 448/6 డిక్లేర్

రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మహమ్మద్ రిజ్వాన్ (171 నాటౌట్), సౌద్ షకీల్ (141) శతకాలతో అదరగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 158/4తో రెండోరోజైన గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్.. 6 వికెట్లకు 448 పరుగుల భారీస్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఐదో వికెట్‌కు రిజ్వాన్-షకీల్ జోడీ 240 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. షోరిఫుల్, హసన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బంగ్లా ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 12 ఓవర్లలో 27 పరుగులు చేసింది. బంగ్లా మరో 421 పరుగులు వెనుకబడి ఉండగా, క్రీజులో షాద్‌మన్ (12 బ్యాటింగ్), జకీర్ హసన్ (11 బ్యాటింగ్) ఉన్నారు. మరోవైపు టెస్టు కెరీర్ తొలి 20 ఇన్నింగ్స్‌లోనే అత్యధిక పరుగులు (1108) సాధించిన తొలి ఆసియా బ్యాటర్‌గా షకీల్ రికార్డు నెలకొల్పాడు. గతంలో వినోద్ కాంబ్లీ (1056) పేరిట ఈ రికార్డు ఉండేది. అలాగే పాక్ తరపున వేగంగా వెయ్యి పరుగులు పూర్తిచేసిన బ్యాటర్‌గా సయీద్ అహ్మద్‌తో సమంగా నిలిచాడు.

27 నుంచి ప్రీమియర్ ఎనర్జీస్ ఐపీఓ

ఇష్యూ ధరల శ్రేణి రూ.427-450


రూ.2,830 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన సోలార్ సెల్స్, మాడ్యూళ్ల తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 27న ప్రారంభమై 29న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.2,830 కోట్ల వరకు సమీకరించనున్న కంపెనీ.. ఇష్యూ ధరల శ్రేణిని రూ.427-450గా నిర్ణయించింది. ఈ ఐపీఓలో పెట్టుబడి పెట్టాలనుకునే రిటైల్ మదుపరులు కనీసం రూ.14,850 విలువ చేసే 33 షేర్ల కొనుగోలుకు బిడ్ వేయాల్సి ఉంటుంది. బిడ్ సైజును 33 షేర్ల చొప్పున పెంచుకునే వీలుంటుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,291.4 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయడంతో పాటు ప్రస్తుత ప్రమోటర్, వాటాదారులకు చెందిన రూ.1,539 కోట్ల విలువైన 3.42 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు కంపెనీ ఎండీ చిరంజీవ్ సింగ్ సలూజా, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అడపా శ్రీనివాస్ తెలిపారు.

తాజా ఈక్విటీ జారీ ద్వారా సమకూరే నిధుల్లో రూ.968.6 కోట్లను కంపెనీ తన అనుబంధ విభాగమైన ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ లో పెట్టుబడిగా పెట్టనుందని తెలిపారు. ఈ అనుబంధ విభాగం హైదరాబాద్‌లో నిర్మిస్తున్న 4 గిగావాట్ సోలార్ పీవీ టాప్‌కాన్ సెల్, 4 గిగావాట్ సోలార్ పీవీ టాప్‌కాన్ మాడ్యూల్ తయారీ ప్లాంట్ కోసం ఈ నిధులను వినియోగించుకోనుంది.

గత ఏడాది ఆదాయం రూ.3,143 కోట్లు

సెప్టెంబరు 3న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే వీలుంది. లిస్టింగ్ అనంతరం కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20,000 కోట్లకు పైగా ఉండే అవకాశం ఉంది. సోలార్ రంగంలో 29 ఏళ్ల అనుభవం కలిగిన ప్రీమియర్ ఎనర్జీస్.. 2 గిగావాట్ల సోలార్ సెల్స్, 4.13 గిగావాట్ల సోలార్ మాడ్యూళ్ల వార్షిక ఇన్‌స్టాలేషన్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం కంపెనీ ఐదు తయారీ యూనిట్లను కలిగి ఉంది. ఈ సంస్థ క్లయింట్ల జాబితాలో ఎన్‌టీపీసీ, టాటా పవర్ సోలార్ సిస్టమ్స్, పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్, మాధవ్ ఇన్‌ఫ్రా తదితర కంపెనీలున్నాయి. తన ఉత్పత్తులను భారత్‌లో విక్రయించడంతో పాటు అమెరికా, చైనా, దక్షిణకొరియా, హాంకాంగ్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, నేపాల్, మలేషియా దేశాలకు ఎగుమతి చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో కంపెనీ రూ.3,143 కోట్ల ఆదాయంపై రూ.231 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.



24,800 ఎగువకు నిఫ్టీ

147 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

బీఎస్ఈ సెన్సెక్స్ వరుసగా మూడో రోజూ లాభపడింది. గురువారం ట్రేడింగ్‌లో సూచీ 147.89 పాయింట్లు పెరిగి 81,053.19 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 41.30 పాయింట్ల వృద్ధితో రెండు వారాల గరిష్ఠ స్థాయి 24,811.50 వద్ద స్థిరపడింది. సూచీ లాభపడటం వరుసగా ఇది ఆరో రోజు. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కమోడిటీ, టెలికాం, కన్స్యూమర్ రంగ షేర్లలో కొనుగోళ్లు జరపడం నేటి ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 లాభపడ్డాయి. ఎయిర్‌టెల్, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ఒక శాతానికి పైగా రాణించాయి. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.67 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో టెలికాం, కమోడిటీస్ ఒక శాతానికి పైగా బలపడ్డాయి.

పవర్ మెక్ బోనస్ షేర్ల జారీ

వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయనునున్నట్లు హైదరాబాద్‌కు చెందిన మౌలిక, నిర్మాణ రంగ కంపెనీ పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ గురువారం ప్రకటించింది. కంపెనీ షేర్‌హోల్డర్లు తాము కలిగి ఉన్న రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు బోనస్‌గా మరో షేరు లభించనుంది. అయితే, ఈ ప్రతిపాదనకు వచ్చే నెల 27న నిర్వహించనున్న కంపెనీ 25వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో వాటాదారుల అనుమతి కోరనున్నట్లు పవర్ మెక్ వెల్లడించింది. బోనస్ షేర్ల జారీకి అర్హులైన షేర్‌హోల్డర్ల రికార్డు తేదీని కంపెనీ సెప్టెంబరు 28గా ఖరారు చేసింది.

ఐదేళ్లలో బంగారం రుణ మార్కెట్ రూ.14.19 లక్షల కోట్లకు

పీడబ్ల్యూసీ అంచనా



న్యూఢిల్లీ: దేశంలో బంగారం రుణాల సంఘటిత మార్కెట్ సైజు ఐదేళ్లలో రెట్టింపు కానుందని పీడబ్ల్యూసీ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో సంఘటిత గోల్డ్ లోన్ మార్కెట్ గణనీయ వృద్ధితో రూ.7.1 లక్షల కోట్ల స్థాయికి చేరుకుందని నివేదిక వెల్లడించింది. తదుపరి ఐదేళ్లలో (2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి) ఈ మార్కెట్ 14.85 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి (సీఏజీఆర్)తో రూ.14.19 లక్షల కోట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేసింది. భారతీయులకు బంగారంపై మోజు ఎక్కువే. దేశీయ కుటుంబాలు దాదాపు రూ.126 లక్షల కోట్ల విలువ చేసే 25,000 టన్నుల బంగారాన్ని కలిగి ఉంటాయని పీడబ్ల్యూసీ తన నివేదికలో ప్రస్తావించింది. కాగా, లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తి, తాకట్టులో ఉన్న బంగారం వేలం తదితర అంశాలకు సంబంధించి ఆర్‌బీఐ కఠిన నిబంధనల కారణంగా వచ్చే రేండేళ్లు గోల్డ్ లోన్ మార్కెట్ వృద్ధి అంతంత మాత్రంగానే ఉండవచ్చని అభిప్రాయపడింది. గోల్డ్ లోన్ మార్కెట్లో దక్షిణ భారతానిదే మెజారిటీ వాటా అని, మొత్తం పసిడి రుణ బకాయిల్లో 79.1 శాతం వాటా కలిగి ఉందని పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది.

పసిడి బాండ్లకు ప్రభుత్వం స్వస్తి!

మోదీ సర్కారు ఇకపై పసిడి బాండ్లను జారీ చేయకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మార్కెట్ నుంచి నిధుల సమీకరణ ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆఫర్ చేస్తున్న ఆర్థిక సాధనాల్లో పసిడి బాండ్లు ఒకటి. ఇన్వెస్టర్లకు భారీగా లాభాలు పంచుతున్నప్పటికీ, ప్రభుత్వానికి మాత్రం వీటి జారీ ద్వారా నిధుల సమీకరణ అత్యంత వ్యయంతో కూడిన ప్రక్రియగా మారింది. ఇందుకు తోడు పథకం సంక్లిష్టత కూడా ప్రభుత్వ విముఖతకు కారణమని తెలిసింది. దేశంలోకి పసిడి దిగుమతులను తగ్గించడంతో పాటు డిజిటల్ రూపంలో పసిడి కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు 2015 నవంబరులో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం తరఫున భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పటివరకు 67 విడతల్లో గోల్డ్ బాండ్లను జారీ చేయగా.. ఇన్వెస్టర్లు వీటిల్లో మొత్తం రూ.72,274 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

అదానీ పవర్ చేతికి లాంకో అమర్‌కంటక్ పవర్ ప్లాంట్


రూ.4,101 కోట్లకు కొనుగోలు

ఆమోదం తెలిపిన ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్

న్యూఢిల్లీ: లాంకో అమర్‌కంటక్ పవర్ లిమిటెడ్ (ఎల్ఏపీఎల్) కొనుగోలు కోసం అదానీ పవర్ సమర్పించిన ప్రణాళికకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలిపింది. కార్పొరేట్ దివాలా రిజొల్యూషన్ ప్రక్రియ (సీఐఆర్‌పీ) ప్రక్రియలో భాగంగా లాంకో అమర్‌కంటక్ కొనుగోలుకు అదానీ పవర్ అప్‌ఫ్రంట్ రూపేణా రూ.4,101 కోట్లు చెల్లించనుంది. వంద శాతం నగదు రూపేణా ఈ మొత్తాన్ని చెల్లించటం ద్వారా ఎల్ఏపీఎల్‌లో మొత్తం వాటాను అదానీ పవర్ చేజిక్కించుకోనుంది. ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు జారీ చేసిన తేదీ నాటి నుంచి 60 రోజుల్లోపు అంటే అక్టోబరు 20 నాటి కల్లా ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని గురువారం నాడు అదానీ పవర్ తెలిపింది. చత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లా, పథాడీ గ్రామంలో ఒక్కోటి 300 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను లాంకో అమర్‌కంటక్ నిర్వహిస్తోంది. ఈ ప్లాంట్ తొలి దశలో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను హరియాణా, మధ్యప్రదేశ్ డిస్కమ్స్‌కు విక్రయిస్తోంది. ఇందుకోసం ఆ రాష్ట్రాల డిస్కమ్స్‌తో దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను కూడా కుదుర్చుకుంది. అలాగే ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సరఫరాల కోసం కోల్ ఇండియా అనుబంధ సంస్థ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్)తో దీర్ఘకాలిక ఇంధన సరఫరా ఒప్పందాలను కుదుర్చుకుంది. కాగా రెండో దశలో ఒక్కోటి 660 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అనుమతులను ఎల్ఏపీఎల్ ఇప్పటికే అందుకుంది.

మార్కెట్లోకి ఆడి సరికొత్త క్యూ8

ప్రారంభ ధర రూ.1.17 కోట్లు



ఆడి ఇండియా మార్కెట్లోకి సరికొత్త ఆడి క్యూ8 విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.1,17,49,000 (ఎక్స్‌షోరూమ్). 3.0 లీటర్ టీఎఫ్ఎస్ఐ ఇంజన్‌తో కూడిన ఈ కారు కేవలం 5.6 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఆర్21 గ్రాఫైట్ గ్రే అల్లాయ్ వీల్స్, 360 డిగ్రీ వ్యూ కెమెరా, 4-జోన్ క్లైమెట్ కంట్రోల్ సిస్టమ్‌తో కూడిన ఈ కారు నాలుగు రంగుల్లో అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది పండగ సీజన్‌లో కంపెనీ విక్రయాలు 50 వేల మార్కును అధిగమిస్తాయని అంచనా వేస్తున్నట్లు ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ఢిల్లాన్ వెల్లడించారు.



- హీరో మోటోకార్ప్ మార్కెట్లోకి సరికొత్త హీరో గ్లామర్ 2024ను తీసుకువచ్చింది. ఆల్ న్యూ కలర్ ట్రిమ్, బ్లాక్ మెటాలిక్ సిల్వర్‌తో కూడిన ఈ బైక్‌ను కంపెనీ బ్రాండ్ అంబాసిడర్ రామ్ చరణ్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రంజివిజిత్ సింగ్ విడుదల చేశారు. రెండు వేరియంట్స్ డ్రమ్, డిస్క్‌తో అందుబాటులో ఉండనున్న ఈ బైక్ ధరలు వరుసగా రూ.83,598, రూ.87,598 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.



- టీవీఎస్ మోటార్ కంపెనీ.. ఆల్ న్యూ టీవీఎస్ జూపిటర్ 110 స్కూటర్‌ను విడుదల చేసింది. నెక్స్ జెనరేషన్ లైట్‌వెయిట్ కాంపాక్ట్ ఫ్యూచరిస్టిక్ హై-పెర్ఫార్మెన్స్ ఇంజన్, ఐజీఓ అసిస్ట్, డబుల్ హెల్మెట్ స్పేస్‌తో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చింది. 113.3 సీసీ, సింగిల్ సిలిండర్, 4 స్ట్రోక్ ఇంజన్ ఈ స్కూటర్ ప్రత్యేకతలు. డ్రమ్, డ్రమ్ అల్లాయ్, డ్రమ్ ఎస్ఎక్స్‌సీ, డిస్క్ ఎస్ఎక్స్‌సీ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న జూపిటర్ 110 ప్రారంభ ధర రూ.73,700.

బిజినెస్

హైదరాబాద్‌లో అహెడ్ కార్యాలయం

2025 చివరి నాటికి మరో 500 నియామకాలు

న్యూఢిల్లీ: క్లౌడ్, డేటా, ఇంజనీరింగ్ సొల్యూషన్స్ కంపెనీ అహెడ్.. హైదరాబాద్‌కు తన కార్యకలాపాలు విస్తరించింది. గత ఏడాది గురుగ్రామ్‌లో డెలివరీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన కంపెనీ తాజాగా హైదరాబాద్‌కు కార్యకలాపాలు విస్తరించిందని అహెడ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, ఎండీ ప్రవీణ్ గ్రోవర్ తెలిపారు. ప్రధానంగా బడా క్లయింట్స్‌కు సేవలందించే ఉద్దేశంతో పాటు భారత్‌లో వ్యూహాత్మకంగా వృద్ధి అవకాశాలను చేజిక్కించుకునేందుకు ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా వచ్చే ఏడాది చివరి నాటికల్లా మరో 500 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంటర్‌లో 250 మంది ఉద్యోగులుండగా గురుగ్రామ్‌లో 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు గ్రోవర్ వెల్లడించారు.

- ఇన్నోవేటివ్, సస్టేనబుల్ లగేజ్ బ్రాండ్ అప్పర్‌కేస్.. సిరీస్ బీ రౌండ్‌లో భాగంగా 90 లక్షల డాలర్లు (సుమారు రూ.75 కోట్లు) సమీకరించింది. గ్లోబల్ వెంచర్ క్యాపిటల్ సంస్థ యాక్సెల్ నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు వెల్లడించింది. వచ్చే మూడేళ్లలో రూ.500 కోట్ల రెవెన్యూతో పాటు 250 ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్‌ను ఏర్పాటు చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.
- వ్యాపారుల కోసం యాక్సిస్ బ్యాంక్.. నియో ఫర్ మర్చంట్స్ పేరుతో వన్ స్టాప్ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. వీసా, మింట్‌ఓక్‌తో కలిసి ఈ సమగ్ర మొబైల్ అప్లికేషన్ సేవలను తీసుకువచ్చింది. వ్యాపారులు ఈ మొబైల్ యాప్ ద్వారా చెల్లింపులు, లావాదేవీల నివేదికలు, సర్వీస్ రిక్వెస్ట్ వంటి వాటిని చేసుకునే వీలుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,870 ▼	66,800 ▼	92,000 ▲
ముంబై	71,599 ▼	65,585 ▼	84,820 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ


హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	113
వరంగల్	107	గుంటూరు	110
కరీంనగర్	107	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	102
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

స్వయం సమృద్ధి సాధించేలా పంచాయతీలను అభివృద్ధి చేయాలి

» కీలక విభాగాల ఉన్నతాధికారులతో గవర్నర్



హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వయం సమృద్ధి సాధించేలా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని అధికారులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. రాష్ట్ర నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కీలక విభాగాల ఉన్నతాధికారులతో రాజ్‌భవన్‌లో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయా విభాగాల పనితీరు, సాధించిన విజయాలు, కేంద్ర ప్రభుత్వ నిధుల సహకారంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని విభాగాల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో తమ శాఖ పనితీరును గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. అన్ని అంశాల్లో స్వయం సమృద్ధి సాధించి మోడల్ గ్రామ పంచాయతీలుగా సేవలు అందించే వాటిని ఎంపిక చేసి అభివృద్ధి చేయాలన్నారు. ఆయా విభాగాల పనితీరును గవర్నర్ అభినందించారు. మునిసిపల్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, గిరిజన, పర్యాటక, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు.

మాదకద్రవ్యాల కట్టడికి పటిష్ఠ చర్యలు: జూపల్లి

హైదరాబాద్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సమాజానికి హానికరమైన మాదక ద్రవ్యాల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిద్దిడానికి సమైక్యంగా కృషి చేద్దామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం-సమాజాన్ని మేలు కొలుపుదాం' పేరిట గురువారం రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రజా నాట్యమండలి చేపట్టిన ప్రచార కళాజాత యాత్రను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ మార్పులోనూ, నవ సమాజ నిర్మాణంలోనూ యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ కమిటీల్లో చేరి సైనికులుగా పనిచేస్తూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

పట్టణ ప్రాంతాలుగా శివారు పంచాయతీలు

» మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అవుటర్ రింగ్ రోడ్డుకు లోపల, బయట ఇరువైపులా ఉన్న గ్రామాలన్నింటినీ పట్టణ ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. మున్సిపాలిటీల అంచున ఉన్న పంచాయతీలను కూడా విలీనం చేస్తామని చెప్పారు. ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్ లోపల హైదరాబాద్ సిటీ వరకు ఉన్న 23 గ్రామ పంచాయతీను విలీనం, పునర్వ్యవస్థీకరించేందుకు మార్గదర్శకాలు రూపొందించేందుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం గురువారం తొలిసారిగా సమావేశం అయింది. ఉపసంఘం చైర్మన్ శ్రీధర్‌బాబుతో పాటు సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతోపాటు, ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్ గౌడ్, శివారు మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీజేఎస్ పోటీ

» మంత్రి పదవిపై చర్చ జరగలేదు: ఎమ్మెల్సీ కోదండరాం

హైదరాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థ ఎన్నికలలో టీజేఎస్ పోటీ చేస్తుందని ఎమ్మెల్సీ కోదండరాం ప్రకటించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరిస్తానని, ప్రభుత్వ పెద్దలతో మంత్రి పదవిపై ఎలాంటి చర్చ జరగలేదని తెలిపారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ విషయంలో రాష్ట్ర కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడం సాహసోపేత నిర్ణయమని మెచ్చుకున్నారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డుల పంపిణీ జరగలేదని అందువల్లే రుణమాఫీలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన నాయకులే నేడు రుణమాఫీపై మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు.

డిస్కమ్‌లకు రూ.3175 కోట్ల సహాయం

» గతేడాది నిర్వహణ నష్టాల్లో 50 శాతం సర్దుబాటు

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లకు రూ.3,175 కోట్ల సహాయాన్ని విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉదయ్ (ఉజ్వల్ డిస్కమ్ అస్యూరెన్స్ యోజన) పథకం కింద 2015-16 నుంచి 2019-20 మధ్య డిస్కమ్‌ల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం సహాయం అందించాలి. ఇందులో భాగంగా 2019-20 ఏడాది నష్టాల్లో 50 శాతాన్ని భరిస్తామని గత ప్రభుత్వం ఒప్పందంపై సంతకం చేసింది. అయితే నిధులను మాత్రం విడుదల చేయలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిస్కమ్‌ల నష్టాలను పరిగణనలోకి తీసుకొని, ఈ నిధులను విడుదల చేసింది. 2023-24లో దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్) రూ.4,909.53 కోట్లు, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్) రూ.1,441.18 కోట్లు కలుపుకొని రూ.6,350.71 కోట్ల నష్టాలను మూటగట్టుకున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇందులో 50 శాతం రూ.3,175.36 కోట్లను విడుదల చేస్తూ ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ గురువారం జీవో జారీ చేశారు.

ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేటాయించిన 2022 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత సర్కారు సబ్ కలెక్టర్ల పోస్టులను రద్దు చేయగా.. ఇటీవలే ప్రభుత్వం వాటిని పునరుద్ధరించి, నోటిఫై చేసిన విషయం విదితమే. పోస్టింగులు పొందిన వారంతా ప్రస్తుతం ఉత్తరాఖండ్ ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. శ్రద్ధా శుక్లాకు కాగజ్‌నగర్, కొప్పిశెట్టి కిరణ్మయికి బాన్సువాడ, మలెంపాటి అమిత్‌నారాయణ్‌కు మిర్యాలగూడ, వికాస్ మహతోకు బోధన్, ఉమాశంకర్ ప్రసాద్‌కు తాండూరు, మయాంక్ సింగ్‌కు కాటారం, యువరాజ్ మర్మత్‌కు ఉట్నూరు సబ్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవో జారీ చేశారు. వీరంతా ఆర్డీవో నిర్వర్తించే బాధ్యతలన్నీ చూడనున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల వాహన భత్యం 17 నెలలుగా పెండింగ్‌లో ఉందని.. బకాయిలను వెంటనే ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని రాష్ట్ర ఎంపీడీఓల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో ఆయన్ను కలిసి ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు టి.శ్రీనివాస రాజు తదితరులు వినతిపత్రం అందజేశారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

» సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సీపీఎస్ అమల్లోకి వచ్చిన ఆగస్టు 23వ తేదీ చీకటి రోజని, ప్రజా పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. అది అమలు చేయకపోతే తెలంగాణలో ఉద్యోగుల భవితకు ఉరేనని.. శుక్రవారం నిర్వహించే బ్లాక్‌డేలో అన్నీ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. అలాగే సీపీఎస్ జీవో నంబరు 28 ప్రతులను దగ్ధం చేయాలని కోరారు.

నేడు కేన్స్ యూనిట్‌ను ప్రారంభించనున్న సీఎం

ఆదిభట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగర కలాన్‌లో కేన్స్ సంస్థ యూనిట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్ కుమార్ పాల్గొంటారు. సెమీ కండక్టర్ల తయారీలో ప్రపంచ అగ్రగామి సంస్థ కేన్స్ టెక్నాలజీ.. ఇక్కడ తన అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్ యూనిట్ నిర్మాణాన్ని పూర్తిచేసింది. రూ2,800కోట్ల పెట్టుబడితో 46ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. ఫ్యాక్స్‌కాన్ సంస్థ తర్వాత కేన్స్ ఏర్పాటుతో కొంగరకలాన్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందనుంది.

ఎస్సీల వర్గీకరణ అమలుకు ఉప కమిటీ!

(మొదటిపేజీ తరువాయి)

అవుతుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఒక బృందం ఆయన నివాసంలో కలిసింది. రేవంత్ ప్రకటన పట్ల సంతోషం వ్యక్తం చేసింది. వీలైనంత త్వరలో వర్గీకరణను అమలు పర్చాలని మంద కృష్ణ కోరారు. ఈ సందర్భంగా, సీఎం రేవంత్‌రెడ్డి ఉప కమిటీ విషయాన్ని వెల్లడించారు. వీలైనంత త్వరగా ప్రక్రియను ముగిస్తామని చెప్పారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు కూడా వర్గీకరణకు అనుకూలంగా స్పందించేలా చూడాలని మంద కృష్ణ కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ, త్వరలో తాము తమ జాతీయ నేతల వద్దకు ఒక ప్రతినిధి బృందాన్ని పంపుతామని తెలిపారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎంపీ పసునూరి దయాకర్ తదితరులున్నారు.

శ్రీధర్‌బాబుతో భేటీ

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంద కృష్ణ, మాజీ మంత్రి నర్సింహులు గురువారం మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాధ్యమైనంత త్వరలో వర్గీకరణను పూర్తి చేసి అమలు చేస్తామని వెల్లడించారు.

ఆ మెడికల్ కాలేజీలకు అనుమతివ్వండి

» కేంద్ర ఆరోగ్యశాఖ, ఎన్ఎంసీ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం వినతి

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, మహేశ్వరం, మెదక్, యాదాద్రిలో నూతనంగా ప్రారంభించతలపెట్టిన మెడికల్ కాలేజీలకు అనుమతి మంజూరు చేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అధికారులకు రాష్ట్రప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. డీఎంఈ వాణి, ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఇతర ఉన్నతాధికారులు బుధవారం ఢిల్లీకి వెళ్లి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. అనుమతి మంజూరుపై చర్చించారు. గతంలో ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సవరించుకున్నామని, అనుమతించాలని కోరారు. లోపాలుంటే సరిచేస్తామని, అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ విషయంలో కేంద్ర అధికారులు పలు ప్రశ్నలు సంధించగా అవగాహన ఉన్నంత వరకు సమాధానాలిచ్చినట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. తామిచ్చిన సమాధానాలకు సంతృప్తి చెందితే వారం రోజుల్లో మెడికల్ కళాశాలలకు అనుమతి మంజూరవుతుందన్నారు. లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ప్రాథమిక అనుమతి)వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం అండర్‌టేకింగ్ ఇవ్వాల్సి ఉంటుందని, తర్వాత పూర్తి స్థాయి అనుమతి లభిస్తుందన్నారు.

వాళ్లను నమ్ముకొని రోడ్డెక్కితే ఆయాసమే

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను లేదా వ్యవసాయ శాఖ అధికారులను కలవండి. పరిష్కారానికి వారు కృషి చేస్తారు. మీరు రోడ్డు ఎక్కడం ఎందుకు? ధర్నాలు చేయడం ఎందుకు? రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేశాం. మిగతావీ చేస్తాం' అని స్పష్టం చేశారు. 'వచ్చినోళ్లను కలుస్తున్నం. సమస్యలు విని పరిష్కరిస్తున్నం. అలా చేయకుంటే నిరసన, ధర్నా, రాస్తారోకోలకు దిగొచ్చు. ఎందుకీ కష్టం..?' అని రేవంత్ అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, రామారావు రైతులను దోచుకుతిన్నారని, మాయ, మోసం చేయాలన్నదే వాళ్ల ఆలోచన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దొంగలే ముసుగు వేసుకుని వస్తున్నారని.. 6 నెలల కింద బొంద పెట్టిన సన్నాసులను రైతులు మళ్లీ ఎలా రానిస్తున్నారని వ్యాఖ్యానించారు. పదేళ్లలో బీఆర్ఎస్ వాళ్లు ఇచ్చిందెంత? పది నెలల్లో తాము ఇచ్చినదెంత? అనేదానిపై అమర వీరుల స్థూపం వద్ద చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను గుప్పిట పట్టి, కొందరికే లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా విధానాలకు నిరసనగా దేశంలో అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయాల ఎదుట నిరసనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో రేవంత్ పాల్గొని మాట్లాడారు. ప్రజల వద్దకు వెళ్లి మోదీ పాలనలో వారి సంపద ఎలా దోపిడీకి గురైందో వివరించడమే తమ ప్రయత్నం అని తెలిపారు. పారిశ్రామికవేత్త అదానీ దోపిడీని లోక్‌సభలో రాహుల్ గాంధీ బయటపెట్టారని.. అయినా మోదీ తన పరివారాన్ని కాపాడుతున్నారని ఆరోపించారు. కాగా, రాష్ట్రంలో హామీ ఇచ్చిన ప్రకారం రుణ మాఫీ చేస్తుంటే.. రైతుల ముసుగులో కార్యకర్తలతో బీఆర్ఎస్ ధర్నాలు చేయిస్తూ రెచ్చగొడుతోందని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి పేరిట తప్పుడు రాతలు, కారుకూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరు నెలలకోసారైనా కేసీఆర్ ముఖం చూశారా? అని ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో బోర్లా పడుకునేవాడని.. తాను, తమ మంత్రులు రోజుకు 18 గంటలు గ్రామాల్లో తిరుగుతున్నామని చెప్పారు. పదేళ్ల తెలంగాణను తలుగబెట్టి నేడు.. పది నెలలు కాక ముందే తమ ప్రభుత్వం మీద పడి ఏడుస్తున్న తీరును కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో వివరించాలని సూచించారు. మోదీ, బీజేపీ, బీఆర్ఎస్‌పై కొట్లాడుదామని పిలుపునిచ్చారు. రాజీనామా చేయాల్సి వస్తుందని హరీశ్ కొత్త మాటలు చెబుతున్నడని, మైనంపల్లి సిద్దిపేట వెళ్లి మాట్లాడుదాం రమ్మంటే.. హరీశ్ అటు పోలేదన్నారు. తర్వాత జగ్గారెడ్డిని సిద్దిపేటకు పంపుతామని చెప్పారు.

తెలంగాణ తల్లి ఇప్పుడు గుర్తొచ్చిందా?

సోనియా జన్మదినం, తెలంగాణ ఏర్పాటుపై తొలి ప్రకటన వెలువడిన డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం పెట్టే బాధ్యత తమదన్నారు. బీఆర్ఎస్ సన్నాసులు పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడా పెట్టలేదని.. ప్రజలు ఓడించాక వారికి తెలంగాణ తల్లి విగ్రహం గుర్తొచ్చిందని ఎద్దేవా చేశారు. పది నెలల్లో తాము విగ్రహం పెట్టి.. ఆ తల్లికి నిజమైన వారసులమని నిరూపించుకుంటామని రేవంత్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అబద్ధాలను వ్యాపింపజేస్తున్నారని, మోదీ కూడా వాట్సప్ యూనివర్సిటీలో ఇలానే పెట్టారని, 400 సీట్లు వస్తాయని ప్రచారం చేశారని రేవంత్ పేర్కొన్నారు. బీజేపీకి 240 సీట్లకు మించవని తాను చెప్పినది నిజమైందన్నారు. ఒక్క లోక్‌సభ సీటైనా గెలవమని కేటీఆర్‌ను సవాల్ చేశానని.. ఆ పార్టీకి ఏడుచోట్ల డిపాజిట్ రాలేదని, 15 చోట్ల మూడో స్థానంలో నిలిచారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో 9 అసెంబ్లీ స్థానాలు కూడా రావని అన్నారు.





ఈడీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

జేపీసీపై బీఆర్ఎస్ విధానమేంటో చెప్పాలి

సెబీ-అదానీ కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలన్న ఇండియా కూటమి డిమాండ్ పట్ల బీఆర్ఎస్ విధానం ఏంటో చెప్పాలని కేసీఆర్‌ను సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. చిల్లర, మల్లర విషయాలపై స్పందించే ట్విట్టర్ టిల్లు (కేటీఆర్).. అదానీ దోపిడీపై ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. బీజేపీకి బీఆర్ఎస్ అనుకూలం అనేందుకు ఇది స్పష్టమైన సాక్ష్యమని పేర్కొన్నారు. మోదీ, అమిత్ షాను మెప్పించేందుకు అంతర్జాతీయ విమానాశ్రయానికి రాజీవ్‌గాంధీ పేరు తీస్తమంటున్నారని.. సచివాలయం ముందు విగ్రహం తొలగిస్తమంటున్నరని.. ఆ విగ్రహం మీద చేయి వేస్తే.. వీపు చింత పండు కాకపోతే తన పేరు మార్చుకుంటానని ప్రకటించారు. దేశ సంపదను కాపాడాలనుకునే ప్రతి యువతకు ఆదర్శం రాజీవ్ అని అందుకే ఆయన విగ్రహం పెడుతున్నామని చెప్పారు.

అదానీ, అంబానీలకు దోచి పెట్టే పనిలో మోదీ

మోదీ.. అదానీ, అంబానీలకు దోచి పెట్టే పనిలో ఉన్నారని, ప్రజాధనాన్ని లూటీ చేసినవారిని జైలుకు పంపేవరకు పోరాటం జరగాలని రేవంత్ అన్నారు. 'గుజరాత్‌కు చెందిన గాంధీ, పటేల్ పేరు చెబితే ప్రపంచమంతా నమస్కరిస్తుందని.. మోదీ, అమిత్ షా మాత్రం ప్రపంచాన్ని దోచుకునేవారిలా కనిపిస్తున్నారు. వారిద్దరు.. వారికిద్దరు (అదానీ, అంబానీ) అన్నట్టు పరిస్థితి మారింది. గుజరాత్‌కు చెందిన ఈ దుష్ట చతుష్టయం దేశాన్ని దోచుకుంటోంది. 67 ఏళ్లలో 16 మంది ప్రధానులు రూ.55 లక్షల కోట్ల అప్పు చేస్తే.. మోదీ రూ.1.15 లక్షల కోట్లు అప్పు చేశారు. ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడం తప్ప మోదీ చేసిందేం లేదు' అని ధ్వజమెత్తారు. సెబీ చైర్‌పర్సన్‌పై విచారణ జరపాలని, తక్షణమే ఆమెను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఈ ఆందోళన దేశం కోసం: భట్టి

ఈడీ కార్యాలయాల ఎదుట నిరసనలు కాంగ్రెస్ పార్టీ కోసం కాదని, దేశం కోసం, ప్రజల ఆస్తుల రక్షణ కోసమని భట్టి అన్నారు. మోదీ-అదానీ దోపిడీపై పాదయాత్ర సమయంలో రాహుల్‌గాంధీ వివరించారని చెప్పారు. నాడు ఎవరూ పెద్దగా స్పందించకున్నా ఇప్పుడు ఒక్కో విషయం బయటపడుతోందని వ్యాఖ్యానించారు. ప్రజల సంపదను వారికి కాకుండా చేస్తోన్న వ్యక్తులు, శక్తులపై కాంగ్రెస్ రాజీ లేని పోరాటం చేస్తుందన్నారు. నిరసనలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ నేతలు సయ్యద్ ఖుర్షీద్, దీపాదాస్ మున్షీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. కాగా, సీఎం రేవంత్ సహా వీరంతా గన్‌పార్కు నుంచి ర్యాలీగా వచ్చారు. మోదీ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు లాక్కున్నారు.

మంత్రివర్గ విస్తరణకు వేళాయె

» పీసీసీ అధ్యక్షుడి నియామకం కూడా!

» నేడు రాహుల్, ఖర్గేతో రేవంత్ టీమ్ భేటీ

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. శంషాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో వెళ్లిన రేవంత్‌తోపాటు.. రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ కూడా ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీకి బయల్దేరనున్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌తో.. రేవంత్, భట్టి, ఉత్తమ్ భేటీ కానున్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కేంద్ర ఎన్నికల కమిటీ శుక్రవారం మధ్యాహ్నం భేటీ అవుతున్నందున.. ఉదయమే తెలంగాణ నేతలతో సమావేశం జరగవచ్చునని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా.. మంత్రివర్గ విస్తరణలో ఆరుగురికి అవకాశం దక్కవచ్చునని భావిస్తున్నారు. ఈ మేరకు.. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, వాకాటి శ్రీహరి, ప్రేమసాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలూ నాయక్ లేదా రాంచందర్ నాయక్, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ తదితరుల పేర్లు ప్రస్తావనకు వస్తున్నాయి. కాంగ్రెస్‌లో చేరే ముందు మంత్రి పదవి ఇస్తారని వాగ్దానం చేశారు కనుక తన పేరు జాబితాలో ఉంటుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విశ్వసిస్తున్నారు. ఇక పీసీసీ అధ్యక్ష పదవికి బీసీల నుంచి మహేశ్ కుమార్ గౌడ్, మధు యాష్కీ.. ఎస్టీల నుంచి బలరాం నాయక్, ఎస్సీల నుంచి సంపత్ కుమార్, అడ్లూరి లక్ష్మణ్ రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వరంగల్‌లో రైతు కృతజ్ఞత సభకు, సచివాలయంలో రాజీవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాహుల్, ప్రియాంకలను రేవంత్ ఆహ్వానించనున్నారు.

ఒకే వేదికపై రేవంత్, చంద్రబాబు

» 25న 'శాంతి సరోవర్'కు ఇద్దరు సీఎంలు

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు త్వరలో ఒకే వేదికను పంచుకోనున్నారు. హైదరాబాద్‌లోని శాంతి సరోవర్ అకాడమీ ఫర్ బెటర్ వరల్డ్ సంస్థ 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 25వ తేదీ(ఆదివారం) ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుంది. హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. వారితో పాటు బ్రహ్మకుమారి సమాజం హైదరాబాద్ విభాగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.



బి.నర్సింగ్‌రావు



దిల్ రాజు

'గద్దర్' అవార్డుల విధివిధానాలకు కమిటీ

» చైర్మన్‌గా దర్శకుడు బి.నర్సింగ్‌రావు

» వైస్ చైర్మన్‌గా సినీ నిర్మాత దిల్ రాజు

» మరో 14 మంది సలహా సభ్యులు

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సినిమా రంగంలో గద్దర్ అవార్డుల కోసం విధివిధానాలు, నియమ నిబంధనలను ఖరారు చేసేందుకు ప్రముఖ చిత్ర దర్శకుడు బి.నర్సింగ్‌రావు చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) చేసిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ఈ కమిటీని సర్కారు ఏర్పాటు చేసింది. గద్దర్ అవార్డుల పేరును ఖాయం చేస్తూ దీనికి లోగోను కూడా కమిటీ సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఇదివరకు సినిమా రంగంలో నంది అవార్డులను ప్రదానం చేసేవారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నంది అవార్డుల పేరును మార్చి గద్దర్ అవార్డులుగా ప్రకటించింది. కమిటీ వైస్ చైర్మన్‌గా ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు (వి.వెంకటరమణారెడ్డి)ను, మెంబర్ కన్వీనర్లుగా టీజీఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కార్యదర్శిని నియమించింది. సలహా సభ్యులుగా సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, జయ జయహే తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ (అందె ఎల్లన్న), సినీ నిర్మాతలు తమ్మారెడ్డి భరద్వాజ, అల్లు అరవింద్, గద్దర్ కూతురు గుమ్మడి వి.వెన్నెల, సినీ నటుడు తనికెళ్ల భరణి, సినీ నిర్మాత డి.సురేశ్‌బాబు, సినీ గేయ రచయిత కె.చంద్రబోస్, సినీ నిర్మాత, నటుడు ఆర్.నారాయణమూర్తి, సినీ నేపథ్య గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, అల్లాణి శ్రీధర్, సినీ నిర్మాత సాన యాదిరెడ్డి, దర్శకుడు హరీశ్ శంకర్, బలగం సినిమా దర్శకుడు యెల్దండి వేణులను నియమించింది.

జనవరి నుంచి సన్న బియ్యం

చౌక ధర దుకాణాల్లో సబ్సిడీపై గోధుమలు.. బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తే చర్యలు

» డీలర్‌షిప్ రద్దు చేయడమే కాక జరిమానా

» పౌరసరఫరాలమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

» సన్నబియ్యంపై గతంలోనే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఇది అత్యంత కీలకమైనదని తెలిపారు. సచివాలయంలో గురువారం రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. సన్న బియ్యంతో పాటు గోధుమలను కూడా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. పీడీఎస్ బియ్యం అక్రమార్కుల పాలుకాకుండా చూడాలని.. కొందరు రేషన్ డీలర్లు నల్ల బజారుకు తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఇలాంటివారి డీలర్‌షిప్ రద్దు చేయడమే కాక జరిమానా విధిస్తామన్నారు. సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తేవాలని, వాటిని పరిష్కరించి ప్రోత్సాహకాలు ఇస్తామని స్పష్టం చేశారు. బలవర్ధక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్)లో కూడా నాణ్యత పాటించడం లేదని.. తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీలకు నాణ్యత లేని బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉత్తమ్ కోరారు. ప్రస్తుత కార్డులకు అదనంగా అంత్యోదయ కార్డుల సంఖ్యను పెంచే అవకాశాలను పరిశీలించాలని కోరారు. చౌక ధర డిపోల్లో 1,629 ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. శాఖలో సమస్యలపై నివేదిక నివేదిక ఇవ్వాలని మంత్రి కోరగా.. పది రోజుల్లో సమర్పిస్తామని కమిషనర్ డీఎస్ చౌహాన్ చెప్పారు. పొంగులేటి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన బియ్యంలో నాణ్యత లోపిస్తోందని, ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. విద్యార్థులకు సరిపడా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ప్రభుత్వం జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు మే నెల 23నే 'ఆంధ్రజ్యోతి' చెప్పింది. 'సంక్రాంతికి సన్న బువ్వ!' శీర్షికన కథనం ప్రచురించింది.



సచివాలయంలో జరిగిన సమీక్షలో మంత్రి ఉత్తమ్, మాజీ మంత్రి జానారెడ్డి

నెల్లికల్లు లిఫ్ట్‌కు భూసేకరణ పూర్తిచేయాలి

రైతులతో సంప్రదింపులు జరిపి నెల్లికల్ ఎత్తిపోతలకు భూ సేకరణను వెంటనే చేపట్టాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. మాజీ మంత్రి జానారెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్‌తో గురువారం మంత్రి సమీక్ష జరిపారు. అటవీ భూములకు అదనంగా చెల్లించాల్సిన నిధుల ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కోరారు. 23 కోట్ల విద్యుత్తు బకాయిల చెల్లింపునకు ప్రతిపాదనలు తక్షణమే పంపించాలన్నారు.

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు ఎప్పుడు?!

» ఎంసెట్‌లో ఆప్షన్ లేదు.. సెట్ లేదు

» నిర్వహణపై వైద్యారోగ్య శాఖ మౌనం

» ప్రవేశాలకు ప్రాతిపదికపై స్పష్టత కరువు

» ప్రభుత్వం వైపు కాళోజీ వర్సిటీ చూపు

వరంగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలపై సందిగ్ధత వీడడం లేదు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) ఆదేశాల మేరకు ప్రత్యేకంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సెట్) నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆ ఊసే ఎత్తడం లేదు. కనీసం ఎంసెట్(ఈఏపీ సెట్)లో కూడా ఆ ఆప్షన్ ఇవ్వలేదు. ప్రవేశాలను ఎంసెట్ మార్కుల ఆధారంగా చేపడతారా? లేదా ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగానా? అన్నదీ స్పష్టత లేదు. రాష్ట్రంలో ఎంబీబీఎస్ తర్వాత నర్సింగ్ కోర్సులకే డిమాండ్ ఉంది. 112 బీఎస్సీ నర్సింగ్ కాలేజీలలో 6,720 సీట్లు ఉన్నాయి. గతంలో ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా ఆగస్టు నెలలో నోటిఫికేషన్ ఇచ్చి సెప్టెంబరులో ప్రవేశాలు ప్రారంభించేవారు. మూడు, నాలుగు విడతల్లో కౌన్సెలింగ్ పూర్తి చేసేందుకు డిసెంబరు, జనవరి దాకా గడువు పొడిగిస్తూ అడ్మిషన్లు ఇచ్చే వారు. 2023-24 నుంచి సెట్ ర్యాంకుల ఆధారంగానే అడ్మిషన్లు ఇవ్వాలని ఐఎన్‌సీ సూచించింది. కానీ, రాష్ట్రంలో ఎలాంటి సెట్‌ను నిర్వహించలేదు. ఎంసెట్‌లోనే ఆప్షన్ ఇచ్చి, ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించారు. ఇందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగానే కన్వీనర్ కోటాలో అడ్మిషన్లు ఇచ్చారు. యాజమాన్య కోటా సీట్లకు మాత్రం నీట్ మార్కులను పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో చాలామంది పేద విద్యార్థులు నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందలేకపోయారన్న ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ ఏడాది ఎంసెట్ (ఈఏపీ సెట్)లో నర్సింగ్ కోర్సుకు ఆప్షన్ ఇవ్వలేదు. జూన్ 15వ తేదీ లోగా సెట్ నిర్వహించాలని ఐఎన్‌సీ సూచించినా.. మౌనం వహించడం విమర్శలకు తావిస్తోంది.

సందిగ్ధంలో కాళోజీ హెల్త్‌వర్సిటీ

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో నీట్ ర్యాంక్‌ల ఆధారంగా ప్రవేశాలు జరుగుతున్నాయి. నర్సింగ్‌లో ఏ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పించాలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వెళ్తామని కాళోజీ హెల్త్ వర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది ప్రవేశాలకు రెండు రకాల నిబంధనలు విధించారనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా సెట్ నిర్వహించలేకపోయింది. ఇప్పటికిప్పుడు సెట్ నిర్వహిస్తుందా? లేదా పాత పద్ధతిలోనే మళీ ప్రవేశాలు కల్పిస్తుందా? అనే ఆందోళనలో విద్యార్థులున్నారు.

గ్రూప్-2 పరీక్షలు డిసెంబరు 15, 16 తేదీల్లో..

» కొత్త షెడ్యూల్ ప్రకటించిన టీజీపీఎస్సీ

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షల కొత్త షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గురువారం ప్రకటించింది. దీని ప్రకారం డిసెంబరు 15, 16 తేదీల్లో రెండు సెషన్లలో (ఉదయం, సాయంత్రం) ఈ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి గతంలోనే నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టుల కోసం సుమారు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీటి భర్తీకి నిర్వహించాల్సిన పరీక్షలు ఇప్పటికే పలుమార్లు వాయిదా పడ్డాయి. ఇంతకు ముందు ఆగస్టు 7, 8 తేదీల్లో ఈ పరీక్షలు జరగాల్సి ఉండగా.. డీఎస్సీ పరీక్షలు జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు ఉండటంతో గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేశారు. తాజాగా డిసెంబరు 15, 16 తేదీల్లో ఈ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నాలుగు పేపర్లకు పరీక్షలు నిర్వహించనున్నారు. డిసెంబరు 15న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 (చరిత్ర, పాలిటీ అండ్ సొసైటీ) పరీక్ష, డిసెంబరు 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) పరీక్ష, అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-4 (తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు వారం రోజుల ముందు నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అభ్యర్థులకు అధికారులు సూచించారు.

సెప్టెంబరు 18 నుంచి డీఎడ్ పరీక్షలు

డీఎడ్ రెండో సంవత్సరం పరీక్షలను సెప్టెంబరు 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. మొత్తం 6 పేపర్లకు నిర్వహించే ఈ పరీక్షలు సెప్టెంబరు 24న ముగుస్తాయి.

ఏసీబీకి చిక్కిన ఎలక్ట్రికల్ డీఈ

» రూ.18 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్ సిటీ/వనస్థలిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఫైల్‌ను ముందుకు పంపేందుకు లంచం డిమాండ్ చేసిన విద్యుత్ అధికారి ఒకరు ఏసీబీకి పట్టుబడ్డాడు. సరూర్‌నగర్ టీజీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డీఈగా పని చేస్తున్న టీ రామ్మోహన్ రూ.18 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను 63 కేవీకి అప్‌గ్రేడ్ చేయడానికి పెట్టుకున్న అర్జీని ఉన్నతాధికారులకు సిఫారసు చేసేందుకు రామ్మోహన్ ఓ వ్యక్తి నుంచి రూ.18 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆ వ్యక్తి ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. గురువారం అతను ఆటో నగర్‌లోని డీఈ కార్యాలయంలో రామ్మోహన్‌కు డబ్బు ఇవ్వగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రామ్మోహన్‌ను అరెస్ట్ చేసి, ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

లోన్ యాప్ కేసుల్లో 19.39 కోట్ల ఆస్తుల అటాచ్

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): లోన్ యాప్‌ల కేసుకు సంబంధించి డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈడీ) దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. చైనీయులు డైరెక్టర్లుగా ఉన్న పలు సంస్థలకు సంబంధించి ఇప్పటికే పెద్ద మొత్తంలో ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ అధికారులు తాజాగా మరో రూ.19.39 కోట్లు విలువైన డిపాజిట్లు అటాచ్ చేశారు. లోన్ యాప్‌ల ఆగడాలకు సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై తెలంగాణలో 242 ఇన్‌స్టెంట్ మనీ యాప్స్‌పై 118 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది.

కార్పొరేట్ శక్తులకు కేంద్రం ఊడిగం

» మోదీ అప్రజాస్వామిక విధానాలపై పోరాడదాం: డి.రాజా

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తోందని, రాజ్యాంగ విలువలపై దాడి చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపీ డి.రాజా విమర్శించారు. మోదీ ప్రభుత్వ అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, మతతత్వ విధానాలను అడ్డుకునేందుకు ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఒక్కటి కావాలని రాజా పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బ్యూరోక్రసీలోకి ఆర్ఎస్ఎస్ శక్తులను జొప్పించే ప్రయత్నం మోదీ చేస్తున్నారని, ఇదే జరిగితే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, ఆదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలపై విచారణకు జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ) వేయాలని రాజా డిమాండ్ చేశారు.

సహకార శాఖలో అక్రమ బదిలీలు

» మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులకే ప్రాధాన్యం!

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సాధారణ బదిలీలపై తిరిగి నిషేధం విధించిన తర్వాత కూడా సహకార శాఖలో పాత తేదీలతో బదిలీలు కొనసాగిస్తున్నారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. రాష్ట్రంలో గత నెల 20న ప్రభుత్వం బదిలీలపై నిషేధం విధించింది. రుణమాఫీ నేపథ్యంలో వ్యవసాయ, సహకార శాఖలకు మాత్రం ఈ నెల 20 వరకు అవకాశం కల్పించింది. దాంతో 366 మంది జోనల్, మల్టీ జోనల్ పోస్టుల్లో ఉద్యోగులకు బదిలీలు అయ్యాయి. 20తో గడువు ముగిసినా.. ఆ తర్వాత 21న ఐదుగురు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ రిజిస్ట్రార్లు, 17 మంది జాయింట్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని ఉద్యోగులు పేర్కొంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులనే పరిగణనలోకి తీసుకున్న అధికారులు నిబంధనల ప్రకారం బదిలీలు చేయలేదని, దీంతో చాలా మంది ఉద్యోగులకు అన్యాయం జరిగిందని చెబుతున్నారు. గడువు ముగిసిన రెండు రోజుల తర్వాత పాత తేదీలతో ఉత్తర్వులు ఇచ్చి, తొలుత చేరి విధుల్లో ఉన్న వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని వాపోతున్నారు.

వివేకా కేసులో బెయిల్‌పై ఉదయ్‌కుమార్ విడుదల

సైదాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాబాయ్, మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడిగా చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి(ఏ-6) గురువారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు. బుధవారం ఉదయ్‌కుమార్ రెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టులో ష్యూరిటీలు సమర్పించిన అనంతరం బెయిల్ పత్రాలు జైలు అధికారులకు అందడంతో ఆయన కారాగారం నుంచి బయటకు వచ్చారు.

యూఎస్ వీసా ఇంటర్వ్యూ స్లాట్‌కు 470 రోజుల వెయిటింగ్!

» హైదరాబాద్ టెకీకి ఎదురైన అనుభవం

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అమెరికా వెళ్లాలనుకుంటున్నారా? వీసా ఇంటర్వ్యూ స్లాట్ కోసం వేచి చేస్తున్నారా? అయితే మీకు స్లాట్ దొరికేందుకు చాలా కాలం పట్టవచ్చు. హైదరాబాద్‌కు చెందిన ఓ టెకీ తన స్నేహితుడి కోసం యూఎస్ వీసా ఇంటర్వ్యూ స్లాట్ కోసం ప్రయత్నిస్తే 470 రోజుల వెయిటింగ్ చూపింది. అమిత్ భవానీ అనే వ్యక్తికి ఈ అనుభవం ఎదురైంది. ఆయన తన అనుభవాన్ని తన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఈ పోస్ట్ చూసిన తర్వాత చాలా మంది ఆయనకు రకరకాల సలహాలు ఇచ్చారు. ఏజెంట్లకు కొంత మొత్తం డబ్బు చెల్లిస్తే స్లాట్‌లు అందిపుచ్చుకోవడం ఈజీ అని పేర్కొన్నారు. అయితే తాను పోస్టు చేసిన మరో 24 గంటలకు అమిత్ మరో పోస్ట్ చేస్తూ "ఎట్టకేలకు ఒక రోజంతా ప్రయత్నించి ఆగస్టు 26న స్లాట్ సంపాదించగలిగా"నని తెలిపాడు. ఏజెంట్లకు పైసా చెల్లించకుండానే ఇది సాధ్యమైందన్నారు.

ఐఐటీహెచ్ వినూత్న డ్రోన్లు!

ఐఐటీహెచ్ పరిశోధకులు అభివృద్ధి చేసిన అతి పెద్ద డ్రోన్



కంది, ఆగస్టు 22: పక్షి ఆకారంలో ఉండి ఆకాశంలో విహరిస్తూ వీడియోలు తీస్తాయి! సీతాకోకచిలుకల్లా రెక్కలాడిస్తూ ఫొటోలు క్లిక్ మనిపిస్తాయి! తూనిగల్లా చెట్లపై వాలి నిఘా పెడతాయి! గాలిలో ఎగురుతూ మనుషులు చేరలేని చోటుకు బరువైన వస్తువులు తీసుకెళతాయి! ఇవి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) పరిశోధకులు తయారుచేస్తున్న డ్రోన్లు! సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీహెచ్‌లోని 'టీహాన్' (టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఇన్ అటానమస్ నావిగేషన్) విభాగం టెక్నాలజీ ఈ ఫ్లాపింగ్ వింగ్స్ డ్రోన్లను ప్రయోగాత్మకంగా గాల్లోకి ఎగురవేసి పరీక్షించింది. ఇవి కొండలు, గుట్టలపైన, అటవీ ప్రాంతాల్లో జీపీఎస్‌తో నిర్దేశిత లక్ష్యానికి చేరగలవు. వీటి మార్గంలో ఏవైనా అడ్డం వస్తే సెన్సార్లు పసిగడతాయి. ఆటోమేటిక్‌గా ఆ డ్రోన్ తిరిగి మళ్లీ ఆపరేటర్ దగ్గరకు వచ్చి చేరుతుంది. ఈ టెక్నాలజీలో సహకారం అందించేందుకు కొన్ని స్టార్టప్ కంపెనీలు ముందుకు వచ్చాయి. మరో రెండు నెలల్లో ఈ డ్రోన్లకు ధరలు నిర్ణయించి మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే ఐఐటీహెచ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు భూసర్వే చేసే డ్రోన్లను మార్కెట్లోకి విడుదల చేశారు. ఇవి దేశంలో తొలి సర్వే డ్రోన్లుగా డీజీసీఏ (డైరెక్టర్ ఆఫ్ జనరల్ సివిల్ ఏవియేషన్) సర్టిఫికెట్ పొందాయి.



పక్షి ఆకారంలో తయారు చేసిన డ్రోన్‌తో ఐఐటీహెచ్ పరిశోధన విద్యార్థిని

సంతకాల కోసం కేసీఆర్, హరీశ్ ఒత్తిడి చేశారు

(మొదటి పేజీ తరువాయి)

సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో)కు అధిపతిగా ఈఎన్‌సీ ఉండాలి. ఈఎన్‌సీ(సీడీవో) కింద హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్స్, డిజైన్, డ్రాయింగ్‌లకు వేర్వేరుగా సీఈలు పనిచేయాలి. ఈ డిజైన్లను కేంద్ర జల సంఘానికి పంపించే ముందు డీపీఆర్‌లోని చెక్ లిస్ట్‌పై ఈఎన్‌సీ(సీడీవో) సంతకం చేయాలి. అయితే, కొన్నేళ్లుగా సీడీవో పరిధిలో హైడ్రాలజీ, ఇన్వెస్టిషన్‌లు లేవు. వాటిని ఈఎన్‌సీ(జనరల్) కిందకు మార్చారు. ఈ కారణం వల్లే చెక్‌లిస్ట్‌పై సంతకం చేయడానికి నిరాకరిస్తూ 4-5 రోజుల పాటు డీపీఆర్ చెక్‌లిస్ట్‌పై సంతకాలు చేయలేదు" అని నరేందర్‌రెడ్డి వివరించారు. డిజైన్లన్నీ సిద్ధమయ్యాక సంతకాలు ఎందుకు పెట్టడం లేదు? సమస్య ఏంటీ? అని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, సాగునీటి మంత్రి హరీశ్‌రావులు ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చారని చెప్పారు. తర్వాత హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన అంశాల బాధ్యత తనదేనని హరిరామ్ లేఖ ఇచ్చాకే డీపీఆర్ చెకలిస్ట్‌పై సంతకం చేశానని వెల్లడించారు. కాళేశ్వరం డిజైన్లకు సీఈ(సీడీవో)దే బాధ్యత అని, ఆయన చెక్‌లిస్ట్‌పై సంతకం చేశారని వెదిరే శ్రీరామ్ ప్రకటించగా... ఇందులో వాస్తవాలేంటో ప్రజలకు చెప్పాలనే ఉద్దేశంతో సమాచార హక్కు చట్టం ద్వారా పత్రాలు సేకరించానని తెలిపారు. ఇన్వెస్టిగేషన్లకు తానే బాధ్యత వహిస్తానని హరిరామ్ డీపీఆర్‌లో భాగంగా ఇచ్చిన లేఖను తొలగించినట్లు ఆర్టీఐ సమాచారంలో తేలిందని నరేందర్‌రెడ్డి చెప్పారు. సమాచార హక్కు ద్వారా సేకరించిన లేఖను నరేందర్‌రెడ్డి కాళేశ్వరం కమిషన్‌కు అందించారు. సాంకేతిక అనుమతి తీసుకున్నాక డిజైన్లు/డ్రాయింగ్‌లు మార్చవచ్చా?అని కమిషన్ ప్రశ్నించగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు, ఇతర పారామీటర్స్, క్షేత్రస్థాయి అధికారుల నివేదికల ఆధారంగా మార్పులు చేయడానికి వీలుంటుందని బదులిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లు/డ్రాయింగ్‌లు చేయాలని ఆదేశించింది ఎవరు? కాళేశ్వరం నిర్మాణం చేయాలనే నిర్ణయం ఎవరిది? అని కమిషన్ అడిగింది. ఉన్నత స్థాయిలోని నిర్ణయాల ఆధారంగా చేశామని, బ్యారేజీల ఎంపిక ప్రదేశాలు ఖరారు చేసుకున్నాక స్ట్రక్చరల్ డిజైన్ల తయారీకి ఫైలును పంపించారని, ఉన్నతస్థాయిలో జరిగిన ఏ సమీక్షకూ తనను పిలవలేదని బదులిచ్చారు. ఇచ్చిన డిజైన్లు/డ్రాయింగ్‌ల ప్రకారం పనులు జరుగుతున్నాయా? లేవా? పరిశీలించాల్సిన బాధ్యత ఇంజనీర్‌గా మీకు లేదా? అని కమిషన్ ప్రశ్నించగా... గత ప్రభుత్వం ఆ అవకాశమే ఇవ్వలేదన్నారు.



విచారణకు హాజరయ్యేందుకు వస్తున్న మురళీధర్

నిర్మాణం చేపట్టడానికి ముందు బ్యారేజీలు కట్టే ప్రదేశాన్ని పరిశీలించి, ఎంత పొడవుతో కడుతున్నారనే వివరాలు తెలుసుకోవడం తప్ప మిగతా అంశాలను పరిశీలించలేదని తెలిపారు. రాఫ్ట్(పునాది), పైల్స్, అప్రాన్ పనులు, గేట్లు, పియర్స్(పిల్లర్లు), కవర్ డెప్త్‌లను మాత్రమే పరిశీలించామని వెల్లడించారు. మూడు బ్యారేజీల నిర్మాణంలో మీ పాత్ర ఏంటీ? అని కమిషన్ అడగ్గా, నిర్మాణపరంగా తమ పాత్ర లేదని చెప్పారు.

వరద ప్రవాహ వేగం అంచనాలు తప్పాయి?

మేడిగడ్డ బ్యారేజీ నుంచి వరద సెకనుకు 6 మీటర్ల వేగంతో వెళ్లేందుకు డిజైన్లను రూపొందించగా... సెకనుకు 15-16 మీటర్ల వేగంతో వరద ప్రవాహం ఉందని నిర్ధారణ అయింది కదా అని కమిషన్ ప్రశ్నించగా... అవునని నరేందర్ బదులిచ్చారు. వేగంగా బయటికి వచ్చే వరదకు బ్యారేజీ దిగువ భాగం దెబ్బతినకుండా నిర్మాణాలు జరుగలేదని కమిషన్ తప్పుపట్టింది.

హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అంటే ఎవరు?

ఏయే నమూనా అధ్యయనాల తర్వాత డిజైన్లు సిద్ధం చేశారని కమిషన్ ప్రశ్నించగా... 2డీ నమూనా అధ్యయనం, జీఏడీ(డ్రాయింగ్) ఆధారంగా డిజైన్లు, డ్రాయింగ్‌లు చేశామని నరేందర్ రెడ్డి వివరించారు. నిజానికి 3 డీ నమూనా అధ్యయనం తర్వాతే డిజైన్లు తయారు చేయాలన్నారు. నాటి సీఎం, మంత్రి ఒత్తిడి చేయడంతో 3 డీ అధ్యయనాలు రావడానికి ముందే డిజైన్లు తయారు చేశామని, దీనికి గవర్నమెంట్ ఒత్తిడియే కారణమని వివరించారు. గవర్నమెంట్ అంటే రాజ్యాంగం ఏమైనా నిర్వచనం ఇచ్చిందా? హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ అంటే ఎవరు? మంత్రివర్గానికి బాస్ ఎవరు? అని కమిషన్ ప్రశ్నించగా... ముఖ్యమంత్రే అని బదులిచ్చారు. బ్యారేజీల నిర్మాణం జరుగుతున్నప్పుడు హరీశ్‌రావు మంత్రిగా ఉన్నారని ప్రస్తావించారు. ఏ స్థాయి అధికారులు నమూనాను అధ్యయనం చేస్తారని కమిషన్ ప్రశ్నించింది. తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ ల్యాబోరేటరీ(టీఎస్ఈఆర్ఎల్)లో చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి అని బదులిచ్చారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ మ్యానువల్ అనుసరించి... డిజైన్లు తయారు చేశారా? అని ప్రశ్నించగా... అవునని వివరించారు.

డిజైన్లు తయారు చేసిందెవరూ?

మేడిగడ్డ బ్యారేజీ డిజైన్లు/డ్రాయింగ్‌లు ఎవరు తయారు చేశారని కమిషన్ ప్రశ్నించింది. వీటిని సీడీవో ఒక్కరే తయారు చేయలేదని, సీడీవోతో కలిసి ఎల్ అండ్ టీ తయారు చేసిందని నరేందర్‌రెడ్డి బదులిచ్చారు. ఎల్‌అండ్‌టీ ఇచ్చిన డిజైన్లను మక్కీకి మక్కీగా కాపీ ఎందుకు చేశారు? ఎందుకు ఆలోచించలేదు? అని కమిషన్ ప్రశ్నిస్తూ...బెంగాలీ సామెతను ప్రస్తావించింది. ప్రభుత్వ ఒత్తిళ్లను నరేందర్‌రెడ్డి కమిషన్‌కు వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ డిజైన్లు/డ్రాయింగ్‌ల విషయంలో ఎల్‌అండ్‌టీకి, సీడీవోకు మధ్య ఈ-మెయిల్ ఆధారిత 600పేజీల ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయని ప్రస్తావించారు. ఆ వివరాలన్నీ కమిషన్‌కు అందజేస్తానని ప్రకటించారు.

నల్లా వెంకటేశ్వర్లుదే బాధ్యత

మేడిగడ్డ బ్యారేజీలో షీట్ ఫైల్స్‌కు బదులుగా సీకెంట్ ఫైల్స్ వేయడం వెనుక మాజీ రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు తీసుకున్న నిర్ణయమే కారణమని మాజీ ఈఎన్‌సీ(జనరల్) సి.మురళీధర్ ప్రస్తావించారు. 2016 ఏప్రిల్ 11వ తేదీన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సాంకేతిక అనుమతుల ఉత్తర్వులు నల్లా వెంకటేశ్వర్లే ఇచ్చారని గుర్తు చేశారు. విచారణలో భాగంగా బుధవారం కొన్ని వివరాలు అసంపూర్తిగా ఇవ్వడంతో గురువారం కమిషన్ ముందు హాజరై.. ఆయన వివరాలు అందించారు. అన్నారంలో తొలుత 58 గేట్లు పెట్టాలని నిర్ణయం తీసుకోగా... ఆ తర్వాత 66 గేట్లకు పెంచారు. 2022 ఫిబ్రవరి 22వ తేదీన కాళేశ్వరం డీపీఆర్‌ను అనుమతుల కోసం సీడబ్ల్యూసీలో దాఖలు చేయడం జరిగిందని, 2014 జూలై 22వ తేదీన జీవోనెం.10తో ప్రాణహితతో పాటు కాంతనపల్లి , దుమ్ముగూడెం ప్రాజెక్టులపై హైపవర్ కమిటీ వేశారని, దాదాపు 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందుతుందని చెప్పారని, కేవలం లక్ష ఎకరాలు మాత్రమే ఆ ప్రాజెక్టులో నీటిని అందించామని వెల్లడించారు.

నాలుగేళ్లు బ్యారేజీలను పట్టించుకోలేదు: నరేందర్‌రెడ్డి

బ్యారేజీలకు, డ్యామ్‌లకు మధ్య చాలా తేడా ఉంటుందని, బ్యారేజీలు నీటి నిల్వ కోసం కాదని, వచ్చిన నీటిని వచ్చినట్లే మళ్లించడానికని నరేందర్ రెడ్డి వివరించారు. వీటి పునాదులు సున్నితంగా ఇసుకపై ఉంటాయన్నారు. బ్యారేజీలు 2019 జూన్‌లో ప్రారంభం కాగా... వాటిని నాలుగేళ్లపాటు పట్టించుకోలేదని మాజీ ఈఎన్‌సీ నరేందర్ రెడ్డి కమిషన్‌కు వివరించారు. నాలుగేళ్ల పాటు బ్యారేజీలను వదిలేయడం వల్లే వైఫల్యం చెందాయన్నారు. గేట్లు ఎత్తడంలోనూ టీఎస్ఈఆర్ఎల్ మాన్యువల్‌ను పాటించలేదని, బ్యారేజీల నిర్మాణంలో అతి సున్నితమైన సీకెంట్ ఫైల్స్ పనులను ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో చేశారని, కాంక్రీట్‌ను అపరిమిత వేగంతో నింపారని చెప్పారు. టెండర్ల ఖరారులో ఎస్ఈకి రామగుండం చీఫ్ ఇంజనీర్‌గా, బ్యారేజీల వైఫల్యంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలు ప్రధానంగా కారణమని తేలినా... ఈఎన్‌సీ(ఓఅండ్ఎం) పదవీ కాలం పొడిగించారని నివేదించారు.

దుబాయ్‌లో జగమే మాయ!

కల్తీ కల్లుకు బానిసలైన తెలంగాణ వాసుల పాట్లు

మత్తు దొరక్క నానావస్థలు పడి కొందరి మరణం

మరికొందరు స్వదేశానికి తిరుగుప్రయాణం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కల్తీ కల్లుకు బానిసలైన తెలంగాణ పౌరులు కొందరు పొట్టకూటి కోసం ఎడారి దేశాలకు వచ్చి జగమే మాయ అంటున్నారు. అలవాటైన కల్తీ కల్లు ద్వారా లభించే మత్తు దొరక్క తామొచ్చిన పనిని మరిచి పిచ్చెక్కిపోతున్నారు. కొందరు పిచ్చి చేష్టలతో తిరుగుతూ మృత్యువాత పడుతుంటే.. మరికొందరు స్వదేశానికి తిరుగుటపా కడుతున్నారు. దీంతో ఆయా కుటుంబాలు, వారికి ఉద్యోగాలు ఇప్పించిన ఏజెన్సీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. దుబాయ్‌లో ఇటీవల మరణించిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం సాయంపేటకు చెందిన ఆవుల ఓదేలు విషాదాంతం ఈ పరిస్థితికి నిదర్శనం. దాదాపు కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఓదేలు మృతదేహం ఇక్కడి సోనాపూర్ పరిసరాల్లోని ఇసుక దిబ్బల్లో ఈ నెల ప్రారంభంలో దుబాయ్ పోలీసులకు దొరికింది. ఓదేలు మృతదేహం బుధవారం స్వదేశానికి చేరింది. 30 రోజుల విజిటింగ్ వీసాతో దుబాయ్ వచ్చిన ఓదేలు ఓ నిర్మాణ కంపెనీలో పనిలో చేరాడు. కానీ, మత్తుకు బానిసైన ఓదేలు అది లేకుండా ఉండలేకపోయినట్లు సమాచారం. మత్తు లభించక పిచ్చిగా ప్రవర్తించేవాడని, కంపెనీ బస్సుల ముందు నిద్రపోయేవాడని ఇతర కార్మికులు చెప్పారు. చివరికి పనికి కూడా వెళ్లకుండా కంపెనీ శిబిరంలోనే ఉండిపోయేవాడని, నిర్వాహకులు ఏసీలు ఆపేసినా బయటికిరాకుండా గదిలోనే ఉండేవాడని తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఆ కంపెనీ నుంచి పారిపోయిన ఓదేలు ఎడారిలో శవమై కనిపించాడు. కాగా, ప్రాణాంతకమైన ఆల్ప్రాజోలం, డైజోఫాం, క్లోరోఫాంతోపాటు క్రిమిసంహారక మందుల్లో వాడే ముడి పదార్థాలను నీళ్లలో కలిపి కల్లుగా విక్రయిస్తుంటారు. ఈ కల్లు డ్రగ్స్ కంటే అధిక మోతాదులో మత్తు ఇస్తుండడంతో దీన్ని సేవించిన వారు ఆ మత్తుకు బానిసలవుతున్నారు. తెలంగాణ ప్రాంతంలో గుల్బాం కల్లుగా పిలిచే ఈ కల్లుకు అలవాటుపడిన వారు అది లేకుండా ఒక్క రోజు కూడా గడపలేకపోతున్నారు. ఓదేలు మాత్రమే కాదు.. దుబాయిలోని కంపెనీల్లో కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న వారిలో చాలా మంది ఈ కల్తీ కల్లు బానిసలు ఉన్నారు. వారు కూడా తాము అలవాటుపడిన మత్తు లభించక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు దుబాయిలో ఉద్యోగం వద్దు, సొంతూరిలోనే కూలీనాలీ చేసుకుంటూ గుల్బాం కల్లు తాగుతూ బతికేస్తామని స్వదేశానికి తిరిగి వెళ్లిపోతున్నారు. ఇలా వెళ్లిపోతున్న వారి సంఖ్య పెరుగుతుండడం రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలకు సమస్యగా మారింది. రిప్లేస్‌మెంట్‌తో పాటు డిఫెక్టివ్ సర్వీసు కింద దుబాయి కంపెనీలు ఏజన్సీలకు ఇచ్చే కమీషన్లలో భారీగా కోతలు పెడుతున్నాయి.

బీజేపీని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర

» అదానీ, సెబీ అంటూ మీడియాను పక్క దారి పట్టించే యత్నం: బండి సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బీజేపీని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ధ్వజమెత్తారు. అదానీ, సెబీ అంటూ ఆందోళనలు చేస్తూ ప్రజలు, మీడియాను పక్కదారి పట్టించేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. అదానీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. అదే అదానీకి వ్యతిరేకంగా ధర్నా చేయడం సిగ్గు చేటని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇరు పార్టీల మధ్య క్విడ్ ప్రోకోలో భాగంగానే రాజ్యసభ స్థానాన్ని బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు వదిలేసిందని తెలిపారు. సంఖ్యాబలమున్నా బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టలేదని, కవిత కేసు వాదించిన న్యాయవాది సింఘ్వీని కాంగ్రెస్ బరిలో నిలిపిందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం సాధ్యం కాదని గ్రహించి బీఆర్ఎస్‌తో చేతులు కలిపిన కాంగ్రెస్ ప్రజలను పక్కదారి పట్టిస్తోందని చెప్పారు. అందులో భాగంగానే కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, మియాపూర్ భూములు, నయీం డైరీ కేసులను నీరుగార్చారని తెలిపారు. కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లకుండా కాంగ్రెస్ తప్పించిందన్నారు. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కలిసి ఆడుతున్న డ్రామాలను బీజేపీ ఎప్పటికప్పుకు బయటపెడుతుంటే ఓర్వలేక ప్రజలకు ప్రయోజనం లేని అంశాలపై ఆ పార్టీలు గొడవ చేస్తున్నాయన్నారు. ఇటీవల దావోస్ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీతో సమావేశమై తెలంగాణలో రూ.12,400 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. అదానీతో బీజేపీ కుమ్మక్కైందని చెబుతున్న కాంగ్రెస్



నేతలు దీనికేం సమాధానం చెబుతారని సంజయ్ ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు 420 హామీల అమలు కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని సంజయ్ చెప్పారు. రైతులందరికీ రుణ మాఫీ చేశామని కాంగ్రెస్ నేతలు చెబుతున్న మాటలకు క్షేత్ర స్థాయి పరిస్థితికి పొంతన లేద న్నారు. 70 శాతం మంది రైతులు రుణాలు మాఫీ కాక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. మహిళలకు నెలకు రూ. 2500, స్కూటీలు, కొత్త జంటలకు తులం బంగారం లాంటి హామీల కోసం సోదరీమణులు ఎదురుచూస్తున్నారన్నారు. నిరుద్యోగికి రూ. 4 వేల భృతి, వృద్ధులకు రూ. 4 వేల ఆసరా పెన్షన్ అందిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇంత వరకు అమలు చేయలేదని గుర్తు చేశారు. వీటన్నింటినీ కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ సర్కారు బీఆర్ఎస్‌తో కుమ్మక్కైందని సంజయ్ ఆరోపించారు.



అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాల సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు పెట్టాలి

బీసీ సంఘాల సమావేశంలో తీర్మానం

ఖైరతాబాద్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బీసీ కులగణన చేసి.. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నేతలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమగ్ర కులగణనను వెంటనే ప్రారంభించి బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు, బీసీ కుల సంఘాల సంయుక్త సమావేశం గురువారం లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం నేత వేముల వెంకటేశ్ అధ్యక్షత వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కులగణన చేపట్టకపోతే ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, సెప్టెంబరు 6న లక్షలాది మంది బీసీలతో కులగణన మార్చ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. అప్పటికీ కులగణన చేయకుండా ఎన్నికలకు వెళితే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అన్యాయమే చేశాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వరాదనే నిబంధన ఏమీ రాజ్యాంగంలో లేదన్నారు. బీసీల గణనతో పాటు రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అంకితభావంతో ఉన్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ చెప్పారు. బీసీల్లో ఇప్పుడున్న చైతన్యం అప్పుడు ఉండి ఉంటే తాను సీఎం అయ్యేవాడినని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు.

హిండెన్‌బర్గ్ వార్తలనే రాహుల్ నమ్ముతారు

» జన్వాడ ఫాంహౌజ్ కేటీఆర్‌ది కాకపోతే రేవంత్‌పై కేసెందుకు?: రఘునందన్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హిండెన్‌బర్గ్‌లో వచ్చిన వార్తలను మాత్రమే నమ్ముతున్నారని.. సెబీ, సుప్రీంకోర్టు, ప్రజాస్వామ్యం మీద ఆయనకు నమ్మకం లేదని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దేశంలో వాణిజ్య కార్యకలాపాలను దెబ్బతియ్యాలని కాంగ్రెస్ అనుకుంటోందని మండిపడ్డారు. సెబీ ఛైర్మన్ షేర్లు కొనుగోలు చేయకూడదా..? అని ప్రశ్నించారు. బ్లిట్జ్ పేపర్‌లో రాహుల్ గాంధీకి వివాహమైందని, పిల్లలున్నారని రాశారన్నారు. అది తప్పయితే ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసి బ్లిట్జ్ పేపర్ ఇస్తానని చెప్పారు. జన్వాడ ఫాంహౌజ్ కేటీఆర్‌ది కాకపోతే రేవంత్ రెడ్డి డ్రోన్ ఎగురవేసినప్పుడు ఆయనపై ఎందుకు కేసు పెట్టారని ప్రశ్నించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 23 ఆగస్టు 2024



నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంహెచ్‌ఎం

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్ సెట్-ఎంహెచ్‌ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెడికల్/నాన్ మెడికల్ విభాగాల్లో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు అయిదేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.

నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. హెల్త్ సైన్సెస్‌కు సంబంధించి 40, అడ్మినిస్ట్రేషన్ అంశాలనుంచి 10, కంప్యూటర్ సైన్సెస్ అంశాల నుంచి 10, జనరల్ నాలెడ్జ్ నుంచి 15, టెస్టింగ్ ఆఫ్ ఐక్యూకు సంబంధించి 15, ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 40 శాతం; ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులకు ఆర్థిక సహకారం అందిస్తూ వారు చదువులో రాణించేలా ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్' నోటిఫికేషన్ వెలువడింది. విప్రో కన్జూమర్ కేర్, విప్రో కేర్స్ ఉమ్మడిగా ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నాయి. ఇంటర్ పూర్తిచేసిన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఏడాదికి 1,900 మందికి ఈ ప్రోత్సాహకాలు అందుతున్నాయి. ఆసక్తిగల విద్యార్థినులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాన్ని నింపి కింది చిరునామాకు పంపాలి.

అర్హత: విద్యార్థినులు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి పూర్తిచేసి ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాల నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో ఫుల్ టైమ్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ పొంది ఉండాలి. ప్రొఫెషనల్ కోర్సులు, సైన్సెస్, లిబరల్ ఆర్ట్స్, హ్యుమానిటీస్ విభాగాల్లో చేరినవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. మారుమూల జిల్లాలకు చెందిన విద్యార్థినులకు ప్రాధాన్యం ఇస్తారు.

స్కాలర్‌షిప్: ఎంపికైన విద్యార్థినులకు డిగ్రీ కోర్సు పూర్తయ్యే వరకు ఏటా రూ.24,000లు చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారు. నగదు నేరుగా విద్యార్థినుల బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **చిరునామా:** విప్రో కేర్స్-సంతూర్ స్కాలర్‌షిప్, దొడ్డకన్నెల్లి, సర్జాపూర్ రోడ్, బెంగళూరు, కర్ణాటక.
- **వెబ్‌సైట్:** https://www.santoorscholarships.com/

నిట్ వరంగల్‌లో బీఎస్సీ-బీఈడీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- నాలుగేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ-బీఈడీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా; కంప్యూటర్ సైన్స్, మేథమెటిక్స్ మైనర్ సబ్జెక్టులుగా ఉంటాయి. ఇది సెకండరీ స్థాయి ప్రోగ్రామ్. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమశ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2022/2023/2024 సంవత్సరాల్లో ఇంటర్ స్థాయి పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఎన్‌సీఈటీ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 27
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల:** సెప్టెంబరు 2
- **అభ్యర్థుల రెండో జాబితా విడుదల:** సెప్టెంబరు 6
- **స్పెషల్ స్పాట్ రౌండ్ ద్వారా ఎన్నికైన అభ్యర్థుల జాబితా విడుదల:** సెప్టెంబరు 11
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 17 నుంచి
- **వెబ్‌సైట్:** www.nitw.ac.in



కర్నూలు ఐఐఐటీడీఎంలో పీహెచ్‌డీ

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్‌ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈ)

సైన్స్ విభాగాలు: ఫిజిక్స్, మేథమెటిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కనీసం 7 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఏదేని ఇంజనీరింగ్ కళాశాల నుంచి 75 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- సైన్స్ విభాగాలకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/నెట్/ఎన్‌బీహెచ్‌ఎం స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులు; ఐఐటీల నుంచి 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఎంపికైన అభ్యర్థులకు విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి రెండేళ్లు నెలకు రూ.43,750 అందిస్తారు.

- కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు.
- ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు అటెండ్ అయ్యేవారికి రూ.లక్షన్నర ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 8
- **వెబ్‌సైట్:** https://iiitk.ac.in/


జాబ్ కార్నర్

పీజీసీఐఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 1031

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పీజీసీఐఎల్ కేంద్రం/ప్రాజెక్ట్/రీజియన్: కార్పొరేట్ సెంటర్(గురుగ్రామ్), నార్తెర్న్ రీజియన్-1(ఫరీదాబాద్), నార్తెర్న్ రీజియన్-2(జమ్మూ), నార్తెర్న్ రీజియన్-3(లఖ్‌నవూ), ఈస్టర్న్ రీజియన్-1(పట్నా), ఈస్టర్న్ రీజియన్-2(కోల్‌కతా), నార్త్ ఈస్టర్న్ రీజియన్(షిల్లాంగ్), ఒడిశా ప్రాజెక్ట్(భువనేశ్వర్), వెస్టర్న్ రీజియన్-1(నాగ్‌పూర్), వెస్టర్న్ రీజియన్-2(వడోదర), సదరన్ రీజియన్-1(హైదరాబాద్), సదరన్ రీజియన్-2(బెంగళూరు).



ట్రేడులు: రాజభాష అసిస్టెంట్, సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ లా, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, పీఆర్ అసిస్టెంట్, గ్రాడ్యుయేట్(సివిల్), గ్రాడ్యుయేట్(కంప్యూటర్ సైన్స్), గ్రాడ్యుయేట్(ఎలక్ట్రికల్), గ్రాడ్యుయేట్(ఎలక్ట్రానిక్స్/టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్), లైబ్రరీ ప్రొఫెషనల్ అసిస్టెంట్

అర్హత: ఖాళీని అనుసరించి ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎంబీఏ, పీజీ డిప్లొమా, ఎల్ఎల్‌బీ, బీఏ ఉత్తీర్ణులై ఉండాలి.

అప్రెంటిస్ కాలం: ఒక సంవత్సరం

నెలవారీ స్టయిపెండ్: ఐటీఐ ట్రేడ్ రూ.13,500; డిప్లొమా ట్రేడ్ రూ.15000; గ్రాడ్యుయేట్ ట్రేడ్/హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్/సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్/లా ఎగ్జిక్యూటివ్/రాజ్‌భాష అసిస్టెంట్ రూ.17,500.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హత మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

వెబ్‌సైట్: careers.powergrid.in/

ఎల్‌పీఎస్‌సీలో టెక్నికల్ అసిస్టెంట్స్

ఖాళీలు 30

తిరువనంతపురంలోని ఇస్రోకు చెందిన ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్(ఎల్‌పీఎస్‌సీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. టెక్నికల్ అసిస్టెంట్
2. టెక్నీషియన్-బి
3. హెవీ వెహికల్ డ్రైవర్(ఎ)
4. లైట్ వెహికల్ డ్రైవర్(ఎ)
5. కుక్

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, వెల్డర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టర్నర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. డ్రైవర్ పోస్టుకు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్/లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, పబ్లిక్ సర్వీస్ బ్యాడ్జి తప్పనిసరి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

వేతనం: నెలకు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.44,900 - రూ.1,42,400; టెక్నీషియన్-బి పోస్టులకు రూ.21,700 - రూ.69,100; ఇతర పోస్టులకు రూ.19,900 - రూ.63,200.

పని ప్రదేశాలు: బెంగళూరు, వలియామల

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.750. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మన్/మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 10

వెబ్‌సైట్: https://www.lpsc.gov.in/

ఇండియా ఆప్టెల్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ఖాళీలు 13

డెహ్రాడూన్‌లోని ఇండియా ఆప్టెల్ లిమిటెడ్(ఐఓఎల్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్(ఎలక్ట్రో ఆప్టిక్స్ డిజైన్): 3 పోస్టులు
2. సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్(రోబోటిక్స్ సాఫ్ట్‌వేర్ అండ్ కంట్రోల్): 2
3. డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్): 8

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకట్రానిక్స్ కంప్యూటర్స్), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 40 ఏళ్లు మించకూడదు.

జీతం: నెలకు డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టుకు రూ.85,000; మిగతా పోస్టులకు రూ.1,00,000.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సీనియర్ మేనేజర్/హెచ్ఆర్, ఇండియా ఆప్టెల్ లిమిటెడ్ కార్పొరేట్ హెచ్‌క్యూ(ఓఎఫ్ఐఎల్ క్యాంపస్), రాయ్‌పూర్, డెహ్రాడూన్ చిరునామాకు పంపాలి.

ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 6

వెబ్‌సైట్: https://www.indiaoptel.in/



ఎన్ఎంఆర్ఐలో యంగ్ ప్రొఫెషనల్స్

చెంగిచర్ల(హైదరాబాద్)లోని ఐసీఏఆర్- నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్ఎంఆర్ఐ).... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

ఖాళీలు: 8

పోస్టుల వివరాలు

1. యంగ్ ప్రొఫెషనల్-2
2. జూనియర్ రీసెర్చ్ ఫెలో
3. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3
4. ప్రాజెక్ట్ అసోసియేట్-1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, బీఫార్మసీ, ఎంవీఎస్సీ(పబ్లిక్ హెల్త్/యానిమల్ న్యూట్రిషన్/మైక్రో బయాలజీ), బీకాం/బీబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టుకు రూ.42,000; జేఆర్ఎఫ్ పోస్టుకు రూ.37,000; ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్‌కు రూ.28,000; ఇతర పోస్టులకు రూ.31,000

వయోపరిమితి: యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు 45 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 27

వేదిక: ఐసీఏఆర్ - నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెంగిచర్ల, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://nrcmeat.icar.gov.in/




తగిన శాస్తి

రామాపురంలో క్రిష్ణయ్య అనే యువకుడు ఉండేవాడు. అతను ఎంతో తెలివైనవాడు ఇంకా సాహసవంతుడు కానీ చాలా దురాశా పరుడు ఒక రోజు ఆ ఊరిలో రామనాథం అనే వ్యాపారి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రాణ నష్టం ఏమీ లేకున్నా, ఇంటిలోపలి విలువైన వస్తువులు కాలి, బూడిదవు తున్నాయి. ఇంతలో అక్కడికి వచ్చిన రామనాథం 'వ్యాపారానికి కావలసిన డబ్బు నాలుగు లక్షలు లోపల పెట్టాను అది కూడా బూడిద ఐతే ఎలా' అని పెద్దపెట్టున ఏడవసాగాడు. ఇంతలో అక్కడికి వచ్చిన క్రిష్ణయ్య 'రామనాథం గారూ మీ డబ్బు లోపలినుండి నేను క్షేమంగా తెచ్చి ఇస్తాను. కానీ తెచ్చిన డబ్బులో నాకు ఇష్టమైనది మీకు ఇచ్చి మిగతాది నేను తీసుకుంటాను. సరేనా? అన్నాడు. దానికి సరే అన్నాడు రామనాథం. అపుడు క్రిష్ణయ్య ఎంతో ధైర్యంగా లోపలికి వెళ్లి, డబ్బుమూట బయటకు తెచ్చాడు కానీ, తెచ్చిన సొమ్ములో వంద రూపాయలు మాత్రం రామనాథానికి ఇచ్చి, మిగతా డబ్బు మొత్తం తన సంచీలోవేసుకుని, వెళ్లబోయాడు. ఇది అన్యాయం అనిక్రిష్ణయ్యను ఆపాడు రామనాథం. 'నేను చెప్పినట్లే కదా చేశాను ఇంకేం అన్యాయం' అన్నాడు క్రిష్ణయ్య. విషయం పంచాయితీ దాకా వెళ్లింది, పంచాయితీ పెద్ద కేశవరావు జరిగినదంతా విని, క్రిష్ణయ్యతో ఇలా అన్నాడు.' క్రిష్ణయ్యా ఆ డబ్బుమూట మరియు వంద రూపాయలు చెరోవైపున పెట్టు' అన్నాడు. అలాగే చేాడు క్రిష్ణయ్య. ఇపుడు చెప్పు క్రిష్ణయ్యా ఈ రెండిటిలో నీకు ఇష్టమైనది ఆ పెద్ద డబ్బు మూటనే కదా అని అడిగాడు. అవును అని జవాబుచెప్పాడు క్రిష్ణయ్య. 'నువ్వు నీకు ఇష్టమైనది రామనాథానికి ఇస్తాను అని కదా అన్నావు?

కాబట్టి మారు మాట్లాడకుండా ఆడబ్బు మూట అతనికి ఇచ్చేసి, అతను సంతోషంగా ఎంత ఇస్తే అంత పుచ్చుకో' అన్నాడు కేశవరావు దానికి క్రిష్ణయ్య నా ఉద్దేశం అది కాదు నాకు ఇష్టమైనది అంటే నాకు నచ్చినంత అని అర్థం' అన్నాడు దానికి కేశవరావు 'నీ ఉద్దేశం మంచిదైతే ఈ గొడవే లేదు కదా. నువ్వు తెలివైనవాడివి. కానీ ఈ దురాశ మంచిది కాదు మానుకో అని హితవు చెప్పి, అతన్ని అక్కడి నుండి పంపేశాడు పంచాయితీ పెద్ద. అతని దురాశకు తగిన శాస్తి జరిగిందని అందరూ అనుకున్నారు.




7 తేడాలు గుర్తించండి




ఏ జంతువులు ఎన్ని ఉన్నాయి?

సరైన నీడ ఏది



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 391

		6	2		4			
2		7		6		3		
						8		
6	7		1	3				4
		8				9		
9				8	7		6	3
		4						
		1		5		4		8
			4		1	7		

సుడోకు - 390 సమాధానం

3	8	6	2	9	4	5	7	1
2	1	7	8	6	5	3	4	9
4	5	9	7	1	3	8	2	6
6	7	5	1	3	9	2	8	4
1	3	8	6	4	2	9	5	7
9	4	2	5	8	7	1	6	3
5	9	4	3	7	8	6	1	2
7	2	1	9	5	6	4	3	8
8	6	3	4	2	1	7	9	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.